# brown book

# THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204133
UNIVERSAL
LIBRARY

OUP—391—29-4-72—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

ll No. T894 P89S Accession No. G T1199

thor ప్రభాకరశాస్త్రి, వేటూరి

tle సింహావలోకనము. 1955.

s book should be returned on or before the date last marked below.

శ్రీ ప్రభాకరపరిశోధకమండలి

ప్రచురణము సంఖ్య 7

# సింహావలోకనము

[సాహిత్యవ్యాసముల సంపుటి]

Post Graduate [illegible]
College of [illegible]

కర్త

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రకాశకులు

మేనేజరు, మణిమంజరి

ముక్త్యాల

1955] [వెల రు. 2-8-0

మన్మథ
శ్రావణము

ద్వితీయ ముద్రణము

వేయి ప్రతులు

# విజ్ఞప్తి

ఇటీవల ముక్త్యాలలో కవిసమ్రాట్టు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి యాధ్యక్ష్యమున శ్రీ ప్రభాకరపరిశోధకమండలి ప్రథమవార్షిక సమావేశములుజరిగినపుడు గావింపబడిన తీర్మానాను సారము శ్రీ శాస్త్రి గారి రచనములం గొన్నింటి నిప్పుడు 'సింహావలోకనము'గాఁ బ్రకటించుచుంటిమి.

ఏతద్గ్రంథముద్రణమున కగు నార్థికసహాయమును గావించి తోడ్పడిన మిత్రులు శ్రీ కనుపర్తి లక్ష్మీనారాయణరావుగారిని శ్రీ ప్రభాకరపరిశోధకమండలి కృతజ్ఞతతో స్మరించుచున్నది.

అచిరకాలమున నిది యిట్లు వెలయ ముచ్చటగా ముద్రించి యిచ్చిన 'వెల్డనుప్రెస్సు' వారిని, సరసనుండి శ్రమించిన శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారిని' సంభావింపకుండ నుండఁజాలము.

శ్రీ శాస్త్రి గారి యితర రచనములను, వారు సంపాదించిన సంస్కరించిన ప్రాచీనాంధ్రగ్రంథములను గ్రమముగాఁ బ్రకటింపఁజేయఁ దోడ్పడుదురుగా కని యాంధ్రమహాజనుల నర్థించుచున్నాము.

## ద్వితీయ ముద్రణము

# విజ్ఞప్తి


ప్రథమ ముద్రణపు ప్రతులు అచిరకాలముననే అయిపోవుట చేత ఈ ద్వితీయ ముద్రణమును ప్రకటించితిమి.

మేము కోరిన వెంటనే చక్కగా ఈ పుస్తకమును త్వరలో ముద్రించియిచ్చిన భారతముద్రణాలయమువారిని సంభావించుచున్నాము.

—ప్రకాశకులు.

# విషయసూచిక


| | | పుట. |
|---|---|---|
| ౧. | నన్నయకుఁ బూర్వపు ఛందస్సు | 1 |
| ౨. | రంగనాథరామాయణము | 14 |
| ౩. | తెలుఁగుకవితలోని దేసితనము | 31 |
| ౪. | రెడ్డిరాజులు - ఆంధ్రభాషాసేవ | 53 |
| ౫. | అన్నమయ్య | 83 |
| ౬. | వచనరచన - తాళ్ళపాకవారు | 90 |
| ౭. | హరవిలాసము | 115 |
| ౮. | మనుచరిత్రము | 148 |
| ౯. | శతావధాని వెంకటశాస్త్రి | 190 |



# నన్నయకుఁ బూర్వపు ఛందస్సు

మృదువై, మధురమై, అచ్చుమీఁగడఁ దలపించు నుచ్చారణము గలిగి, భావప్లుతము లగుపలుకుబళ్ళు కలిగి, వీనులకు విందుగూర్చు ఛందస్సందర్భము గలిగి, భావుకుల డెందములను పరితోష డోలికలలో నూగించుచున్న మన యాంధ్రభాషలోఁ బ్రబంధరచన మేకవీశ్వరుఁడు సాగించి నాఁడు? ఆ కవీశ్వరు నాదరించినరా జెవ్వఁడు? వారి దేశ కాలము లెవ్వి? యని యోజించి చూచినప్పు డాంధ్ర భారతరచయిత యగు నన్నయభట్టారకుఁడును, చాళుక్య రాజగు రాజరాజనరేంద్రుఁడును, రాజమహేంద్ర పురమును నిప్పటికిఁ దొమ్మనూఱేండ్ల క్రిందటి ప్రాఁత కాలమును దలఁపునకు వచ్చుచున్నది. ఏమి! నన్నయకుఁ బూర్వ మాంధ్రప్రబంధరచనము లేదా? అని సందేహము పొడమినప్పుడు తడవుళ్లాడుచుంటిమే గాని తత్పూర్వపుగ్రంథముల నెఱుఁగఁ జాలకున్నాము. ఆ గ్రంథముల యునికిని దెలుపుసాధనములనేని గట్టివానిని గనిపట్టఁజాలకున్నాము. నన్నయకుఁ బూర్వపు గ్రంథముల యభావ మెట్టిదో సరిగా నెఱుఁగరాదు. రాజమహేంద్ర పురమున నింక నీయభావచర్చ సాగించుటయు బాగుగా నుండదు. శ్రీనాథుని పరిహాసమునకుఁ బాలగుదుము.

బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులుగారు పరిశోధించిన యుద్ధమల్ల శాసన మొక్కటి మధ్యాక్కరలది నన్నియకుం బూర్వకాలమునాఁటిది. బ్రహ్మశ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారు ప్రకటించిన దీర్ఘాసి సీసపద్య శాసనము నన్నియనాఁటి దున్నది బ్రహ్మశ్రీ లక్ష్మణరావు పంతులుగారు సరిగా నన్నియనాఁటిదే యగు మఱియొక సీసపద్య శాసనమును ద్రాక్షారామమునందలి దానిని క్రొత్తగా నెత్తినారు. ఇట్టి వింకను దొరకవచ్చును. నేను కవిత యనుపదమును బర్యాప్తలక్షణ మయిన యుత్తమ గ్రంథరచనముద్దేశించి చెప్పినాఁడను. పాటలు, పదములు, కొన్ని తెలుఁగుల పద్యములు మొదలగుపాండిత్య నిరపేక్షము లగు రచనములును, వానిని బంధించు ఛందో వ్యాకరణ విధులును కొన్ని యంతకు ముందును గల వనుట నిశ్చయము. అన్నియు నన్నియయే కల్పించినాఁడని చెప్పఁజూచువా రాంధ్రభాషావ్యవహారమునే నన్నియ సృష్టించె ననువా రగుదురు. పాల్కురికి సోమనాథుని గ్రంథములో నప్పటి పదములు కొన్ని పేర్కొనఁబడినవి. తుమ్మెదపదములు, ప్రభాత పదములు, పర్వతపదములు, ఆనందపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు మొదలగునవి. మఱియు నాతఁడు బసవపురాణము నందుఁ బ్రాచీన శివభక్తుల చరిత్రములను, బురాతనము లయిన గీతములనుబట్టి రచించితి నని చెప్పుకొన్నాఁడు. పండితారాధ్యచరిత్ర కృత్యవతరణికలో—

“...అనియతగణై” రనియును ‘ప్రాసోవా’ యనియు ‘యతిర్వా’ యనియుఁ జెప్పు ఛందోవినిహితోక్తి గాన ప్రాస మైనను యతి పై నడి యైన...” అని ద్విపదలలో ‘అనియతగణైః’, ‘ప్రాసోవా’, ‘యతిర్వా’ యని సంస్కృతోక్తులను మూఁడింటి నుదాహరించినాఁడు. ఇవి ఛందస్సూత్రము లగు నని నేను దలంచుచున్నాఁడను. గణములు నియతముగా నుండ నక్కఱలే దనియు, ప్రాసము గాని యతిగాని యుండఁదగు ననియు పైవాని యర్థము. ఇవి తెలుఁగుభాషకు సంబంధించిన ఛందస్సులోని వగును. యతిప్రాసములగూర్చియు మాత్రాగణముల గూర్చియుఁ జెప్పినప్పు డవి తప్పక తెలుఁగుకే సంబంధించిన వగును గదా! సోమనాథుఁడు తిక్కనకు తర్వాతివాఁడు కాఁడనుట స్పష్టము. ఇంచుక పూర్వుఁడగు నని తలంచుచున్నాము. ఈతఁ డుదాహరించిన సంస్కృతచ్ఛందోగ్రంథము నన్నయ కంతెగా నర్వాచీనము కాఁగూడదు. ప్రాచీన మేమో! మఱియు ద్రావిడ భాషలో ‘యాప్పిరంగలమ్’ అను ఛందోగ్రంథము పదునొకొండవ శతాబ్దిది గలదు. అందు సంస్కృత కర్ణాటాంధ్రఛందస్సుల ప్రస్తావ మున్నది. “వాంచియార్ శెయిద వడఘుఛందవుం” అని యం దున్నది. అనఁగా “వాంచియ రచించిన తెనుగుఛందము”ను జూచి తా నా గ్రంథమును రచించినట్లు గ్రంథకర్త చెప్పుకొనుటలోఁ గలదు. ద్రావిడనిఘంటు కార్యాలయమున

విద్వాంసులుగా నున్న శ్రీ మూ. రాఘవయ్యంగా రిది గుర్తించిరి. శ్రీ రంగస్వామిసరస్వతిగారివలన నిది విని శ్రీ రాఘవయ్యంగారిని గలిసికొని సరిగా విచారించితిని. వాంచియ యనునాంధ్రచ్ఛందఃప్రణేత మనకుఁ దెలియ రాకున్నాఁడు. ప్రాచీనప్రతుల లిపిరీతిని బరిశీలించువారు వాంచియర్ అనుపదము రేచియర్ గా నుండఁదగు ననిరి. కొన్ని సంస్కృతశబ్దములు గూడ నం దిట్లే వికృతిఁ బొరసియున్నవి. రేచియార్ అని యగు నేని యా గ్రంథము రేచియ (రేచన) రచించినకవిజనాశ్రయ మగును. ఆ ద్రవిడగ్రంథకర్త జైనుఁడు. ఈ రేచియ యును జైనుఁడే. ఇది యొక ప్రాందిక యగును. ఇట్లగునేని కవిజనాశ్రయము కాకున్నచో మఱి యేదో వాంచియ రచించిన ఛందోగ్రంథ మొకటి యాకాలమున నుండె నని యీ ద్రావిడఛందోగ్రంథము చెప్పుచున్నది. ఆ ద్రావిడగ్రంథరచనాకాలము నన్నియకుఁ బూర్వమో, పరమో నాకుఁ దెలియరాలేదు. అతఁడు నన్నియకంటె ప్రాచీనుఁ డగునేమో!

మఱియుఁ దెలుఁగుయతులలో 'ము' విభక్తికయతి యని యొక యతి గలదు. తెల్గుఛందస్సులలో పు, ఫు, బు, భు లకు విభక్తిముకారమునకు యతి చెల్లు ననియు, నది పయియతి యనియుఁ జెప్పఁబడినది. నన్నియాదు లీయతిని వాడిరి. పు, ఫు, బు, భులకు విభక్తిముకారము నకు మాత్రమే యతి చెల్లుటయు, తక్కినపదమధ్యము

కారాదులకుఁ జెల్లకుండుటయు మన కిప్పుడు వింతగా నుండును. 'పుణ్యుఁడు రాఘవుండు వనముం గనియెన్' అనఁదగును గాని 'పుణ్యుఁడు రాఘవుఁడు మునిముఖ్యులతో' ననరాదు. దీనికి సరి యయిన కారణ మున్నది. తెనుఁగునం దిప్పుడు విభక్తి మకార మనఁబడుచున్న "ము" నకు "౦బు" "మ్ము" అను రూపాంతరము లున్నవి కదా! ప్రాచీనకాలమున నివి గాక 'బు' అనురూపము కూడ నుండెడిది. ప్రాచీనశాసనము లీయర్థమున సాక్ష్య మిచ్చుచున్నవి. ద్రావిడభాషాశబ్దము లిందుకుఁ దోడు పలుకుచున్నవి. మీఁదఁ జెప్పఁబడిన "వు" విభక్తికయతి 'వనబు' అనురూప మున్నకాలమున నేర్పడిన దగును. 'వనబు' అనురూపము పోయినతర్వాత ఛందోగ్రంథకర్తలు దానికి మువిభక్తికయతి యని పేరిడిరి. నన్నయ నాఁటికి 'వనబు' అన్నరూపము పోయినది. భారతమునఁ గానరాదు. ఈసాధనము యతిప్రాసలు, పద్యరచనము నన్నయకుఁ బూర్వమే కల వని స్పష్టపఱుచుచున్నది.

కాని నన్నయ తిక్కనల నడిమికాలపుఁగవులు కొందఱు చేసినకృత్యాదిస్తుతిప్రశంసలం దాంధ్రకవితాభ్యుదయమునకు నన్నయ ముఖ్యుఁ డని స్పష్టముగఁ గానవచ్చుచున్నది. కేతన మారన మొదలగువారి స్తుతులను జూడఁదగును. ఇది చూడుఁడు. నన్నిచోడఁడు—

'మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశకవితఁబుట్టించి తెనుం

గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్."

'జనసత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్' అన్న పాఠము పరిగ్రాహ్యము కాదు. *ప్రబంధరత్నావళి పీఠికలో నా విషయమును బ్రపంచించి వ్రాసియున్నాను.

పైపద్యమునఁ జాళుక్యరాజనఁగా నిప్పుడు మనకుఁ బ్రస్తుతుఁడును, నన్నియ యాంధ్రభారతకృతికిఁ గారయి

---

* నన్నిచోడఁడు — ఈ కవికా నిర్ణయాదికమునుగూర్చి పెక్కురు చర్చించియున్నారు. అన్నిచర్చల పర్యవసానము నింతే. ఈ కాలమువాఁ డనినిర్ధారించుటకుఁ దగిన సాధనములు లేవు. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగా రాంధ్రుల చరిత్రమున నిట్లు వ్రాసినారు. "క్రీ 925-40 సం. ప్రాంతమున నున్నయీసత్యాశ్రయుని నన్నెచోడమహాకవి తనకుమారసంభవకావ్యమున నీ క్రిందిపద్యములోఁ బేర్కొని యున్నాఁడు.

'క. మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్రవిషయమునఁ
జన సత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్."

దీనింబట్టి నన్నయభట్టారకునకు నూఱేండ్లకుఁ బూర్వమే యాంధ్రకవితాసతి వర్థిల్లుచున్న దని స్పష్టమగుచున్నది."

తయునగు రాజరాజనరేంద్రుఁ డగు నని నేను దలంచు చున్నాఁడను. అతఁడు కాఁ డని చెప్పుట కట్టి ప్రస్తుతికిఁ దగినవాఁడు వేఱొకఁ డగపడవలెను గదా! పై పద్యమం దాంధ్రకవితఁ బుట్టించి తెనుంగును నిలిపి రని యుండుట లోఁతుగా నాలోచింపఁదగినది. పైవిషయములనన్నిఁటిని

---

శ్రీ వీరభద్రరావుగారు గాని, మఱియెవరు గాని నన్ని చోడఁడు నన్నియకంటెఁ బ్రాచీనుఁడని చెప్పఁజూచుటకును, గావచ్చు నని లోకము విశ్వసించుటకును నీ పద్యమే ప్రధానాధారముగా నున్నది. శ్రీరామకృష్ణకవిగారు ప్రచురించిన కుమారసంభవపు ముద్రితప్రతిలో నీపద్య మిట్లున్నది. 1908 సం॥ దీనిని ముద్రించినారు. అప్పు డీపద్యమునకు వారు పాఠాంతరమును జూపలేదు. వారి యచ్చునకు మాతృక యెక్కడిదో చెప్పనులేదు. కాని తంజాపురపు సరస్వతీ పుస్తకభాండాగారమునఁ దాటియాకులపై వ్రాయఁబడిన కుమారసంభవపుఁ బ్రతి యున్నది. అక్కడఁ దక్క నింతవఱకుఁ బ్రత్యంతర మెక్కడను మనకుఁ గనరాదు. వినరాదు. ఆ పుస్తకములోఁ బై పద్య మిట్లున్నది.

"క. మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్."

కవిగారికి "చన సత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్" అన్న పాఠ మెక్కడనుండి వచ్చినదో! వారింక నెక్కడి ప్రతి సంపాదించినారో! ప్రథమభాగమును ముద్రించు నప్పటికి వా

బర్యాలోచింపఁగా నిట్లు తోఁచుచున్నది. నన్నియ నాఁటికి తెనుఁగున నెలకొన్న రచనములు పాటలు, పదాలు, ఏలలు, జోలలు, అర్ధచంద్రికలు మొదలగు గేయరచనములును, అక్షరగణములతోఁ గాక మాత్రాగణములతో నిబద్ధము లగు అక్కరలు, రగడలు, సీసములు, గీత

---

రీతంజావూరుప్రతి నెఱుఁగనే యెఱుఁగరు గావలయును. ఎఱిఁగి యుండిరేనియనర్థమగు నీ పాఠమును జూపకుండుట కేమికారణము ? తంజావూరు పుస్తకశాలలో నన్నిచోడని కుమారసంభవ మున్నదని యెల్లరు నెఱిఁగిన తర్వాత క్రీ. 1914-లో వీరు ప్రచురించిన కుమారసంభవపు రెండవభాగమున "చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్" అను పాఠాంతర మున్నట్లు తెలిపిరి. కాని యిప్పు డయినను దంజాపురపుఁ బుస్తకమును వీరు చూచినట్లు వ్రాయలేదు. కావున నీ పాఠము మఱియొక ప్రతిలోఁ జూచినారేమో ? అత్యాహా లెందులకు ? తంజావూరు పుస్తకపాఠము మాత్రమే మన కిప్పుడు గ్రాహ్యము - శ్రీ కవిగారి పాఠము గలమాతృక బయల్పడువఱకును. అట్టి ప్రత్యంతరము బయల్పడెనా యది పాఠాంతరముగాఁ గూర్చుకొందము. ఇఁకఁ "చాళుక్యరాజు మొదలుగ" నన్నప్పుడు రాజరాజనరేంద్రుఁడే యేల కారాదు ? చోడఁడు నన్నయకంటెఁ బ్రాచీనుఁ డనుట కాధారములు తగినవిలేవు. శ్రీ వీరేశలింగము పంతులుగారు నన్నిచోడని భాషాప్రయోగములనుగూర్చి చేసిన యాక్షేపములు నిలువఁజాలనివి. వాని నెల్ల నిర్వచించుట కిక్కడ స్థలము చాలదు. పాల్కురికి సోమనాథుఁడు 1180 ప్రాంతముల నున్నవాఁ డను పంతులవారి సిద్ధాంతము పోలును. నన్నిచోడఁ డంతకు ముందటివాఁడో వెనుకటివాఁడో సిద్ధాంత మేర్పడలేదు

ములు, మంజరి, తరువోజ, ద్విపద మొదలగు పద్యరచన ములును, వాని ప్రకృతులును, నై యుండును

నన్నియ యిట్టివానిని గొంత సరిపఱిచి, సీసములు, గీతులు, అక్కరలు మొదలగువానిఁ జేర్చి కన్నడమునఁబోలె చంపకోత్పలాదు లగునక్షరగణబద్ధము లైన

గదా! ఈ యిద్దరిలో నొకనిపుస్తకము నింకొకఁడు చక్కఁగా సంగ్రహించుకొన్నాఁడు. ఇది చదివి చూడుఁడు!

ద్వి. నెట్టన నేలయు నింగికి నూఁద
పట్టు మ్రోఁకాళ్ళకు బట్టపలలకు
ముడివెట్టఁ దనరిన గడపంగఁ బాలు
వడి నెంతమాపుల కిడుగిల్లు పట్ట
పాయని రెంటిఁగాఁ బాదుకొనిన
ప్రేయఁ బుల్లులున్న గోరో యని యమ్మ
దానార యొలువఁ జట్రాతిపైఁ గ్రుంక
నేమంగుపుడు దోమ నిసుమంత్రా ద్వేన
లలిగొన చెనలు రాళములు వాయింపఁ
జెలఁగుచు రోఁకటఁ జిగురులు గోయఁ
గలి వెన్న పుప్పఁ గొంచలు దొంచఁ జేర్ప
నిల మంచుఁ గుంచానఁ గొలువ రేఁబవలు
నేయ నాకసమునఁ జిత్రరూపములు
వ్రాయ వాయునుఁ బట్ట వడగళ్ళ గుళ్ళు
గట్ట వెన్నెల గుంపుగాఁ జేయ వచ్చి
పుట్టినప్పుడె నేర్చుబుద్ధులప్రోఁక."

—బసవపురాణము

వృత్తములను గూడఁ గూర్చుకొని కొంత క్రొత్త సంస్కారము గావించి సత్ప్రబంధరచనము సాగించినవాఁ డయి యుండును.

నన్నయరచనముకంటెఁ బ్రాచీనముగాఁ దెలియుచున్న యుద్ధమల్లశాసన మెల్ల నక్కరలతోనే చెక్కఁబడి

సీ॥ నేఁయు సిఁగియుఁ దాలముల్ వాయింప
నెండమావులఁ బట్ట బండతలయు
మ్రోఁకాలు ముడివెట్ట రోఁకటఁ జిగురులు
గోయఁ బ్రొత్తిపైఁ గ్రుంగ నిడుపు
లేక చిత్రము వ్రాయ నాకాశమునఁ దాఁప
రము నిడ మంచుఁ గుంచములఁ గొలవ
నేనుంగుపురు డోమ దానారఁ గొన గాలి
గంటిడ నిసుమున గట్టుదాల్ప
గీ॥ నీరినడుము దెంప నేలఁ దెన్నుండి చే
వెల్వఁ గలియుఁ దచ్చి వెన్న గొనఁగఁ
గడవ నేర్వ గలిగి కందువు మానెఁదై
కత్తిగంటు లయినయత్తగండు.

కుమా, 8 ఆ.—135 ప.

యిట్టి యిర్వుర గ్రంథములనుండియు వలసినన్ని సంవాదములు చూపవచ్చును. సులువుగా ద్విపదలో సోమనాథుఁడు కూర్పఁగా నన్నిచోడఁ డిట్లు సీసపద్యమునఁ జేర్చుకొన్నాఁడేమో! సుసూక్ష్మ

నది గదా! ఇట్లగుచేని ఈ నన్నయ నాదరించినచాళుక్య రాజు (రాజరాజనరేంద్రుఁడు) నన్నిచోడఁ డన్నట్లు దేశి కవితఁ బుట్టించి తెనుఁగు నిలిపినవారిలో ముఖ్యుఁడు గాఁగలుగును. నన్నిచోడమహాకవిచే దేశికవితను బుట్టించి తెలుంగు నిలిపినవాఁ డని కీర్తింపఁబడిన యీచాళుక్య చక్రవర్తి రాజరాజనరేంద్రుఁడు రాజధాని యగురాజ మహేంద్రవరమున పట్టాభిషిక్తుఁ డయి యిప్పటికి సరిగా తొమ్మన్నూర్లేఁ డ్లయినది. ఆనాఁటి యారాజ్యస్థితిని, నాపట్టాభిషేకోత్సవసంరంభమును, నా నన్నియాదుల యునికిని నవధానముతో నొకతూరి స్మరించి చూచి నప్పు డంధ్రభాష నభిమానించువారికిఁ బులకోద్గమము కలుగును.

నన్నయ నారాయణభట్టు మొదలగు కవీశ్వరు లా రాజేంద్రుని యాస్థానమున విద్వత్కవులుగా నెలసియుం డిరి. మహావీరాచార్యుని సారసంగ్రహగణితమును దెలిఁ గించిన పావులూరి మల్లన తాత యగుమల్లన కాతఁడు నవఖండవా డనునగ్రహారము నొసఁగెను. నారాయణ భట్టారకున కారాజరాజనరేంద్రుఁ డొసఁగిన నందంపూడి

---

ముగా నీ యిద్దర కృతులను బరిశీలించినచో నీవిషయము బయల్పడఁగలదు భాషావ్యుత్పత్తిలోఁ జోడఁడును, సోమనాథుఁడును గూడ సమధికులే యని యాయా గ్రంథములఁ జక్కఁగం జదివి యెఱిఁగినవారు భావింతు రని నానమ్మకము.

దాన శాసనము, నన్నియరచితము, తెలుఁగున శ్రీజయంతి రామయ్యపంతులుగారిచేఁ బ్రకటితము ప్రఖ్యాతమే గదా! కోరుమిల్లి శాసనము రెండవది.

ఆంధ్రలోకము విద్యావిజ్ఞానములతో వెలసి యుండునంతకాలము రాజరాజనరేంద్రుని యశశ్చంద్రుఁడు తేజరిల్లుచునే యుండును. సత్యసారాంధిపాచార్యుఁ డనఁబడిననన్నియవంటి మహామహుల కాశ్రయమయిన యీ రాజరాజనరేంద్రుని కిటీవలివా రన్యాయముగ నొకయపదూరు నంటఁగట్టినారు. సారంగధరకథ యందఱకు నెఱుకలో నున్నదే కదా! అన్ని ప్రాచీన గ్రంథములలోను నాకథ మాళవదేశమున మాంధాతపురమున జరిగిన దని యున్నది. రాజమహేంద్రవరమున నున్న మానరాజరాజనరేంద్రునితలకుఁ దగిలించుట యన్యాయ్యము ఈ నడుమనే యొక రట్లు తప్పుగా వ్రాయఁగా నీవిషయమును విపులముగ చర్చించి యాంధ్రపత్రికలోఁ బ్రకటించితిని. అది యెల్ల మఱలఁ జెప్పుట చర్వితచర్వణ మగు నని మానుచున్నాఁడను. పలువు రావాదప్రతివాదములు చూచియుందురు. రాజరాజనరేంద్రుని పయి యన్యాయముగాఁ గల్పింపఁబడిన యీయపప్రథ నపాకరించి మన మానరేంద్రుని పుణ్యశ్లోకత్వమును రాద్ధాంతపఱచుదము.

నే నీవ్యాసము వ్రాసినపిదప శ్రీ లక్ష్మణరావు గారు బట్టర్వర్తు ముద్రించిన నెల్లూరు శాసనములలో నిది వఱకుఁ బద్యరచనములుగా నూహింపఁబడుచున్న పండరంగని శాసనములు రెండును తొమ్మిదవశతాబ్ది తర్వోజ సీసములుగా గుర్తించినారు. పద్యరచన తొమ్మిదవశతాబ్దిలో నుండెనని యిది స్పష్టపఱుపఁగలదు. ఆపద్యములు మాత్రాగణబద్ధములే యనుటయు నాలోచింపఁదగిన విషయము.

౨

# రంగనాథ రామాయణము

రంగనాథరామాయణమును బరిశీలింపఁగా గ్రంథకర్తృకవిషయ మిా క్రిందితీరున నున్నది, గోనకాటభూపతి. తత్పుత్త్రుఁడు గోనరుద్రభూపతి. తత్పుత్త్రుఁడు బుద్ధభూపతి. తత్పుత్త్రుఁడు విట్ఠలభూపతి. తత్పుత్త్రుఁడు బుద్ధభూపతి. ఈ బుద్ధభూపతియే తమ తండ్రి విట్ఠలభూపతిప్రేరణముఁ దదంకితముగా రామాయణము రచించెను. గ్రంథమునుబట్టి చూడఁగా వీ రేజాతి వార్లో తెలియరాదు. క్షత్రియులనియేని, శూద్రు లనియేని గుర్తింపఁ దగ్గ యాధారము లేవియు గ్రంథమున లేవు.

గోనకాట
|
రుద్ర
|
బుద్ధ
|
విట్ఠల
|
బుద్ధ-(గ్రంథకర్త)

అనేక ప్రతులలో 'గోన' అని, కొన్నింట 'కోన' అని కాననగును. 'కోన' పాఠమునే గ్రహించినచో గ్రంథకర్త బుద్ధభూపతి—గోదావరీతీరపు కోన రాష్ట్రమును—నేఁటి కోనసీమను—పూర్వము పరిపాలించిన కోనాన్వయు లగుక్షత్రియులలోనివాఁ డగు నేమో యని యనుమానింపఁగూడును గాని, యింతవఱకు నా కోన వంశ్యక్షత్రియులలోఁ బయిపేళ్ళవా రెవ్వరును గాన

రామిచేతను, బెక్కు-ప్రతులలో 'గోన' ఉండుట పరి
గ్రాహ్యతర మగుటచేతను నై యనుమానము పరి
త్యజింపఁదగినదే యనవచ్చును ఇఁక 'గోన' పాఠమునే
పరిగ్రహించి చూడఁగాఁ బశ్చిమాంధ్రదేశమున-ననఁగా
నేఁటి నిజాంరాష్ట్రమున గద్వాల వనపర్తి రాజ్య
ముల ప్రాంతమునఁ గలవర్ధమానపురమున (వడ్డమాని
వారు అని యింటిపేరు ఈ యూరినిబట్టి వచ్చినదే)
కాకతీయసామంతులుగా రాజ్య మేలినవారు ఏతత్కృతి
కర్తృ వంశపురుషనామసమంచితులు క్రీ॥ శ॥ 12, 13
శతాబ్దులలోఁ గొందఱు శాసనములందు గుర్తింపఁబడు
చున్నారు. గోన బుద్ధయకుమార్త 'శ్రీ గోనవంశ
జనిశేఖర బుద్ధియాఖ్యపుత్రీపవిత్రచరితా' యగు కుపమ
శక 1198 ధాతృసంవత్సరమున ('వసునందశంకరమితే
శ్రీ ధాతృసంవత్సరే') బూదపూరిలో లింగప్రతిష్ఠ చేసి
భూదానము చేసిన ట్లొక శాసన మున్నది. మఱియు శక
వర్షములు 1216 అగు జయవత్సరమున 'శ్రీమతు
మీసిరియారగండ గోనగన్నయరడ్డివారు వర్ధమానపుర
మందు సుఖసంకథావినోదంబు (న) ప్రిథువిరాజ్యము
సేయుచుండగాను తద్రాజ్యరక్షామణి యయిన 'విఠాల
నాథభూనాథుండు' రాచూరిపట్టణ ప్రవేశాభిముఖుండై
...దుర్గము రచించి' న ట్లొక శాసన మున్నది.

ఈ రెండు శాసనములలో తొలిశాసనము క్రీ॥ శ॥
1276 సంవత్సరమునాఁటిది. రెండవ శాసనము క్రీ॥ శ॥

1294 సంవత్సరమునాఁటిది. రెంటింటికిని బదునెనిమిది సంవత్సరముల యంతర మున్నది. ఇందుఁ దొలిశాసనమునఁ బ్రస్తుతుఁ డయిన 'గోన బుద్ధయ'— మన రామాయణ కృతికర్త యగు గోనబుద్ధయ కాఁడు, యాతని తాతబుద్ధయ కాని కాఁదగును. ఒక్క-బుద్ధయయే కాని రాయచూరి శాసనమునఁ గాననగు గోన గన్నయరెడ్డివా రీరంగనాథరామాయణమునఁ గానరారు. కాని రంగనాథోత్తరరామాయణ మని సరిగా నీ రంగనాథరామాయణముఁ బోలినద్విపద రచనావిధానము గలది, షట్కాండాత్మక మయిన యీ రామాయణమునకుఁ బరిశిష్ట మనఁదగిన ఉత్తరకాండ కథారచనము, గోన కోటగన్నభూపాలుని కుమారుఁడగు బుద్ధభూపతికిఁ బుత్త్రులగు కాచవిభు విట్ఠల భూపతులు తమతండ్రిపేర రచించినది మఱొక గ్రంథము కలదు. అందుఁ గానవచ్చుగోన కోటగన్నభూపతి రాయచూరి శాసనపు గోన గన్నయరెడ్డివారు కాఁదగుదురు. రాయచూరి (కోట) దుర్గనిర్మాణాదికము జరపించుటచే గన్నయరెడ్డి వారికి 'కోట' గన్నయ యని పే రేర్పడియుండ వచ్చును. ఇట్లీ యుభయగ్రంథకర్తృవంశముల నిట్లు సమన్వయింపవలెను. మన రంగనాథరామాయణకర్త తాత యగుబుద్ధభూపతికి బూదపూరి శాసనప్రస్తుత 'కుప్పమ' కుమార్తె. ఆబుద్ధభూపతికి విట్ఠల కోటగన్న భూపతు లిర్వురును గొడుకులు. ఈ కొడుకు లిద్దఱును దమతండ్రి బుద్ధభూపతిపేరే తమ కొడుకు లిద్దఱకుఁ బెట్టిరి.

విట్ఠలుని కొడుకు బుద్ధభూపతి పూర్వరామాయణకర్త యయ్యెను. ఆతనికి వేలు విడిచినసోదరుఁ (పితృవ్య పుత్రుఁ) డగు బుద్ధభూపతి కొడుకులు కాచ విట్ఠల భూపతులుత్తరరామాయణకర్తలయిరి. పూర్వోత్తరరామాయణములకు సహోదరుల కొడుకు, మనుమలు కర్త లగుట తెలినవిషయము. ఇది యిట్లేయేని వంశవృక్ష మీ తీరున నుండును.

గోనకాటభూపతి

రుద్రభూపతి

బుద్ధభూపతి

బూదపూరిశాసనము — రాయచూరు శాసనము

కుప్పమ (1276 A. D.) | విట్ఠలభూపతి | గన్నభూపతి (1294 A. D.)

విట్ఠలభూపతి → బుద్ధభూపతి (పూర్వరామాయణకర్త

గన్నభూపతి → బుద్ధభూపతి → కాచవిభుఁడు, విట్ఠలవిభుఁడు (ఉత్తరరామాయణకర్తలు)

ఉభయరామాయణములందును కృతికర్తల కుల మేదో తెలియరాకున్నను శాసనములఁబట్టి 'గోన వంశమువారు శూద్రులు, 'రడ్లు' అని యేర్పడుచున్నది. కాన రంగనాథోభయరామాయణకర్తలను మనము

రెడ్డిజాతివా రని నిర్ణయింపవచ్చును. మీఁది సందర్భము లన్నింటినిబట్టియు నీరెడ్లు నాఁటి పశ్చిమాంధ్రరాష్ట్ర మందలి వర్ధమానపురమున కధీశ్వరు లని నిర్ణయింపఁ దగియున్నది. మఱియు గ్రంథస్థ మగు నీ క్రింది ద్విపదయు కూడ రంగనాథరామాయణకర్త నేఁటి నిజాంరాష్ట్ర ప్రాంతపువాఁ డనుటకు సాధక మగు నని నా తలఁపు.

'వేదాద్రిగుహాలలో విహారించువాఁడు.

..........................'

ఈ వేదాద్రి నిజాంరాష్ట్రమున ప్రసిద్ధ మైనరాచకొండప్రాంతపు వేదాద్రి యను నానమ్మకము. ఆకాలమున నా వేదాద్రి చాలఁ బ్రసిద్ధిగన్నది. తద్దేశవాస్తవ్యులు కాకతీయసామంతులు, తర్వాత స్వతంత్రులు. వెలుగోటివెలమరాజులు వేదగిరి వేదాద్రి నామములఁ దత్పర్వతిపూజ్యతా జ్ఞాపకములుగాఁ దాల్చిరి.

పై పరిశీలనమునుబట్టి రంగనాథోభయరామాయణములును క్రీ. శ. పదమూఁడవశతాబ్ది తుదభాగమున ననఁగా క్రీ. శ. 1280–1300 ప్రాంతమున రచితమైనట్లు తేలును. అది కాకతీయరుద్రాంబ పాలనపుఁ దుదికాలమును, గాకతీయప్రతాపరుద్రుని పాలనపుటారంభకాలమును నగును. ఇది యట్లే యగునేని రంగనాథరామాయణకర్త రంగనాథుఁ డనీ, ఆతఁడు ప్రతాపరుద్రుని నాఁటివాఁ డనీ, రంగనాథరామాయణమునకుఁ బ్రతిగా ప్రతాపరుద్రుఁడు భాస్కరునిచే

రామాయణము రంచింపింపఁ బూనినాఁ డనీ చిరంతనముగా వెలయుచున్న ప్రతీతి రక్షిత మగుచున్నది. గోనబుద్ధ కాచ విట్ఠల ప్రభులకు రంగనాథుఁ డనుకవి యొకఁడు గ్రంథరచనమునఁ దో డయి యుండు ననుట యవిశ్వాస్య మనఁజాలను. మఱియు. రంగనాథునివి, రంగనాథ రామాయణేతరములు, రచనములు లక్షణ గ్రంథములందుఁ గలవు గాన యట్టికవి నొకని నంగీకరింపక తప్పదు. మఱియుఁ దొలుత వీరవైష్ణవుఁడై బహుగ్రంథముల రచించి చక్రపాణిరంగనాథుఁ డన్న పేరుతో వెలసినట్లును, పాల్కురికిసోమనాథునితో వాదించి యోడిపోయినట్లును శివద్వేషముచేఁ గన్నులు పోఁగా శ్రీశైలప్రదక్షిణము చేసి శైవుడై నయన రగడను రచించి కన్నులు పడసినట్లును స్థానికచరిత్రలందుఁ గలదు. ఇట్లు ప్రాచీనగ్రంథములందుఁ బ్రస్తుతుఁ డయిన చక్రపాణిరంగనకవియే మనబుద్ధ భూపాలునకు రామాయణరచనలోఁ దోడ్పడిన రంగనాథుఁడు కాఁగూడదను. ఆతనిని గర్ణాటశైవకవులును, స్థానికచరిత్రలునే కాక 14వ శతాబ్దినాఁటి దగు శివయోగసారమును బ్రశంసించుచున్నది. ఆతని గ్రంథము *నయనరగడ ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నున్నది.

* ఇటీవల చాటుపద్యమణిమంజరి ద్వితీయభాగములోఁ బ్రకటింపఁబడినది.

మన రంగనాథరామాయణమున మూలమునఁ గానరానివి పెక్కుచోట్ల వైష్ణవ మతాభిమానరచనలు ప్రబలముగాఁ గానవచ్చుచున్నవి. అవి ప్రక్షిప్తము లన వీలులేక యనేక ప్రతులలో సమానరీతిగాఁ గానవచ్చుచున్నవి.

మఱియు రంగనాథరామాయణరచనాకాలమునఁ బశ్చిమాంధ్రదేశమందు వైష్ణవమతము ప్రబలియుండుట నక్కడి శాసనము లానాఁటివి పెక్కులు నిరూపించుచున్నవి.

మఱియు రంగనాథరామాయణరచనానంతరము దానిఁ జూచి భాస్కరాదులు భాస్కరరామాయణము రచించి రనుటకుఁ దార్కాణగా రంగనాథరామాయణ రచనా సంవాది రచనలు భాస్కరరామాయణమునఁ బెక్కు లున్నవి. ఇర్వురును వాల్మీకము ననుసరించి వేర్వేఱుగానే యట్లు రచించి యుండరాదా యనఁ గుదురదు. వాల్మీకమునఁ గానరాక రంగనాథభాస్కర రామాయణముల మాత్రమే గోచరించు విషయములు భాషారచనాసామ్యము గూడఁ గలవి పెక్కు లున్నవి. వాని కూర్పు తీరులఁబట్టి పౌర్వాపర్యము రంగనాథ భాస్కరరామాయణముల కే క్రమముగాఁ దోఁచును. పై వ్రాఁతకు సారాంశము—.

రంగనాథరామాయణకర్త 'గోన' ఇంటిపేరి వాఁడు. ఆతఁడు రెడ్డిరాజు. కాకతీయసామంతుఁడు. వర

మాన పురాధీశ్వరుఁడు. క్రీ. శ. 1290 ప్రాంతమువాఁడు. రంగనాథుఁడనుకవి యాతనికిఁ గృతిరచనమునఁ దోడ్పడి యుండవచ్చును రంగనాథరామాయణము దొల్లిటి రచనము. భాస్కరరామాయణము తర్వాతి రచనము. చిరంతనప్రతీతి యట్లే గలదు.

* * *

[రంగనాథుఁ డనుకవీశ్వరునిగూర్చి యిటీవల చెలరేఁగిన వాదదావాగ్నిలోఁ జిక్కినది నే నొడలు కాల్చుకొనఁజాలను. ప్రాచీనకావ్య లక్షణ శాస్త్ర కవిచరిత్రాది పరిజ్ఞానము గొల్పుటలో నాకుఁ బ్రాచీన లక్షణగ్రంథకర్తలు పితృతుల్యులు. ఉపాస్యు లయ్యెడు వారి పరిజ్ఞానము నుత్తుతిదానిఁ గా నే నూఁది వేయఁజాలను. వారు భ్రమప్రమాదములు లేనివారనఁ గాదు. ప్రబల ప్రమాణములచే నట్టి వట్టిసరకును నిరూపించి కొట్టివేయుట లగ్గు. రంగనాథునిగూర్చి యుపలబ్ధాంశముల నెత్తి చూపుటకే నా యీయుపక్రమము. ఇందు ప్రామాణ్యాప్రామాణ్యచర్చను ప్రాజ్ఞులు కావింపగలరు గాక !]

కర్ణాటకకవి యగు తోంటదార్యకవి 'పాల్కురికి సోమేశ్వరపురాణము'న రంగనాథుని విషయము నిట్లు చెప్పినాఁడు. "చక్రపాణి రంగనాథుఁ డనువైష్ణవునితో సోమనాథునకు మతవిషయమునఁ దగవు వాటిల్లెను. ఆ శైవుని దర్శింపఁడు గాన సోమనాథుఁడు తెర

చాటున నుండి వాదము చేయ నంగీకరించెను. కాని యా వైష్ణవుని జయించుటకు సోమనాథుని పుత్రుఁ డగు చతుర్ముఖ బసవేశ్వరుఁడే తలపడెను. వారి ద్వారకును గొప్పవాదము జరిగెను. రంగనాథుఁ డోడిపోయెను. పరాజయదుఃఖముతో నా రంగనాథుఁడు శ్రీశైలమార్గముననే తిరిగి పోయెను. శ్రీశైల మల్లికార్జునునిఁ జూడక ద్వేషబుద్ధితోనే యరిగెను. ఆ శివద్వేషముచే నాతనికిఁ గన్నులు గ్రుడ్డి వయ్యెను. అహోబలమున కరిగి యాతఁడు నరసింహస్వామిని ప్రార్థించెను. ఆ స్వామివలన స్వప్నమున శివాధిక్యబోధమును బడసి లజ్జితుఁడై తిరిగి శ్రీశైలమునకు వచ్చి మల్లికార్జునని బహువిధములఁ బ్రస్తుతించెను. ఒక కన్ను వచ్చెను. పద పడి పాలుకురికికి వచ్చి సోమనాథుని దర్శించి యపచారము క్షమింపఁ బ్రార్థించెను సోమనాథుఁ డనుగ్రహించెను. రెండవ కన్నును వచ్చెను. రంగనాథుఁడు శైవదీక్ష నొసఁగు మని సోమనాథునిఁ బ్రార్థించెను. పుత్త్రుఁ డగు చతుర్ముఖ బసవేశ్వరునిచేత సోమనాథుఁ డాతని శివదీక్షితునిఁ జేయించెను. రంగనాథుఁ డప్పుడు వీరభద్రవిజయ శరభచరిత్రాదులను రచియించి గురుపాదముల కర్పించెను.''

ii

పాల్కురికి సోమనాథపురాణమే కాక కర్ణాటక కృతి యగు గురురాజచరిత్రము గూడ నీ చక్రపాణి

రంగనాథుని చరిత్రము జెప్పుచున్నది. తొంటిదార్య కవి చెప్పినట్లే యీ గురురాజ చరిత్రకర్త సిద్ధనంజేశ కవియు రంగనాథుని యోటమిని జెప్పినాఁడు. 'వీరభద్ర విజయము' 'శరభలీల' యను గ్రంథములనే కాక యాతఁడు శ్రీగిరినాథవిక్రమ మని యేనూఱు సీసపద్యముల తెలుఁగు గ్రంథమునుగూడ రచించెనఁట! దానినే సంస్కృతమునఁ గూడ రచించెనఁట! ఆ కవి యిట్లు చెప్పుచున్నాఁడు.

'శ్రీశైలభర్తకును సీసంబు లేనూఱు
లేనప్ప పద్యంగళెంటు సావిరగళుం
భాసురద దండకంసాహస్ర తారావళియునాల్కు లయగ్రాహియు
ఆశతక వృత్తగళు దోధకం సావిరవు
భాసురద తోటకం నూఱు రగళెగళేళు
భాషిసిద మత్తకోకిల మూఱు సాసిరం గీతియుం తాఱుమూఱు
సరస మంజెర వెంటు కందంగళైనూఱు
విరచిసిద కృతియు మూవత్తాఱు గద్యగళు
నిఱువ మూవత్తాఱు వృభయశతకం వొప్పుమిగులు వర్వేశనిమగె.'

ఇందు 'శ్రీగిరినాథ విక్రమము' అనుపేర శ్రీశైలమల్లికార్జునునిపై నైదువందల సీసపద్యములను, నెనిమిదివేల పద్యములు గల మఱొక గ్రంథమును, వేయి పాదములు గల దండకమును, నొక తారావళిని, నాలుగు లయగ్రాహులను, నొక వృత్తశతకమును,

వేయి దోదక వృత్తములను, నూఱు తోటకవృత్తములను, నేడు రగడల్లను, మూఁడువేల మత్తకోకిలలను, నాఱుశందల గీతపద్యములను, నెనిమిది మంజరులను, నైనూఱు కందములను, ముప్పదియాఱుగద్యములను, ముప్పదియాఱు ఉభయశతకములను జెప్పినట్లు ఈ పద్యముసం దున్నది ఇతని యీ కృతులెల్ల నిప్పుడు మనకుఁ గానరావు.

iii

కాని శివదూషణచేఁ గన్నులుపోఁగా శివస్తుతిచేఁ గన్నులు తెచ్చికొన్నట్లుగా రంగనకవి రచించినట్లుగా శ్రీగిరి మల్లికార్జునునిమీఁద రగడ యొకటి యున్నది. 'శివభక్తిదీపిక' యని దానికిఁ బేరు. దానికి 'నయన రగడ' యని నామాంతరము.

iv

నేఁడు శివమంత్రవర్ణనము అనుపేర మఱియొక రగడ రంగనాథుఁడు రచించినదిగానే దొరకినది. నమశ్శివాయరగడ యని దీనికి నామాంతరము. దీని కడపట నీ క్రిందిపద్యమున్నది.

'అని మన ? (ముసు ?) రంగనాథుఁడు దయానిధి శ్రీగిరి నాథుమీఁదఁజె
ప్పినశివమంత్రవర్ణనము చిత్తసముద్గతభక్తియుక్తి వ్రా
సినఁ గొనియాడినన్ వినినఁ జెల్వెసలారఁ బఠించినన్ జగ
జ్జనులకుఁ బుణ్యసంపద లసంఖ్యములై సమకూఱు నిమ్మహిన్.

ఈ పద్యమును రంగనాథుఁడే రచించెనో లేక తర్వాతికాలమున నితరుఁడే రచించెనో! సిద్ధనం జేశవి పద్యములో లెక్కింపఁబడిన రంగనాథుని రగడ లేడింటిలో నిప్పటికి రెండు రగడలు దొరికిన వన వచ్చును. 1. శివభక్తిదీపిక యను నయనరగడ 2. శివమాంత్రివర్ణన మను నమశ్శివాయరగడ.

v

శివభక్తిదీపిక వ్రాఁతప్రతిలో కడపట నిట్లున్నది.

'వైష్ణవ చక్రపాణి రంగనాథుఁడు శైవదీక్షాధారణమైన తర్వాతను చేసిన నయనరగడ'

vi

'ఏకశిలానగర వృత్తాంతము' లో రంగనాథుని గూర్చి యిట్లున్నది.

'రంగనాథుఁడు ఆందోళికపై నెక్కి చనుదెంచు నప్పుడు త్రిపురాంతకదేవుని గోపురంబు జూచి 'అది యేమి?' యని యడిగిన నావివరాలు త్రిపురాంతక గోపురం బని పలుకుటయు నాశివభవనంబు జూడ నొల్లక మైనప్రజల్లు కప్పించుకొనియె. అప్పుడు రంగనాథుని నేత్రంబులు గానరాక జాత్యంధుని వలెనే మగిడి శ్రీరంగానకు పోయి యద్దేవుని ప్రసన్నుని జేసికొని నేత్రంబులుపోయె నని మొఱయిడుటయు, నద్దేవుండు కరుణించి త్రిపురాంతకదేవుణ్ణి వేడుకొమ్మనుటయు, రంగనాథుండు మళ్లీ త్రిపురాంతకమున కేతెంచి యద్దే

వునకు నమస్కరించి తన యెత్తుకృతులు సమర్పింతు నని వ్రతంబు చేసి భక్తిమయం బగురగడ చెప్పిన నద్దేవుండు ప్రసన్నుండై రంగనాథునకు నిరుకన్నుల నొసగుటయు రంగనాథుండు పాలకూర్తికిం జని సోమనాథునిచే శివదీక్ష గైకొనియె ఆయయ్యవద్ద శైవరహస్యంబులు తెలిసి కొనుచుండె. అంత నిక్కడ ప్రతాపరుద్రుండు రంగ నాథుని ప్రభావంబు విని యాశ్చర్యంబు నొందెను.' రంగనాథుని గూర్చిన పైకథ నిన్ననో నేఁడో యెవరో సృష్టించి రని యుజ్జగింప వీలులేనిది.

vii

శ్రీనాథుని సమకాలపువాఁ డగు కొలని గణపతి దేవుఁడు తన 'శివయోగసారము' న చక్రపాణి రంగన కవి నిట్లు స్తుతించినాఁడు.

'అసమశివభక్తిరసమా
ననునిం బాల్కురికి సోమనాథునిఁ గవిరా
జనమున్నతయశు సద్యః
ప్రసాది యగు చక్రపాణి రంగనఁ గొలుతున్.

viii

గురురాజకవిపద్యమున రంగనాథుఁడు నూఱు తోటకవృత్తములను గూడ రచించినట్లు కలదు. ఛందోగ్రంథములలో రంగనాథుని తోటకము లివి రెండు కానవచ్చినవి.

బాలబోధ చ్ఛందస్సులో -

తోటకము - ఉపవాసము లెల్లను నుంపుట నీ
కృప వచ్చుట కా యది రిత్త సుమీ
యపవిత్రునిఁ బుల్లనియంబలికై
సుపవిత్రునిఁ జేయుట సుద్దిగదే.

హనుమచ్ఛందస్సులో

తోటకము - చెలువార గజాజినచేలముతో
గళనీలిమతో నహికంకణుఁడై
తలఁ జంద్రకళం గల దైవము మా
కులదైవము దైవతకోటులలోఁ.

వీనినిబట్టి సిద్ధనంజేశకవి చెప్పినతోటకవృత్తములను రంగనాథుఁడు రచించుట సమర్థిత మగుచున్నది. రంగనాథుని యనుకరణము కావచ్చును. కాశీఖండమున శ్రీనాథుఁడుకూడ తోటకవృత్తరచనము చేసినాఁడు.

ix

బాలబోధచ్ఛందమున రంగనాథునిదిగా నీ క్రింది కందపద్యము కలదు.

క. ఫాలతలభస్మరేఖలు—

ఇది సమగ్రముగా లేదు. ఇది సిద్ధనంజేశకవి పేర్కొన్న నూఱు కందములలోఁ జేరినదేమో!

x

ప్రయోగరత్నాకరములో రంగనాథుని మిత్ర
విందాపరిణయములో నిదిగా నీ క్రిందిపద్యభాగ మున్నది.

"వనమాలి గొలుచు నందునని యెల్లప్పుడు"

xi

పలువురు శివకవులు కవిస్తుతిలో రంగనాథుని
శివకవినిగా స్తుతించినారు. మచ్చునకు ఒకటి.

భద్రకవి లింగకవి రంగనాథ ప్రశంస.

'దండితోఁ బండితత్రయముఁ గీర్తించి
సకలవేదపురాణ శాస్త్రేతిహాస
నికరార్థములు ప్రమాణించి సద్భక్తి
శ్రీమతి నుద్ధరించిన పాలకుఱికి
సోమనాథేశ్వరు సొంపుతోఁ గొలిచి
రంగద్విశాలాంతరంగంబునందు
రంగనాథునిఁ గవిరాజన్యుఁ దలఁచి
యసమానచరితు బ్రత్యగ్రకల్యాణ
బసవేశుఁ బిడుపర్తి బసవేశుఁ గొలిచి'

(సానందోపాఖ్యానము)

xii

వైష్ణవుఁడైన చక్రపాణి రంగనాథుఁడు శైవుఁడై
రంగనకవి యయినాఁడు. ఇట్లే శైవుఁడైన తెనాలిరామ
లింగకవి వైష్ణవుఁడై రామకృష్ణుఁ డయినాఁడు.

xiii

రంగనాథుని పద్యములుగా ప్రబంధరత్నావళిలో నీపద్యము లున్నవి. ఇవి కూడ (శ్రీశైలమల్లికార్జున) శివస్తవపరములే కాన, పయి రంగనాథుని రచనములే యగుట సుస్పష్ట మయినది.

అచలని తేరు తేపనకు నాదదువై తగువిల్లు వింటికిం
గుదురగువారి నారిపయిఁ గూర్కుశరంబు శరంబు బొడ్డునం
బొదలిన యంత యంతముఖముల్ నిటవాసము లైనగుఱ్ఱముల్
చెదరక నీకు నెట్టి పని సేయు నయా ! గిరిజాధినాయకా !

ఓజు చేముట్టక యొగ్గానఁ బట్టక
చక్కఁగా దివిఁ బాటుచక్రములును
లాయానఁ గట్టక లలి మేఁత వెట్టక
వర్ణహీనం బైన వారువములు
తవన వెట్టక జీవితము కాసు ముట్టక
సత్త్వసంపదఁ జూపు సారథియును
కడచీలఁ దట్టక ఘనముగా మెట్టక
గంభీరసంపద గలుగునిరుసుఁ

గలిగి తనరారునరదంబుఁ గడఁక నెక్కి
త్రిపురవిజయంబుఁ జేకొన్న దేవదేవుఁ
డిందుశేఖరుఁ డానందమందిరుండు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత !

గోశతపంచవార్ధులును గోయుగవార్ధులు గోత్రవార్ధులున్
గోశరవార్ధులున్ విదితగోశర (వార్ధులు) పంచవార్ధు లా
కేశవతల్ప పద్మభవ కేకిపవాహన దానవేశ దే
వేశుల కిచ్చునట్టిపరమేశ్వరుఁ డీవుత మా కభీష్టముల్.

xiv

పొత్తపి వెంకటరమణకవి రచించినలక్షణశిరోమణి యను లక్షణగ్రంథములో 'అచ్చవెల్లి రంగన్నగారు' అనుపేర రంగనాథరామాయణద్విపద లుదాహరింపఁబడినవి.

# 3

# తెలుఁగుకవితలోని దేసితనము

తెల్గుభాష, తెల్గులిపి, తెలుకవిత- వీని పుట్టు పూర్వోత్తరములను బరిశీలింపఁ బూనినప్పుడు సజాతి భాష లగు అరవము, కన్నడములను, మూలభాష లగు సంస్కృతప్రాకృతములను గలయఁజూచుకొను టావశ్యకమగును.

ఆంధ్రవాఙ్మయము గ్రంథరూపముగా నన్నయ నాఁటనుండియే కానవచ్చినను, అంతకు కింకను నిన్నూ ఱేండ్లకుఁ బూర్వమునుండియు నాంధ్రకవితారచన యుండుట శాసనములఁబట్టి స్పష్టముగా నిటీవల గుర్తింప నయినది. తెలుఁగుకంటె కన్నడమున నింకను ప్రాచీన కాలమునుండి కవితారచన యుండుటను గ్రంథములు, శాసనములు వెల్లడించుచున్నవి. అంతకింకను ప్రాచీన కాలమునుండి యరవమున కవితారచన కల దని ద్రవిడ విద్వాంసులు నిరూపించుచున్నారు. తెల్గునకంటె గన్నడ కవితయు, నంతకంటె అరవకవితయు, నంతకంటె సంస్కృతప్రాకృతకవితయుఁ బ్రాచీనము లగుట సత్యమని యంగీకరింపవలసినదే. దానిఁబట్టి వానికి ప్రాచీనతాగౌరవముకూడ గణింపవచ్చునుగాని, వానికంటె నర్వాచీన మయిన దన్నంతమాత్రాన తెలుఁగునకుఁ

గోఱంత రాదు సరికదా మఱొకవిధమయిన గౌరవవిశేషము గానవచ్చుచున్నది. సజాతిభాష లయినద్రవిడకర్ణాటభాషల కవితాధర్మముల మంచిచెడ్డల నవగతము చేసికొని గుణములఁ బెంపొందించుకొని, మేల్మిమెఱుఁగులతో వెలసిన దన్నగౌరవము తెల్గున కున్నది. దీనిని నిట దృష్టాంతముగాఁ గొనవచ్చును. 1939 సంవత్సరము 'మాడల్ మోటార్ల కంటె 1940 సంవత్సరపు మాడల్ కార్లకు యోగ్యత హెచ్చుకదా.

## తెలుఁగునకుఁ గలసాజాత్యము

ప్రాచీనతమ మయిన యరవ కవితలోఁ బద్యచరణమునకు 'అడి' అని పేరు. అడి యనఁగా 'అడుగు'—పదము. చరణము. అరవమునఁ బద్యమునకు 'పాట్టు' అని పేరు. ద్రవిడమున నతిప్రాచీన మనఁబడు శిలప్పధికారము వృత్తములతోఁ గాఁక యిట్టి పాట్టులతోనే యున్నది. నేఁడు మన తెనుఁగున గానవచ్చు లంకాయాగము, కుచ్చెలకథ, ఏలలు, ధవళములు, గొబ్బిపదములు మొదలగుపదములవలె నవి కొంచెముగా సంగీతవాసనతోఁ జదువఁదగినవై యుండును. అవి మాత్రాగణఘటితములు కాబట్టి హ్రస్వదీర్ఘాక్షర ప్రస్తారపుఁ బొందికతో, గానానుకూలముగా నుండును. మన లంకాయాగము, కుచ్చెలకథ మొదలగు పదరచనలవలె నవి వందలకొలది 'అడిగళ్'—

చరణములు గలవై పొడుగువాటి యుండును. ఆవిధ ముగాఁ దొలుత కర్ణాటాంధ్రములలోఁ గూడ 'పాటలు పదాలు' ప్రాథమిక రచనలయి యుండును. అట్లేని నా పద్ధతి మాటికి కర్ణాటాంధ్రకావ్యరచనలు ప్రాయిక ముగా నాల్గేసిచరణములు గల పదములతోనే యుండఁ గారణ మేమి? అని యోచింతుమేని దానికిఁ గారణము సంస్కృతప్రాకృతరచనాసంస్కార మగుట గుర్తింప నగును. సంస్కృతఛందస్సు వైదిక చ్ఛందస్సునుబట్టి పుట్టినది. వేదమున ఋక్కులు నాలుగుపాదములు గలవి. ఋక్కులో సగమునకు అనఁగా రెండుపాదములకు అర్ధర్చ మని పేరు. ఋక్కులోని రెండవపాదము మూఁడవ పాదము విడఁబడి యుండును. దానికి సంధి యుండదు. సంస్కృతప్రాకృతభాషలలోఁగూడ నీ పద్ధతియేయున్నది. సంస్కృతశ్లోకములు నాల్గుపాదములు గలవి. పాదము అనఁగా నాల్గవవంతు అని కూడ అర్థ మున్నది. దానికే ద్రవిడభాషలలో 'కాలు' అని వ్యవహారము. కాలు అనఁగా నాలుగవవంతే అర్థము. నాల్గవవంతు అని యర్థము కలదయినను కాలు శరీరావయవమునకుఁ జేరగుట యెట్లనఁగా నది శరీరమున నాల్గవవం తగుటచేతనే. మోఁకాలిదాఁక కాలు, ఇంకొకకాలు తొడభాగము. కలియఁగా నడుము అరభాగము. నడుమునుండి తలదాఁక ఒక అరభాగము. నాలుగుభాగ ములు గల శరీరము. భాషలో సంస్కృతశబ్దముల సంప్ర

దాయము నధికముగాఁ గైకొన్నట్లు, ఈ సంప్రదాయము ననుసరించి కర్ణాటకులు, నాంధ్రులును సంస్కృతచ్ఛంద స్సంప్రదాయమును గొంత యనుకరించిరి. అనఁగాఁ బద్యములు నాల్గుచరణములు గల వగుటను. ఈ యనుకరణములఁ గూడఁ దొల్తటివారు కర్ణాటకులే. అరవమున 'పాట్టు' అనఁబడునది కర్ణాటాంధ్రములందు 'పద్య' మైనది. పదములు చరణములఁ (పాదములు కాదు) బట్టి యేర్పడినది గాన అట్లు పేరయ్యెను. అడిగళ్ -పదములు- చరణములు ఎన్నియేని సాగుచుండుట, పదము లెల్ల నొక దానితో నొకటి కలసి యుండుట దేసిసంప్రదాయము. పద్యమునకు నాల్గుపాదము లుండుట, అందు రెండవ మూఁడవ చరణములు విడఁబడి యుండుట సంస్కృత ప్రాకృత సంప్రదాయము. కర్ణాటాంధ్రులు పద్యమునకు నాల్గుచరణము లుండుట యను సంస్కృతసంప్రదాయము ననుకరించినను నందు రెండవ మూఁడవ చరణములు విడఁబడియుండుట యనుపద్ధతిఁ బాటింపరయిరి. పాదములు నాల్గింటిని మించి యుండుట, రెండవ మూఁడవ చరణములు సంధి గలసి యుండుట యను దేసిసంప్రదాయము గూడ నానాఁడు కొంత సంస్కృతరచనలలోఁ జేరిన ట్లున్నది. కొన్ని శాసనములలో శ్లోకము లయి దేసి చరణములు గలవి గలవు. మఱియు మిక్కిలి విలువ గలది ప్రశస్తశాసనకావ్యము అని ప్రస్తుతింపఁబడు

ఐహోలు పులుకేసి సంస్కృతశాసనమున శ్లోకములు రెండు మూఁడు చరణములు సంధి గలవై యున్నవి.

పిష్టం పిష్టపురం యేన జాతం దుర్గ మదుర్గమమ్
చిత్రమ్యస్య కలే ర్వృత్తం జాతం దుర్గ మదుర్గమమ్

## తెల్గువేల్మి వెలుఁగులు

ద్రవిడకర్ణాటభాషలలోఁ బ్రాసనియమము తెల్గున నున్నట్లే యున్నది. కాని యతినియమము అరవమునఁ గొన్ని తెలుఁగుల పద్యములకే యున్నది. కన్నడమున లేనే లేదు. తెల్గున నన్నిజాతుల పద్యములకు యతిప్రాసములు నియతములుగా నున్నవి. ఇది తెల్గురచనకుఁ గలయొకవిశేషము.

ద్రవిడ కర్ణాటాంధ్ర భాషాత్రయమునకు సమానమయిన యీ ప్రాసము చరణమున రెండవ హలక్షరము ఒక్కటిగానే యుండుట. సంస్కృతప్రాకృతజన్యములయిన యౌత్తరాహభాషలకు నీ దాక్షిణాత్యభాషలకును బ్రాసవిషయమున గొప్పభేద మున్నది. ఔత్తరాహభాషలు చరణాంత్యప్రాసము గలవి. దాక్షిణాత్యభాషలు చరణాది ప్రాసము గలవి.

ప్రాసపద్ధతి మొలుత వెలసిన ద్రవిడభాషలో క చ ట త ప వర్గముల ననునాసికములతక్కఁ దక్కినవాని కెల్ల నొక యక్షరమే యుండును. సంస్కృతశబ్దములు వర్గాక్షరము లెల్ల భిన్నముగాఁ గలవే యయినను నవి యరవ

మునఁ జేరినపుడు ద్రావిడోచ్చారముచొప్పున భేదము లేనివే యగును. వారికి క ఖ గ ఘ లకు భిన్నోచ్చార ముండదు. కావున వర్గప్రాసము ద్రవిడమున నున్నది. కర్ణాటభాషలో గూడఁ బ్రాచీనతరకాలమున వర్గ ప్రాస ముండెడిది. మఱియు చ వర్గమునకు 'శ ష స' లకుఁ గూడ నొకటే యుచ్చారము. ఆ యక్షరములకుఁ బ్రాసము చెల్లును. ఆ సంప్రదాయముచొప్పున కర్ణాటమునఁ గూడ 'శాంతప్రాస' మనుపేర 'శ ష స' ల ప్రాసము సమ్మతమయియే యుండెను.

కర్ణాటభాషాకవిత పుట్టిననాఁటి లక్షణగ్రంథముగా గుర్తింపఁబడినకవిరాజమార్గమున వర్గప్రాసము పరిగణింపఁబడినది. దాని లక్షణ మిట్లు ;

క. సకలజన వినుతనంశ
మఖ సదృశవిశాల వివిధ విభవోదయనం
ప్రగత గుణగణననరిబల
విఘటననం కందనణువ నారాఘవనం.

మఱియు శ ష స ల ప్రాస సమీపప్రాస మనుపేర ఇట్లు చెప్పఁబడినది.

క. శశధర బింబాన నెయం
ఝషకేతన కేతనాథ తనుతననువతం
బిసవిసద వర్ణెయంకం
డొసదంబస దొళగె జనకతనయళనణువం,

క్రీ. 820 నాఁటి ప్రాచీనతమలక్షణశాస్త్రకర్త తత్ప్రాచీనపద్యరచనాసంప్రదాయముఁ జొప్పున నిట్లు చెప్పినను, కర్ణాటకమున నర్వాచీనజైనకవు లీవర్గ సమీపప్రాసముల నంతగాఁ బాటించినవారు గారు. కర్ణాటకులలో నర్వాచీనశైవకవులు మాత్రమే వీనిని గొంత పాటించిరి. అట్లే తెల్గునఁ గూడ లక్షణగ్రంథములలో నీ వర్గప్రాసము పరిగణితమై యున్నది.

క. సుకవీశ్వర వాగ్వైఖరి
సుఖదం బగునిగమశిఖరసూక్తులు మోక్షో
పగమములు దయాధర్మము
లఘ నాశకములన నివి యుదాహరణంబుల్.

—ఆంధ్రవృత్తరత్నాకరము

దీనికి నుమామహేశ్వర మను గ్రంథమునుండి లక్ష్యము.

క. మాకందఫలరసంబుల
నాఁకలి గొని మేము గ్రోల నాకొమ్మలలో
చీకటిలో నవు డొకచిలు
కేగతినో మోవి గఱచెఁ నెఱుఁగనె చెలియా!

మఱియు శ, స ప్రాసము తెల్గున బహుమహాకవిప్రయుక్తమై యున్నది.

## తెలుఁగు మెఱుఁగులు.

ఈవిధముగా నియతముగా నది ద్రవిడ కర్ణాటములకంటె నధికముగా యతిప్రాసములఁ గూర్చుకొని

ద్రవిడమునఁ గలపదముల హలంతత్వము తొలఁచికొని సంస్కృతపదపరికరము నధికముగాఁ గైకొని కర్ణాటమునఁ గల శిథిలద్విత్వము నెంతో విడనాడి యజంతపదములతో నరసున్నల యుచ్చారముతో సీసము, తరువోజ, ద్విపద మొదలయిన దేశిచ్ఛందోరచనలతోను, కంద మనుప్రాకృతచ్ఛందోరచనతోను, చంపకోత్పలాది సంస్కృతచ్ఛందోరచనలతోను బెరసి తన చుట్టుపట్టులభాషల సర్వసౌభాగ్యముల నలవరించుకొని, తొందర తొలఁచుకొని, సుందరమై శోభిల్లునట్లు వేయి యేండ్లనాఁడు నన్నయ యాంధ్రకావ్యపథమును దీర్చినాఁడు. అతనికిఁ బూర్వము సీసములు, గీతులు, తరువోజలు, అక్కఱలు నను దేసివృత్తములే యిన్నూఱేండ్లకుఁ బూర్వమునుండి శాసనములందుఁ గానవచ్చుచున్నవి. నాఁటి శాసనములందు గానవచ్చు పద్యరచనలెల్ల నిట్టివే. ప్రాకృత కవితలకు గందము ప్రధాన పద్యము. వృత్తములు, కందము సంస్కృతప్రాకృత సంబంధమునుబట్టి తెల్గునఁ జేరినవి. కాని యా పురాణ వృత్తరూపములు, కందపద్యరూపములు గల తెల్గు శాసనములు నన్నయకుఁ బూర్వపువి కానరావు. కాని యా కాలమున, గన్నడసంప్రదాయముచొప్పునఁ బ్రాస

మాత్రము గల శ్లోకములు, ఆంధ్రసంప్రదాయము సొంపైన యతిప్రాసములు రెండును గల కందపద్యములు, తెల్గునాటి సంస్కృతశాసనములందుఁ గానవగును.

పయిఁ జెప్పిన దేసిరచనలలో మధ్యాక్కఱకుఁ, దరువోజ సీసముల కెక్కువ ప్రాముఖ్య మున్నట్లున్నది. తెల్గుభాషలోఁగలపాటలు, పదాలు చాలమట్టుకు కొంచెపు మార్పులతో సీసములు, తరువోజలు, ద్విపదలు నగును. వానిలో మధ్యాక్కఱలు మాత్ర మేవో వింతతీరు గలవిగా, సులువుగాఁ జదువరానివిగా నున్నట్లుండును. దానికిఁ జదువుటలో సుఖగతి యున్నట్లు కానరాదు. సంగీతప్రియు లగునాంధ్రు లిట్టివాని నేలపరిగ్రహించిరా యని, చదువుట యెట్లా యని చాల సందేహించు చుండువాఁడను. మధ్యాక్కఱ యిట్టిది.

స్వస్తి నృపాంకుశాత్యస్త వత్సలసత్యత్రి నేత్ర

.......... .....................................

ఒకనాఁడు మాయింట స్త్రీలేవో పాటలు పాడుచుండఁగా నందొకదానినడక నాకు హృద్యముగా నుండెను. దాని గణవిభాగముచేసి పరిశీలించి చూతును గదా యది యధ్యాక్కఱగణములు గలదై యుండెను. ఆ పాటఫణితి చాల సుఖముగాఁ జక్కఁగా నున్నదిగాన, ఆ ఫణితిని యుద్ధమల్లుని బెజవాడ విలాశాసన మధ్యా

కృ—అను జనునఁగా హృద్యత తోఁచెను. నేను వినిన పాటమాదిరి యిట్టిది.

అంతట రాములవారు
　　అంగన సీతను గూడి
సంతస మందుచు వేగ
　　స్వపురమునకుఁ జనుదెంచి
తమ్ములతోడ గలసి
　　నెమ్మది రాజ్యము లేలె
ధర్మముతోఁ బ్రజ లెల్ల
　　తామరతంపర లైరి.

ఇందు రెం డింద్రగణములు నొక సూర్యగణమును, మరల రెం డింద్రగణములు నొక సూర్యగణము ననుక్రమమునఁ బదములు అనఁగా చరణములు ఉన్నవి. పయిపాటలలో నిట్టిచరణములు బహులకోలఁది వందల కోలఁదిగా నుండును. సంస్కృతసంప్రదాయము ననుసరించి పద్యము నాల్గుచరణములు గలదిగా నుండునట్లు చూచుకొనుటలో నీ పాటఘణితిని రెండుపదములను— అడుగులను—చరణములను ఒక పాదముగా—నాల్గవభాగముగా—గ్రహించి పాటలోని యెన్మిదిపదములను రెండేసి రెండేసిగాఁ గలిపి నాల్గుపాదముల పద్యముగాఁ జేసికొని దానికి మధ్యాక్కర యని పేరిడిరి. మధ్యాక్కర యను

పేరిలోని మధ్యపదము మంచిప్రయోజనము గలది. అది యీ పద్యపాదమును జదువునపుడు మధ్యమునకుఁ గత్తిరించి చదువవలె ననుటకు జ్ఞాపకము. ఎనిమిదిచరణముల పాట యీ మార్పువలన నాల్గుపాదముల పద్య మగుట నాలుప్రాసములతో సరిపోవుట కుదిరినది. పాటలకు, నీ పద్యరచనలకుఁ గలసాజాత్యమును గుర్తింపక పోవుటచే మధ్యాక్కర మన కిపుడు చదువఁ గష్ట మగుచున్నది. పయి పాటఫణితి మధ్యాక్కరఁ జదివి చూతము.

స్వస్తి నృ. పాంసుశా. త్యస్త
        వత్సల. సత్యత్రి. నేత్ర
విస్తర. శ్రీయుద్ధ. మల్లుఁ
        డనవద్య. విఖ్యాత. కీర్తి
ప్రస్తుత. రాజాశ్ర. యుండు
        త్రిభువనా. భరణుండు. సకల
వస్తుస. మేతుఁడు. రాజ
        సల్కిభూ. వల్లభుం. డర్థి.

ఇట్లే మన యిండ్లలోఁ బాడెడుపాట లెన్నెన్నో దేసి రచనలు సంస్కృతసంబంధము లేనివి. అవియే యిప్పటి కిని నరవమున గొప్ప కావ్యములలోని ఛందోరచనలు. పంపాది కర్ణాటకవులయు, నన్నయభట్టారకాది తెల్గు కవులయు సంస్కృతానుకరణ సంస్కరణములమూల మున నారచనలు సుకవితలలోఁ బరిగణితములుగాక యొక ప్రభేదముగా మాత్రమే వెలుపడిపోయినవి. సంస్కృత

వృత్తాదిరచనలు నన్నయభట్టారకాదులమూలమునఁ బ్రాబల్యమును బొందినవి. ఆ రచనకు విస్తరకవిత లని లాక్షణికులు పేరిడిరి. తెల్గుకవిత యాశు, మధుర, చిత్ర విస్తరము లని నాల్గు తెఱఁగులు గల దని లాక్షణికు లనిరి. ఆంధ్రకవితాపితామహుఁ డనఁబడిన పెద్దనామాత్యుఁడు తాను చతుర్విధకవితావిశారదుఁడ నని చెప్పుకొన్నాఁడు. అందు మధురకవిత యనఁగా పాటలు మొదలగునవి. * లక్షణదీపికలో నీ విషయ మిట్లు చెప్పఁబడినది.

దేసి యగునీమధురకవితనుగూర్చి ముచ్చటించుటఁగో నన్నయభట్టారకుని విస్తరకవితా నిర్మాణ విశేషముల నించుక పేర్కొందును. ఈ విస్తరకవితలో

1. పద్యములు నాల్గు చరణములు గలవిగా నున్నవి.

---

* "మధురకవిత్వం బన్నది నాటకాలంకారంబులు. కళికోత్కళికలు. విభక్త్యధిదేవతోదాహరణములు. సప్తతాళనటనలు, నట్టొల్లు. గీతప్రబంధంబులు. చతుర్భద్రికాష్టభద్రికలు. బిరుదావళి. నామావళి. భోగావళి. రంగఘోష. త్యాగఘోష. చతురుత్తర సంఘటనలు. యక్షగానంబున వెలయుపదంబులు. దరువులు. నేలలు. ధవళంబులు. మంగళహారతులు. శోభనంబులు. నుయ్యాల జోలలు. చిక్కులరేకుపదంబులు. చందమామసుద్దులు. అష్టకంబులు. ఏకపద ద్విపద త్రిపద చతుష్పదాష్టపదులు నివి యాదిగాఁ గల్గియున్నియు."

—లక్షణదీపిక.

2. రెండవ మూఁడవ చరణములు విడఁబడక కలసియే యున్నవి.

3. దేసిరచనాభేదము లెల్లఁ గాక యందునుండి సీస, తరువోజ, గీత, మధ్యాక్కర, అల్పాక్కరాదులు కొన్నియే గ్రహింపఁబడినవి.

4. సంస్కృతవృత్తము లెల్లఁ జేకొనఁబడినవి.

5. పాటల పదాల సంప్రదాయముచొప్పున ప్రాసయతి కూడ యతిభేదముగా సీసగీత్యాదులలో గ్రహింపఁబడినది. అసలు ప్రాసయతి రెండుచరణముల నొకపాదముగా మార్చుట యన్నసంప్రదాయము చొప్పునఁ బుట్టినదే.

6. సంస్కృతమున సంయుక్తాక్షరమునకుఁ బూర్వాక్షరము గురువు కావలె నన్నపద్ధతి విడనాడఁబడినది. అనఁగా "తత్ర వ్యాస ఇతి స్థితో ముని రపి శ్లోణీశ్వరే సత్కృపా" ఇత్యాదివిధమున వ్యా, స్థి, శ్లో అక్షరములకుఁ బూర్వాక్షరములు సంస్కృతమున గురువు లయినవి. పదములు సమస్తములుగా నున్నను, వ్యస్తములుగా నున్నను సంయుక్తాక్షరపూర్వలఘువులు గురువు లగుటే సంస్కృతసంప్రదాయము. ప్రాచీనకర్ణాటకవు లీపద్ధతిని గర్హించిరి. వారు సంస్కృతసమాసము గానప్పుడు, ఏకపదము కానప్పుడు లఘ్వక్షరము పూర్వమం దుండఁగా బరమందు రేఫేతరసంయుక్తాక్షర

ముందునట్లు సంహితయే కల్పింపరా దనిరి. శబ్దమణిదర్పణమున సంధిదోషప్రకరణములో నిట్లున్నది.

క. పరపద పూర్వం ద్విత్వా
క్షర మాగిరె పూర్వపదద చరమం హ్రస్వా
క్షర మాగె సంధిదోషం
సరేఫ మిది రాగె శిథిల మిందనుసరిపర్.

అనఁగా— రేఫసంయుక్తాక్షరమునకు మాత్ర మీ దోషము లే దనిరి. 'సర్వా స్వపి చ భాషాసు రహాయుక్తే పరేక్షురే, పూర్వలతావేష్టా' అని సంస్కృతమువారు కూడ రేఫవిషయ మంగీకరించిరి. ఇట్టి సంధి యుండరాదు.

క. బరసి క్షత్రియరుం కృ
శ్లిరిసి ప్రియకుశలవార్తయం నెఱెకేళ్దు
స్థిరమిర్దు ప్రభునుడియె
ప్రరూఢముద నాద నాత నెంబు ద మార్గం.

నన్నయభట్టారకుఁడు కూడ సరిగా నీమార్గమునే తెలుఁగునఁ బాటించెను గాని రేఫేతరసంయుక్తాక్షరమునకుఁ బూర్వము లఘ్వక్షర ముండున ట్లెక్కడను బద్యమునఁ గూర్చి కూర్చినట్లు కానరాదు. అనఁగా—

"అతఁడు ధ్వస్తకల్మషుఁడు వ్యాససమానుఁడు ధ్యానమగ్నుఁడై" ఇత్యాదివిధమున నన్నయభట్టారక రచనలు కానరావు. "వాఁడాధ్వస్తసమస్తకల్మషుఁడహో

వ్యాసోపమానుండు" ఇత్యాదివిధముల నుండవచ్చును. ఇప్పుడు ముద్రిత మయిన నన్నయ భారతమున నేతద్విరుద్ధ ప్రయోగములు కొన్ని కానవగును. కాని యవి యెల్ల నీ నియమము నెఱుఁగక పోవుటచే లేఖకులమూలమునను, బరిష్కర్తలమూలమునను నేర్పడినవి.

ప్రాచీన కర్ణాటకవు లీనియమమును సరిగాఁ బాటించిరి. నన్నయ పాటించెను. నన్నిచోడఁడు పాటించినట్లున్నాఁడు. కాని తర్వాతికవులు మఱికొంత స్వాతంత్ర్యము వహించినారు. తిక్కనాదుల రచనలలో రేఫేతరసంయుక్తాక్షరముల పూర్వము లఘువు లుండునట్లు రచన లున్నవి. కాని యీసంయుక్తాక్షరోచ్చారమునకు శైథిల్యము కల్పించి పూర్వాక్షరము లఘువుగానే యుండునట్లు చేసిరి. తిక్కన తర్వాతి కవీశ్వరు లీపద్ధతిని బాహాటముగాఁ బాటించిరి.

నన్నయభట్టారకుఁడు భాషలోను, గవితలోను గ్రొత్త పద్ధతులను గొన్నింటి నిట్టివానిని ప్రవేశపెట్టి కావ్యపథమును దిద్దుటచేతనే యాతఁడు ఆంధ్రకవితాగురుఁ డని, యాదికవి యని, వాగనుశాసనుఁ డని ప్రస్తుతుఁ డయ్యె ననుకొందును.

కొలనిగణపతిదేవుఁడు — ఈతఁ డెఱ్ఱాప్రెగ్గడ కించుక తర్వాతివాఁ డగును—

వీరి నెల్లను సంస్కృతవిమలబాణు
లని ప్రశంసించి మఱియును నంధ్రకావ్య

పథము దీర్చిననన్నయభట్టుగారి
నుభయకవిమిత్రు నెన్నుద నభినుతింతు.

అన్నాఁడు.

నన్నయ ప్రాచీనకర్ణాటకకవులతీరు ననుసరించి ప్రాయికముగా సంస్కృతప్రాయరచననే చేసినవాఁడయినను, దేసి తెల్గుపలుకుబడిని గూడఁ బెక్కుపట్టుల నెక్కొల్పినాఁడు.

## నన్నిచోడఁడు

సంస్కృతప్రాయము, నియమబహుళము నగు నన్నయభట్టారకుని రచనమును వెన్నాడినను నన్నిచోడఁడు తన కుమారసంభవకావ్యమున దేసిభాషను, దేసితలఁపులను, దేసివర్ణనలను, దేసికవితాపరికరములను జాలఁగా సంగ్రహించినాఁడు. కుమారసంభవమున నాటవికవర్ణనలు, యుద్ధవర్ణనము మొదలగు పట్టులు చాల దేసితీరులతో నున్నవి.

జీటికకల్లు ద్రావి మదసింధు
రగామిను లన్ని కేటియర్
వాఱుచు గౌడుగీతములు
వాడుచుఁ బొల్పుగఁ గ్రాలియాడుచున్
గోఱడ మాడుచుం బయలకున్
వళవర్తలు గాక మేరకున్
మీఱుచు వన్యకాంతలు
రమింతురు తద్విపినాంతరంబునన్.

మఱొక్క పద్యము—

ఉదుటఁ దెమల్చి మ్రింగు సరసోదకబిందుల మౌక్తికంబు లం
గడఁ గబళించుఁ బీల్చు వడగండ్లకునుం దను వోసరించుఁ దో
యదము లదల్చి తూరు నచిరాంశులతాగ్రము లెక్కఁ బెల్చునం
బుదలకు నుప్పరం బెగయుఁ జాతకపోతకముల్ సెలర్చుచున్.

కుమా—౬—౯౯.

# పాల్కురికి సోమన

ఈతని కృతులలో భాష, కథావస్తువు, ఛందస్సు-మూఁడును దేశీయములే. నన్నయభట్టారకాదుల తెలుఁగు వేఱు. ఈతని తెలుఁగు వేఱు. ఈతఁడు తన కృతులలో దేసిరచనలఁ బెక్కింటిఁ బేర్కొనెను. అవి యివి.

'భామలు శుభవేళఁ బాడెడునట్టి
తామరవిరులు సీతామరల్ గావె.

* * *

అరుదొంద నందులో నాంధ్రదేశంబు
వరస బంతులు గట్టి పాడు పెట్లనిన
నల్లవో ! నల్లవో ! నగరాజరాజ !
మల్లయా ! మల్లయా ! మహనీయతేజ !
పరమపాతక కోట్లు భస్మమై తూలు
సిరిగిరిమల్లన్న శరణన్నఁ జాలు'

ఇట్టిదేదో పాట!

మది నుబ్బి సంసారమాయాస్తవంబు
పదములు తుమ్మెదపదముల్ ప్రభాత
పదములు పర్వతపదము లానంద
పదములు శంకరపదముల్ నివాళి
పదములు వారేశుపదములు గొబ్బి
పదములు వెన్నెలపదములు సెజ్జ
వర్ణన మఱి గణవర్ణనపదము
లర్ణవ ఘోషణ ఘూర్ణిల్లుచుండఁ
బాడుచు నాడుచుఁ బరమ హర్షమున.

మీఁదఁ బేర్కొన్నపదములలోఁ దుమ్మెదపదములు మొదలగు కొన్ని జాతుల పదరచనలను నే నిప్పటికిరువదియేండ్లకుముందుఁ గొన్నింటి సేకరించి కృష్ణాపత్రికలోఁ బ్రకటించితిని. ఇటీవల భారతిలోఁ గొన్నింటిఁ బ్రకటించితిని. బాలకుల పదములను, స్త్రీల పాటలను, పామరుల పాటలను, వృద్ధుల పాటలను— బాలభాష, స్త్రీభాష, పామరభాష, వృద్ధభాష యనువిభాగములతో సేకరించి ప్రకటింపవలె నని నే నప్పు డనుకొంటిని. శ్రీనందిరాజు చలపతిరావుగారు స్త్రీలపాటలను బెక్కింటి సేకరించి ప్రకటించి గొప్పయుపకృతి సల్పినారు. ఇట్టి దేసివాఙ్మయము మింక నెంతయో యుద్ధరింపవలసియున్నది. పాల్కురికి సోమనాథుఁడు తెలుఁగున దేసిరచనలఁ బెంపొందింపఁ బ్రయత్నించిన

ట్లున్నాఁడు గాని, యాపూర్వికి కాకాలమున నంతగాఁ బలిపోషము దొరకలేదు. ఆ కాలముననే కర్ణాటదేశమున శివకవులు తెగఁబడి రగడలు, షట్పదులు మొదలగు దేసి ఛ్ఛందోరచనలతోఁ, జాల భాషాస్వాతంత్ర్యముతోఁ గావ్యరచనలు సాగింప నారంభించిరి. ఆ కర్ణాటదేశమునఁ బ్రాచీన వృత్తరచనలకుఁ దద్భాషకు హళగన్నడ మనీ, శివకవులు వెలయించిన దేసిరచనలకుఁ దద్భాషకు హొసగన్నడ మనీ పేరు. రెండు తెఱఁగుల కావ్యరచనలకు భాషలో, ఛందోనియమములలోఁ జాల భేదము లున్నవి. కర్ణాటకు లైదాఱువందలయేండ్లకుఁ బూర్వము సాగించిన కవితాపరిణామమును నేఁడు తెలుఁగువారు సాగింపఁ జూచుచున్నారు. ఈ ప్రయత్నము శుభోదర్క మగుఁగాక !

## తిక్కన సోమయాజి

తిక్కన నన్నయ సంప్రదాయమువాఁడే కాని, భాషలో, భావములలో నత్యధికముగా దేసితనమును జూపించినాఁడు. నన్నయరచనలలోని ప్రసాదగుణ మీతని రచనలకు లేదు. పలుకు పలుకు ప్రయోజనము గల దగునట్లు, కూర్పున మర్మ ముండునట్లు, లోఁతు లోఁతుగా యోచించినఁ గాని యర్థము కానట్లు, కల్పనా చమత్కృతితో నీతఁడు పద్యరచన చేయును. పెక్కుచోట్ల సమాస మున్నమాట యుండదు. రెండు మూఁడక్షరాల తేటపలుకు లుండును. తేలికగాఁ బద్య

ముండును. అన్వయము పలుదెఱంగులఁ గుదుర్చఁదగినదై యుండును. అర్థనిర్ణయమునకు గజిబిజిపడవలసినదే. రెండు పద్యములఁ జూపుచున్నాను.

పగ యడఁగించు టెంతయు శుభం బది లెస్స యడంగునే పగం
బగ వగఁగొన్న మార్గమునఁ బల్కక యుండఁగవచ్చునే సమం
బగు మొదలెత్తి పోవఁ బగ దీర్పక యుండినఁ గ్రౌర్యమొందు నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేదు ధ్రువంబు కేశవా!

ఉద్యోగపర్వము—ద్వితీయాశ్వాసము.

తనుగొని కోపవేగమునఁ గన్నుల నిప్పులు రాల నంగముల్
గనలఁగ సాంద్రఘర్మసలిలంబులు గ్రమ్మ నితాంతదంత పీ
డనపట దాస్యరంగ వికటభ్రుకుటీపటుల ప్రవృత్తన
ర్తనఘటనా ప్రకారభయదస్ఫురణాపరిణద్ధమూర్తియై.

విరాటపర్వము—ద్వితీయాశ్వాసము.

## ఎఱ్ఱాప్రెగడ

ఈ మహాకవి హరివంశములోని కృష్ణబాలక్రీడావర్ణనాఘట్టమెల్ల దేశీకవితాచమత్కారమయము. ఆంధ్రవాఙ్మయమున నది యసాధారణరచనము. ఎఱ్ఱాప్రెగడ దేశీవర్ణన నింకొక చూపుచున్నాను.

సీ॥ పొలుపారఁగా బోరగిలి........

ఈతఁడు తాటిచెట్లను, తాటిపండ్లను జమత్కారముగా వర్ణించినాఁడు. ఆంధ్రులకుఁ దాటిచెట్టు కల్పవృక్షము. ఆంధ్రులు చెవులఁ బెట్టికొను తాటి

యాకులే సంస్కృతమున 'తాటంకము' లయినవి. మాంగళ్యసూత్రమునఁ జుట్టి కట్టుకొన్న తాటియాకు కే 'తాళిబొట్టు' అని పేరు. ఆంధ్రుల లిపి లేఖనములకుఁ దాటియాకే ముఖ్యము. కాన దానికి 'కమ్మ', యని పేరు.

## శ్రీనాథుఁడు

శ్రీనాథుఁడును దాటిపంటి నుపమానముగాఁ గొని మంచిపద్యము చెప్పినాఁడు.

గీ॥ సంజకెంపును దిమిర పుంజంపు నలుపు
గలిసి బ్రహ్మాండభాండంబు గరము మెఱసెఁ
బరమ పరిపాకదశ వృంతబంధ మెడలి
పండిన మగు త్రాటిపంటితోఁ బ్రతిఘటించి

శ్రీనాథుని పల్నాటివీరచరిత్ర, కాటమరాజు కథలు దేసికవితామయములు. ఆతఁడు నన్నయ మార్గానుసారియై సంస్కృతప్రాయ రచనలు సాగించిన వాఁడే యయినను దేసిరచనలు నాతని కృతులలో ననేకము లున్నవి. ఒకటి రెండు చాటువులఁ జూపుదును.

చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవళ్లు
నాగులేటినీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు సర్పంబులును దేళ్లు
పల్లెనాటిసీమ పల్లెటూళ్లు.

మందరాద్రిసములు మానవు లందఱు
చందమామకూన లిందుముఖులు
కందు లేని మౌక్తికంబులు జొన్నలు
కుదనంపు బెడ్డ కుందుగడ్డ.

శ్రీనాథుని నాఁటికి దేసికవితామయము లగు యక్షగానములు ప్రబలియున్నవి. 'కీర్తింతు రెవ్వాని కీర్తి గంధర్వులు-గాంధర్వమున యక్షగాన సరణి' నని శ్రీనాథుఁడు భీమఖండమున యక్షగానములఁ బేర్కొన్నాఁడు. యక్షగానములలోఁ గాన నగు దేసికవితా రచనలఁ గొన్నింటిఁ బేర్కొనుచున్నాను.

కూనలమ్మపదాలు (కూనరాగాలు)

కవితారసపుజల్లు ఖడ్గాలగలుగల్లు
కరిణాలకే చెల్లు ఓకూనలమ్మ!

కాపువాఁడే రడ్డి గరికపోచే గడ్డి
కానకుంటే గుడ్డి ఓకూనలమ్మ!

ఆంధ్రప్రజల నాలుకల నాట్యమాడుచున్నవి. ప్రజాసామాన్యమునకు సులువుగాఁ దెలియఁదగినవి. సంగీతవాసనతోఁ జక్కఁగాఁ జదువదగినవి. యాంధ్ర భాషకు సహజ మయినవి యగుపై దేసిరచనాప్రభేదము లను, మఱియు కుచ్చెలకథ, లంకాయాగము, బొబ్బిలి కథ, లంకాసారథి మొదలగు వందలకొలఁది పదములు గల గొప్ప పదరచనలను సర్వాంధ్రదేశమునుండి సేకరించి, మేలేర్చి, యందుండి పరిగ్రాహ్యము గ్రహించి భావి వాఙ్మయవికాసమునకు యువకవులు ప్రయత్నింతురు గాక యని కోరుచున్నాను. ఆంధ్రవాఙ్మయ మంతటను సంస్కృతపరివర్తనమే, సంస్కృతానుకరణమే యని తేలఁబలుకువారు కొంద ఱున్నారు. ఆ నింద యక్రమ మయినది.

## ౪

# రెడ్డిరాజులు-ఆంధ్రభాషా సేవ

మ. మహనీయంబుగ నంధ్రభూవలయముం బాలించుచుం బ్రాజ్ఞులై
బహుకావ్యంబులు చెప్పుచున్ మఱియుఁ జెప్పంజేయు చాముష్మిక
స్పృహతో ధర్మము లాచరించుచు జగజ్జేగీయమానంబుగా
నహముల్ పుచ్చినరెడ్డిరాజుల సముద్యత్కీర్తిఁ గీర్తించెదన్.

ఆదికాలమునుండియు నంధ్రవాఙ్మయ భాగ్య భాండాగారమున రెడ్డిఱేండ్లు గొప్ప భాగస్వాము లయి ప్రఖ్యాతి గాంచుచున్నారు. వారి మహనీయుతను బదింబదిగా నేను ప్రశంసించుచునేయున్నాను.

ఇప్పటికి ముప్పదియైదేండ్లకు ముందు నే నిర్వది యేండ్ల ప్రాయమువాఁడనయి యుండఁగా చెన్నపురి కరిగితిని. నాఁడు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో గ్రంథసామగ్రిని బరిశీలింపఁ జొచ్చినప్పు డందు 'మెకంజీ లోకల్ రికార్డ్సు' అనుపేర మున్నూటిదాఁకఁ గల దేశచరిత్ర సంపుటములలో నెక్కడఁ బట్టినను రెడ్డిరాజుల దానధర్మములయు, శాసనములయు ప్రశంసలు పుష్కలముగాఁ గానవచ్చెను. మధ్యాంధ్రదేశము-అనఁగా నేఁటిగోదావరి కృష్ణ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప మండలములు-ఆనాఁడు వేదవేదాంగాది విద్యలు నేర్చిన బ్రాహ్మణులతో నిండియుండుటకును; నం దనేకు

లగ్రహారికులై సంపత్సమృద్ధు లగుటకును; దుర్గములు, చెఱువులు, కాలువలు, ధర్మవనములు, పాడిపంటలు గలిగి దేశము సుభిక్ష మగుటకును; దేవాలయములు నిత్యోత్సవములతోఁ దేజరిల్లుటకును వేయేల! నేఁటి తెలుఁగునాటివారి తెలివితేటలకు, నాగరికతనుగూడఁ బదునాలుగు పదునైదు శతాబ్దులలో నూటయేఁబది యేండ్లేయయినను బెంపొందియున్న రెడ్డిమహారాజ్య మొక ప్రధానకారణ మన్న చరిత్రాంశ మా చరిత్రాంశపు సంపుటములలోఁ గరతలామలకముగా గోచరించెను. నేఁడు మధ్యాంధ్రదేశమున బ్రాహ్మణులు అన్నవస్త్రములు గలిగి, విద్యావిభవములు గలిగి పలువు రున్నా రనఁగా దీనికి గొప్పకారణ మానాఁడు రెడ్డిరాజులు వీరి పూర్వుల విద్యావిశేషముల నాదరించి చేసినయగ్రహారాదిసత్కారము లగు ననుట యథార్థకథనము! కొండవీటిరెడ్డిరాజులయు, రాజమహేంద్రవర రెడ్డిరాజులయు శాసనములఁ గొన్నింటినేనిఁ జూచినను నీ విషయము వెల్లడి కాఁగలదు. శ్రీనాథుఁ డిట్లు చెప్పినాఁడు.

సీ. ధరియింప నేర్చిరి దర్భ వెట్టెడు వ్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీఁదఁ
గస్తూరికాపుండ్రకములు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల ప్రోలఁ
దారహారములు ముత్యాలసరులు

చెఱువంగ నేర్చిరి శిఖల నెన్నడుములఁ
గమ్మనిక్రొత్తచెంగల్వవిరులు
గీ. ధామముల వెండియును బైడిఁ దడబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములలోన
వేమభూపాలుఁ డనుజన్మవీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీతటమునందు.

—భీమఖండము

శ్రీశైలము, అహోబలము, పంచారామములు మొదలగు పుణ్యస్థలముల వైభవమును రెడ్డిరాజులెంతో పెంపొందించిరి. మధ్యాంధ్రదేశమున వేద, శ్రౌత, స్మార్తోభయమీమాంసా, తర్క, వ్యాకరణ, సంగీత, సాహిత్య, వైద్య, జ్యోతిషాదిశాస్త్రములకు వారు చాల నభ్యుదయమును గూర్చిరి. వారు షట్కాలశివపూజాధురంధరులయి యాముష్మికపరాయణులయి నెలసిరి. నేఁడును రెడ్డికులము వారిలోఁ బలువురు భాగ్యభరితులు, శీలశోభితులు, త్యాగులు, భోగులు, ప్రతిభాశాలులు, విద్వాంసులు, కవులు వెలయుచున్నారనఁగా దానికి నానాఁటి రెడ్డిరాజేంద్రుల వంశపారంపర్యపు సంస్కారమే ప్రధాన కారణ మనుట యసంగతము గాదు ముప్పదియేండ్ల నుండియు ... శ్రీ రెడ్డిరాజ్య వైభవానుస్మరణమున నభిమా... ము. ఇట్టి యభిమానము నానాఁడే 'శ్రీ ... తో' రచనా సందర్భమునఁ గొంత దీర్చు కొంటి

ఇప్పుడిక్కడ రెడ్డిరాజుల విద్యావిలాసములగూర్చి మాత్రమే కొంత వివరింతును.

## గోనబుద్ధారెడ్డిగారు-తత్పుత్రులు

పాల్కురికి సోమనాథునిమూలమునఁ దెలుఁగున ద్విపదరచనకు విలువ హెచ్చెను. ద్విపద రామాయణమునఁ దత్కర్తలు బుద్ధయ, తత్పుత్రులు కాచయ విఠలు లనియే కలదు. కాని వారి కుల మేదో యందుఁ దెలియరాదు. వారియింటిపేరు మాత్రము 'గోన' యని యనేక ప్రతుల లోను, 'కోన' యని కొలఁది ప్రతులలోను గలదు. వారు రాజ్యము నేలిన యేలిక లగుట గ్రంథమున స్పష్టముగా నున్నది. పశ్చిమాంధ్రదేశమున 13, 14 శతాబ్దులలో రాచూరుదుర్గ నిర్మాతలై రాజ్య మేలినవారు 'గోన' వంశమువారు రెడ్లు సుప్రఖ్యాతులు. వారి యింటిపేరు 'కోన' యనుట సరికాదు. ఆ నాఁటి శాసనములం దెల్ల వారి యింటిపేరు 'గోన' యనియే కలదు. అనాఁడు 'కోన' యింటి పేరువారు క్షత్రియులు కోనసీమ (గోదావరీమండలము) పాలకులు వేఱుగా నున్నారు. గోనపదసంగతి, బుద్ధ కాట విఠ్ఠనామసంగతి *రాచూరుదుర్గనిర్మాత లగు

* రాచూరుదుర్గనిర్మాణము రెడ్డిరాజులు కావించినదనుట శాసనములఁబట్టియే కాక వింతగా "గోన కాటారెడ్డిగారికథ" యన్న పదకవితారచనవల్లను దెలియనగును. ఆ కథను రేడియో ప్రసంగమున నేను వెల్లడించితిని.

రెడ్డిరాజులకే కలదు. కావున రంగనాథ రామాయణ ప్రసక్తులు రెడ్లే కాని క్షత్రియులు గారని నిశ్చయింప వలెను. ఐతిహ్యమును, నా స్వవాక్యమును బ్రమాణముగాఁ గొనకున్నచోఁ బ్రాచీన చరిత్రనిర్మాణము దుష్కర మగును. రంగనాథుఁ డనుకవియే లేఁడని, యతడు కల్పిత పురుషుఁ డని నే ననఁజాలను. బుద్ధారెడ్డిగారును, దత్పుత్రులును వాల్మీకిరామాయణమును దెలుఁగున ద్విపద రచనలో వెలయించి రఁటిరి. గ్రంథమున గ్రంథకర్తలు బుద్ధభూవిభుఁడును, దత్పుత్రులును ననియే కలదు. కాని దానిని రంగనాథుఁ డనుకవి రచించినట్లు ప్రతీతి. తదను గుణగాథలు ప్రాచీనము లగు వెలుగోటివారివంశచరిత్రైక శిలానగర చరిత్రాదులలోఁ గూడ నున్నవి. రంగనాథుఁడు కల్పితుఁడు కాకున్నను నాతనితోడ్పాటు గ్రంథరచనము నందున్నను గ్రంథోత్పత్తికిఁ బై ప్రభువులు కారణమగుట స్పష్టముగదా! పూర్వోత్తర రామాయణములు వేర్వేఱు పురుషుల రచనములుగా నాకుఁ దోఁపవు. తెలుఁగుననీ రెడ్డిరాజులు వెలయించిన ద్విపదరామాయణము ప్రౌఢకవితా రసికులకేగాక పామరజనులకుఁ గూడ సాహిత్యానందము సమకూర్చుచు నత్యధికప్రచారము కలదిగా నున్నది. ఆంధ్రరామాయణములలో రసపారవశ్యమును గలిగించు రచన మిట్టిది వేఱొకటి లేదు. ప్రాచీనలాక్షణిక కవులందఱును నీ రామాయణప్రయోగములను బరమ ప్రమాణముగాఁ బరిగ్రహించిరి. ఆంధ్రప్రజాసామాన్య

మును రామాయణకథామాధురిని నాస్వాదింపఁజేసిన రామాయణ మిదియే.

## ప్రోలయ వేమారెడ్డిగారు

వీరు కృష్ణ, గోదావరి, పినాకిని అను నదీత్రయముచే రక్షిత మాయిన మధ్యాంధ్రదేశము నేలిన రెడ్డిరాజవంశమునకు మూలపురుషులు కవిత్రయములోని యెఱ్ఱాప్రెగ్గడకవీశ్వరుని నాస్థానకవిగా నాదరించి పోషించిన మహనీయులు, కవిత్రయములోని యెఱ్ఱాప్రెగ్గడ భారతారణ్యపర్వశేషమునఁ గొన్నిపట్టుల నన్నయరచనను మెఱుఁగుఁ గూర్చియు, హరివంశమునఁ గొన్నిపట్టులఁ దిక్కనరచనకుఁ జక్కనఁ గూర్చియు నిర్వహించినాఁడు. ఆరణ్యపర్వశేషపూరణమున షష్ఠాశ్వాసమున సైంధవావమాన ఘట్టమును, హరివంశమున శ్రీకృష్ణ బాల్యవిలాసఘట్టమును నా కభిమాన గ్రంథభాగములు. అనాగరికు లయిన వ్రేపల్లె గొల్లవారియిండ్లలో జగన్మోహనమూర్తి శ్రీకృష్ణమూర్తి యవతరించి బాలక్రీడలును, దివ్యానుభూతులును వెలయించుట, యక్కడి పామరజనుల కంకుచేఁ గలిగిన యానందాశ్చర్య సంరంభములు ఎఱ్ఱాప్రెగ్గడవారు చాలఁ జక్కనితీరున దేసితెలుఁగుమఱుగులు వెలయఁగా వ్రేతలయిండ్లలో శ్రీకృష్ణుఁ డారగించినవెన్న మీఁగడరుచులఁ దలపించు మధురరచనతో వెలయించినారు.

ఆంధ్రప్రబంధవాఙ్మయమున నిట్టి రసవద్ఘట్టము మఱి యన్యత్ర కానరాదని నానమ్మకము. ప్రోలయ వేమా రెడ్డిగారు రామాయణమును సత్యాదరముతో నాలకించు వారట!

క. రామాయణహరివంశ
శ్రీ మన్మధురప్రబంధసేవ! చిరయశ
స్సామర్థ్య! సత్యనిపుణ!
శ్రీమల్లచమూవరేణ్య సేవితహృదయా!

ఇందుఁ బేర్కొనఁబడిన రామాయణహరివంశములు ఎఱ్ఱాప్రెగ్గడగారు రచియించిన యాంధ్రప్రబంధములే కావచ్చును.

హరివంశరచనకుఁ బూర్వము ప్రోలయవేమారెడ్డిగారికే యంకితముగా మన ప్రబంధపరమేశ్వరుఁడు రచియించిన రామాయణమహాప్రబంధ మీనాఁడు గానరాకుండుట శోచనీయవిషయము.

ప్రోలయ వేమారెడ్డిగారు సాహిత్యముననే గాక సంగీతమునను జాల రసికులు. హరివంశమున నిట్లున్నది.

క. కేళావిరాయ వితరణ
కేళీనిరపాయ నృత్యగీతసభాలీ
లాలలితోత్సవ నిరతిశ
యాలంకృతభాగ్య సుస్థిరాయుర్భాగ్యా!

వారి యాస్థానమున లొల్లమహాదేవకవి యని యొక విద్వాంసుఁ డుండెను. ఆయననుగూర్చి యావంశమున నేఁడవ తరమువాఁడు లొల్లలక్ష్మీధరుఁ డిట్లు చెప్పెను.

'యః కర్ణాటవసుంధరాధిపమహాస్థానే సువర్ణాయతో
యో విద్వన్నికషాయితో నృపగృహే వేమాఖ్యపృథ్వీశితుః
శ్రీమల్లొల్లటభట్టశిష్య ఇతి యో లొల్లాఖ్యయా శ్రూయతే
శ్రీశేషాన్వయశేఖర స్స హి మహాదేవో విపశ్చిన్మహాన్.'

ఈ మహాదేవకవికి లొల్లవా రని యింటిపేరు భరత మహాముని రచించిన నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానము రచియించిన లొల్లటభట్టునకు శిష్యుఁడగుటచే వచ్చినదట! ఇది నిజమేని నాట్యశాస్త్రవ్యాఖ్యాతలొల్లటభట్టుఆంధ్రుఁడగుట, అతఁడు గూడ రెడ్డిగారి ప్రాపు గలవాఁ డగుట యనుమానింపఁదగిన దగును. ఈ లొల్లమహాదేవకవివంశమునఁ దర్వాతివా రెల్లరుఁ గూడ మహావిద్వాంసులు. వీరు క్రమముగా రెడ్డిరాజుల యాస్థానమున విద్వాంసులుగా నుండి, తర్వాత వచ్చిన గజపతుల యాస్థానమునను విద్వాంసులుగా నుండి, వారితర్వాత వచ్చిన కృష్ణదేవరాయలవారి యాస్థానమునను విద్వాంసులుగా నుండిరి. ఈ గజపతులయు కృష్ణరాయలయు నాస్థానమున నున్న లొల్ల లక్ష్మీధరపండితునకును, మహాదేవకవికిని నడుమ నున్న విద్వాంసులు మహాదేవాచార్యుఁడు, లక్ష్మీధరాచార్యుఁడు, విరించిమిశ్రుఁడు, పురుషోత్తమమహోపాధ్యాయుఁడు, లక్ష్మణాచార్యుఁడు, విశ్వనాథ

భట్టుఅనువారు రెడ్డిరాజుల యాస్థానముననే యున్నవా రగుదురు వారు సంగీతసాహిత్య పూర్వోత్తర మీమాంసాదిశాస్త్రములందు గొప్పగ్రంథములు రచియించిరి. వాని పేళ్లివి: భట్టలొల్లటగ్రంథవివరణము, సాహిత్యపారిజాతము, స్మృతికల్పతరువు, భరతార్ణవపోతము, సాహిత్యమీమాంస, మీమాంసాజీవాతువు, ప్రాభాకరామృతవాహిని, ప్రాభావళీఖండనము, నయవివేకదీపిక యనునవి. ఈవంశమువా రిప్పటికిని సంపన్మహితులై కొల్లూర నెలయుచున్నారు.

హరివంశమున నీప్రోలయవేమారెడ్డిగారిని ఎఱ్ఱాప్రెగడ యిట్లు ప్రస్తుతించినాఁడు.

సీ. అగ్రహారములు విద్యాతపోవృద్ధ వి
 ప్రుల కిచ్చి యజ్ఞకర్తలుగ మనిచెఁ
గోమరారఁ జెఱువులు గుళ్ళు ప్రతిష్ఠించి
 లోకసంభావ్యంబులుగ నొనర్చె
నిధులు నల్లిండ్లను నిలిపెఁ దోఁటలు సత్ర
 ములు చల్వపందిరుల్ వెలయఁబెట్టె
హేమాద్రిపరికీర్తితామిత వ్రతదాన
 నివహంబు లన్నియు నిర్వహించెఁ
జేసెఁ జేయుచు నున్నాఁడు సేయ నున్న
వాఁడు పునరుక్తకృతి శుభావళుల నెల్ల
ననఁగ శ్రీ వేమవిభున కయ్యలరు పేర్మి
వశమె వర్ణింపఁ దద్భాగ్యవైభవంబు.

సీ. కేయూరకంకణాకృతిఁ బరాక్రమవిత
    రణములు బహుభూషణల నొంప
ననుకూలగృహిణిచాటున నృపశ్రీ యొప్పఁ
    గదలక సకల సౌఖ్యముల నొసగ
నమృతసేవనముచందమునను సద్ధర్మ
    రాప్త్ర్య మధిక మోదంబుఁ దెలుపఁ
కరతలామలక విఖ్యాతి నాంతనీతి
    గరిమంబు నిజవివేకమున వెలయ
జాహ్నవీప్రవాహముభంగిఁ జరిత మఖిల
భువనపావనపరిపూర్తిఁ బొలుపు మిగులఁ
బరఁగు వేమక్ష్మానాథుపాటినృపులు
గలరె యెవ్వారు ధారుణీతలమునందు.

ఎఱ్ఱాప్రెగ్గడగారి దిట యీ క్రిందిపద్యము. చాటువు కాఁబోలును.

ఉ. నీపున మోసెఁ గచ్ఛపము, వెండి భుజంగమరాజు మస్త
స్థాపితఁ జేసె, నీవు వసుధాభరమున్ బెదకోమటీంద్ర! బా
హాపరిరంభగుంభనము పంచితఁ జేసితి వింత యొప్పు నే
మోపరు లే మెఱుంగుదురు ముగ్ధలతోడివిహారసౌఖ్యమున్.

ఈయన కాలమున మోటుపల్లి యను ప్రాక్సముద్రతీరగ్రామము రేవుపట్టణముగా నుండెడిది. అక్కడి సముద్రపుటవలియొడ్డుననుండి తనాయి (నేఁడు తనాయియే) తకుణాసీరి (నేఁడు తెన్నాసిరమ్) మొదలగు ద్వీపాంతరప్రదేశములనుండి యోడవ్యాపారములు చాల జరుగుచుండెడివి. ఎఱ్ఱాప్రెగడ యిట్లు చెప్పినాఁడు.

శా. "దాహోదర్పమునన్ బ్రతిపథరజోపాలావలిం బోలి యు
త్సాహోదగ్రుఁడు మోటుపల్లి గొని సత్తద్వీపసంప్రాప్తసం
దోహంబున్ దనకిచ్చు నెచ్చెలిసముద్రుం బ్రీతుఁ గావించుచున్
మాహాత్మ్యంబు వహించె నుల్లరఘనాథుండు గాపోద్ధతిన్."

ఈ ప్రోలయవేమారెడ్డిగారు బంధుసముద్రాలు. ఎనుబదినాలుగు స్థలములలో దుర్గములను నిర్మించి తన బంధువుల నా యాదుర్గములందు నెలకొల్పిరి. ముప్పదియా అగ్రహారదానముల దానము చేసిరి. శ్రీశైలమునకు నహోబలమునకు మెట్లు కట్టించిరి.

## అన్నపోతారెడ్డిగారు

ఈయన తండ్రికాలమున రాజధానిగా నున్న యద్దంకిని విడిచి కొండవీటిని రాజధానిగా జేసికొని దానిని జాలఁ బెంపొందించినాఁడు.

'కొండవీడుం రాజధానం సవిచిత్రా మకల్పయత్
దృష్ట్వా స్వ ష్టాపి వైచిత్ర్య మహో యస్యా స్స విస్మయః'

*   *   *

'సోఽన్నపోత నృప స్తస్య నిర్మితాయాం పురి స్థితః
కుర్వన్ హేమాద్రిదానాని చిరం భువ మపాలయత్.'

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశమును రచించుకాలమున నన్నపోతారెడ్డిగారు యువరాజుగా నుండిరి. ఈయన రాజ్యమునకు వచ్చునాఁటి కెఱ్ఱాప్రెగ్గడ పుణ్యలోకముల కరిగియుండును. బాలసరస్వతి యనుకవీశ్వరుఁ డీయన యాస్థానమున

విద్యాధికారిగా నుండెను. "అన్నపోతనరేంద్రస్య విద్వాన్ బాలసరస్వతిః" అని యాతఁడు శాసనకృతులందుఁ జెప్పి కొనెను. వెన్నెలకంటి యింటిపేరు గలకవీశ్వరు లీయన్న పోతభూపతిపేర నేవో గ్రంథములు రచించిరఁట. అవి యేవో దొరకలేదు. "వేమయ యన్నపోతభూజానికి సత్ప్రబంధము లొసఁగిన వెన్నెలకంటివారిలోన్" అని విష్ణుపురాణకర్త వెన్నెలకంటి సూర్యకవియు, "వెన్నెలకంటి సూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసంపన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్ గొన్న కవీంద్రకుంజరుఁడు" అని జక్కనయు నీవిషయ మును బ్రశంసించిరి. ఈ మహారాజు రెడ్డిరాజ్యవ్యవ నజాలఁ బెంపొందించినవాఁడు; చాల యుద్ధములు జరిపి జయము లందినవాఁడు.

## అనవేమారెడ్డిగారు

అనపోతారెడ్డిగారి యనంతర మీయన రాజ్య మునకు వచ్చెను. ఈయన చాల ధర్మాత్ముఁడు. ఈశ్వర భక్తుఁడు. షట్కాలశివపూజాధురంధరుఁడు.

'అరుణోదయ తపనోదయ
సంగవ మధ్యాహ్న సాయ మర్ధనిశాః
శివపూజా సమయా షట్
ప్రతిదిన మన వేమపార్థి వేంద్రస్య"

అని వర్ణన గలదు. ఈతని యాస్థానమున గొన్నాళ్లు బాలసరస్వతికవియే విద్యాధికారిగా నుండెను. పిదప త్రిలోచనాచార్యుడను నుద్దండకవి విద్యాధికారిగానుండెను.

"మహానటజటాచ్ఛటానటదమందమందాకినీ
కలక్వణితసంతతప్రవిజృంభి వాగ్గుంభనః
కవిః కవికులోద్భవో భువనభవ్యదివ్యోదయ
శ్శివాగమవిశారదో జయతి శారదావల్లభః"

ఈ త్రిలోచనాచార్యుడు గొప్ప కవియగుటే కాక శైవాగమవిశారదుడు నటు! 'ప్రకాశభారతియోగి' యని పేరు గలవాడు ఆంధ్రకవీశ్వరు డింకొకడు గూడ నీయన యాస్థానమున నుండెను. దాక్షారామ భీమేశ్వరాలయమున ననవేమభూపాలుడు కట్టించిన గొప్పకట్టడములగూర్చి యీ ప్రకాశభారతియోగి మంచి సీసపద్యములతో శాసనకావ్యము రచించినాడు. ఈయన కైలాసవాసి కాగా నొకవిద్వాంసు డిట్లు విలపించినాడు.

'భువి సత్యనవేమభూపతీంద్రే విదుషాం జీవన మేవ జీవనమ్
దివి సత్యనవేమ భూపతీంద్రే విదుషాం జీవన మేవ జీవనమ్.'

## కొమరగిరిరెడ్డిగారు

అనవేమారెడ్డిగారికి బిదప నాతని యన్న కుమారుడు కొమరగిరిరెడ్డి రాజయ్యెను. ఈయన చాల సదృష్టవంతుడు. ఏలనగా, ఈయనకు మనుతుల్యుడని పొగడ్త గాంచిన ప్రాజ్ఞుడు కాటయ వేమారెడ్డి మంత్రిగా నుండెను.

"ఆసీ దమాత్యరత్నం కాటయవేమప్రభు స్తస్య
అతిసురగురుభార్గవమతి రతిభార్గవవిజయవిజయవిఖ్యాతః"
"సింహాసనే నిధా యాసౌ కుమారగిరిభూవరమ్
అతేజయ న్మహాతేజా శ్రీకృష్ణ ఇవ ధర్మజమ్."

—తొత్తరమూడి శాసనము.

శ్రీకృష్ణదేవుఁడు ధర్మరాజునుబోలె కాటయ వేమారెడ్డి కొమరగిరిరెడ్డిని సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టి సర్వాభ్యుదయములను సమకూర్చుచుండువాఁడు. రాజ్యపరిపాలనాతంత్ర మెల్ల కాటయవేమారెడ్డిగారు నిర్వర్తించుచుండఁగా భోగభాగ్యపరాయణులై కొమార గిరిరెడ్డిగారు వసంతోత్సవములందును, వారాంగనాభి నయములందును గాలము గడపుచుండువారు. వీరికాల మునఁ గొండవీటి రెడ్డిరాజ్యము గొప్పదశలోనుండెను.

"భాగ్యం నామసమగ్ర మీదృశ మతిస్నేహైకపాత్రం మహా
వీరం కాటయవేమ ముద్ధరిపుధ్వంసే నియుజ్య స్వయమ్
నిత్యం నందతి నర్తనై రభినవైః కాంతై ర్వసంతోత్సవైః
సంతానాభ్యుదయైః కుమారగిరిభూపాలో నృపాలోత్తమః"

ఇచట 'సంతానాభ్యుదయైః' అనుటకు సప్తసంతానముల యభ్యుదయము లని యర్థము చెప్పుకొనవలెను.

కొమరగిరిరెడ్డిగారికి ధర్మపత్ని నిర్విశేషురాలు 'లకుమాదేవి' యను ప్రియురాలుండెడిది. ఆమె కొమర గిరిరెడ్డిగారి కొలువున వేలతెలుఁగుల నవనవాభినయ ములు వెలయించుచుండెడిది. అగ్రజమును వేలకొలఁ

దిగా ధన మొసఁగి యాదరించుచుండెడిది. ఈ లకుమా దేవి వేశ్య కాఁబోలును.

"జయతి మహిమా లోకాతీతః కుమారగిరిప్రభో
స్పదసి లకుమాదేవీ యస్య ప్రియాసదృశీ ప్రియా
నవ మభినయా నాట్యార్థానాం తనోతి సహస్రధా
వితరతి బహూ నర్థా నర్థి ప్రజాయ సహస్రశః."

కొమరగిరిరెడ్డిగారి కాలముననే కొండవీట 'గృహరాజసౌధ' మనుగొప్పప్రాసాదము నిర్మింపఁబడెను. ఇంతదాఁక నీ సౌధము పెదకోమటివేమారెడ్డి కాలమున వెలయింపఁబడినట్లు తలఁపఁబడుచుండెను. ఈ నడుమఁ గ్రొత్తగా దొరకిన తామ్రశాసనము (ఇవి శ్రీ భావ రాజు వెంకటకృష్ణరావుగారిచే ఆంధ్రహిస్టారికల్ రీసర్చి సొసైటీ జర్నల్లోఁ బ్రకటింపఁబడినవి.) నీ సౌధమును కుమారగిరిరెడ్డిగారే కట్టించిరని తెలుపుచున్నవి. మఱియుఁ గుమారగిరిరెడ్డిగారు 'వసంతరాజీయ' మను పేర నాట్యశాస్త్ర గ్రంథము నొకదానిని రచించిరఁట! అది యిప్పుడు కానరాదు.

"మునీనాం భరతాదీనాం భోజాదీనాం చ భూభుజామ్
శాస్త్రాణి సమ్య గాలోచ్య నాట్యవేదార్థ వేదినామ్
ప్రోక్తం వసంతరాజేన కుమారగిరిభూభుజా
నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం య దుత్తమమ్."

శ్రీనాథుని హరవిలాసమును గృతి నందిన యవచితిప్పయ శెట్టి తన చిన్ననాఁట నీకుమారగిరిరెడ్డిగారి ప్రతివర్ష వసంతోత్సవములకు తరుణాసీరి, తవాయి, గోవ, రమణ,

పంజార, జలనోగి, హురుమంజి, యాంప, బోట ఇత్యాది ద్వీపాంతరములనుండి తెప్పించిన సుగంధద్రవ్యములను గొండవీటికిఁ గొనివచ్చి సుగంధద్రవ్య భాండారము నెల కొల్పి యమ్మిపోవుచుండెడివాఁడు.

## కాటయవేమారెడ్డిగారు

ఈయన కుమారగిరిరెడ్డిగారి సోదరికి భర్త. కాళిదాసీయ మహానాటకత్రితయమునకుఁ గుమారగిరీయములు అను వ్యాఖ్యానములు రచియించినవాఁడు. ఈ వ్యాఖ్యానములు చాలఁ బ్రసిద్ధములయినవి.

'కుమారగిరిభూనాథో యస్మై విక్రమతోషితః
ప్రాదాత్ప్రాచీం భువం రాజమహేంద్రనగరీముఖామ్.'

రాజమహేంద్రవరరాజ్యమును కాటయవేమారెడ్డియు, కుమారగిరిరెడ్డికుమారుఁడు అనపోతారెడ్డియు, కాటయ వేమారెడ్డియల్లుఁడు వీరభద్రారెడ్డియు, నాయన యన్నదమ్ములగు వేమారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డి యనువారును గలసి చీకటి చిల్కసముద్రముదాఁక వ్యాపింపఁజేసి పాలించిరి. కొమరగిరిరెడ్డిగారి తుదికాలముననే కొండవీటిరెడ్డిరాజ్యము, రాజమహేంద్రవరరెడ్డిరాజ్యము వేఱుపడెను. కొండవీటిరెడ్డిరాజ్యమునకుఁ బెదకోమటి వేమారెడ్డి రాజయ్యెను.

## పెదకోమటివేమారెడ్డిగారు

ఈ రెడ్డిరాజ్యమునకుఁ దొలిపురుషుఁడగు కాటయ వేమారెడ్డిగారెట్టి జగద్గేయకీర్తులో యించుమించుగా

కొండవీటిరెడ్డి రాజ్యమునకుఁ గూడివాఁడనఁదగిన యీ పెదకోమటివేమారెడ్డిగారు కూడ నట్టివారు. ఇంచుమించుగా క్రీ. 1404నుండి 1420 దాఁక నీ మహనీయుఁడు కొండవీటిరెడ్డిరాజ్యము నేలెను. ఈయనకు రాజమహేంద్రనరిరెడ్డిరాజ్యము ప్రబలవిరోధిగా నుండెను. కాటయవేమారెడ్డిగారినలె నీయన స్వయము గొప్ప విద్వాంసుఁడు. కవిసార్వభౌముఁడయిన శ్రీనాథుని నాస్థానమున విద్యాధికారినిగాఁ జేసికొని పోషించిన మహాభాగ్యశాలి. ప్రబంధపరమేశ్వరునిఁ, గవిసార్వభౌముని నాస్థానకవులఁగా నాదరించి పోషించుమహాభాగ్యము ప్రోలయ వేమారెడ్డిగారికిని, నీపెదకోమటివేమారెడ్డిగారికిని జిరకాలము లభించినది. ఈ వేమారెడ్డిగారికి 'సర్వజ్ఞచక్రవర్తి' యని బిరుదు.

> "చూడామణి ర్వ్బపాణాం దుర్మపపరిపంథిశిఖరిపంభోళిః
> సర్వజ్ఞ చక్రవర్తీ పెదకోమటి వేమభూపతి ర్జయతి"

ఈ శ్లోకము శ్రీనాథుని శాసనకృతులందే కాక వామనభట్టబాణుని వేమభూపాలచరితమునఁ గూడఁ గలదు. రాచకొండ దేవరకొండలు రాజధానులుగాఁ బశ్చిమాంధ్రదేశము నేలిన రేచర్ల వెలమరాజులకును, గొండవీడు, రాజమహేంద్రనరిము రాజధానులుగా రాజ్య మేలిన పంటదేసటి రెడ్డిరాజులకును ప్రబలవిరోధము. వారొండొరుల మీఁటి కీర్తి ప్రతాపయశస్సుల నార్జింప యత్నించిరి. రేచెర్ల సింగభూపాలుఁడు సర్వజ్ఞబిరుద

మందఁగాఁ గొండవీటి రెడ్డిరాజు మన పెదకోమటివేమా రెడ్డి సర్వజ్ఞచక్రవర్తి బిరుద మందెను. అక్కడ నొకసింగ భూపాలుఁడు సంగీతరత్నాకర వ్యాఖ్యానమును, రసార్ణవసుధాకరమును, రత్నపాంచాలికను రచింపఁగా మన రెడ్డిగారు సంగీతచింతామణిని, సాహిత్యచింతామణిని, అమరువ్యాఖ్యను, సప్తశతీసారవ్యాఖ్యను, నింకఁ గొన్ని నాటకకృతులను రచియించిరి. విశ్వేశ్వరకవిచంద్రాదులు వెలమరాజులయాస్థానమునఁ గవులుగా నుండఁగా వామనభట్టబాణాదు లిక్కడ నుండిరి. మహనీయుఁడు బమ్మెరపోతన వారియాస్థానమున నుండెను గాని యానిస్పృహుఁడు నరస్తుతివిముఖుఁడై వారిగౌరవాదరముల నపేక్షింపఁడయ్యెను. మన రెడ్డిగారి యాస్థానమునఁ బోతరాజుగారికిఁ దీసిపోని విఖ్యాతకవీశ్వరుఁడు శ్రీనాథుఁడు విద్యాధికారిపదమున వెలుఁగొందెను. ఇక్కడ నించుక శాఖాచంక్రమణము. వెలుగోటివారివంశమున సింగభూపాలురు పలువు రున్నారు. అందుఁ గవితాప్రసక్తులు పదునాల్గవశతాబ్ది తుదను, బదునైదవశతాబ్ది మొదటను వర్తిల్లినవా రిర్వురు సింగభూపాలురు. అందుఁ దొలిసింగభూపాలుఁడు రసార్ణవసుధాకరము, రత్నపాంచాలిక మొదలగు గ్రంథములకుఁ గర్త. చమత్కారచంద్రికాకారుఁ డగు విశ్వేశ్వరకవిచంద్రు నాస్థానకవిగా నాదరించినవాఁడు.

ఈతని మనుమఁడు వేఱొకసింగభూపాలుఁ డున్నాఁడు. ఈతనికే సర్వజ్ఞుఁ డని బిరుదు. శ్రీనాథకవి సార్వభౌముఁడు, బమ్మెరపోతరాజు నీసర్వజ్ఞసింగభూపాలునితో సంబంధము గలవారు. ఈతని తల్లిదండ్రులు పోచమాన్న పోతభూపాలకులు. వసంతావనీనాథుఁ డీతని తమ్ముఁడు. బమ్మెర పోతరాజు భోగినీదండకము నీతని పేరనే రచించెను. శ్రీనాథుఁడీతనినే దర్శించెను. ఈతఁడు పదునైదవశతాబ్ది మొదటి కాలమువాఁడు.

ఈతని తాత సింగభూపాలుఁడే రసార్ణవసుధాకరాది గ్రంథకర్త. ఆతనికి శ్రీనాథపోతనలతో సంబంధము గల దనుట యప్రామాణికము ఆతఁ డన్నమాంబాపోతభూపతుల కొడుకు. ఆతని సోదరుల పేర్లు వేఱు. ఇంత విస్పష్టచరిత్రవిషయము నెందుకో కొందఱిప్పుడు తార్మారు చేయుచున్నారు.

పెదకోమటివేమారెడ్డిగారి మంత్రియు, శ్రీనాథుని శృంగారనైషధకృతిపతియు నగు మామిడి సింగనమంత్రి సోమసిద్ధాంత మనుజ్యోతిషగ్రంథమునకు వ్యాఖ్య రచించెను. పెదకోమటివేమారెడ్డిగా రనేకులకు, జ్యోతిష విద్వాంసులకు, గొప్పవైద్యవిద్వాంసులకు యజ్ఞములు చేసిన శ్రోత్రియులకు, శైవాచార్యులకు ననేకాగ్రహారములు దానము చేసెను. ఆదానముల కన్నింటికిని శ్రీనాథకవీశ్వరుఁడు శాసనకావ్యకర్త. వారి వైదుష్యములను శ్రీనాథుఁడే పరీక్షించువాఁడు.

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
వెదఁజల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందుఁ
గల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్ష నైషధకావ్య మాంధ్రభాష.

ఇది యెల్లఁ బెదకోమటివేమారెడ్డిగారి యాస్థానిక శ్రీనాథుఁడు జరపినవిద్యాధికారికృత్యములు. 'విద్యాధికారి శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః' అని శాసనకృతులలో నాతఁడు చెప్పుకొన్నాఁడు.

పెదకోమటి వేమారెడ్డిగారి కృతులు :

(1) శృంగారదీపిక — ఇది యమరుశతకమునకు వ్యాఖ్యానము. అమరుశతక వ్యాఖ్యలన్నిఁటికంటెఁ దీనికే గౌరవము హెచ్చు. రసభావాలంకార నాయికానాయక లక్షణాది విషయవిచారములతో నీ వ్యాఖ్యానము చాల విపులముగా నున్నది. ఇది ముద్రితమయి యున్నది.

(2) సప్తశతీసారటీక :— రెండు వేలేళ్ళకుముందు హాలుఁడను నాంధ్రశాతవాహనచక్రవర్తి సంధానించిన 'గాథాసప్తశతి' యను నేడునూరు ప్రాకృతగాథలనుండి సారతరము లగునూఱుగాథలను పెదకోమటి వేమారెడ్డిగారు సంగ్రహించి వానికి వ్యాఖ్య రచించిరి. ఈ గ్రంథ

మింకను ముద్రితము కాలేదు. దీని కొక్క-ప్రతిమాత్రమే దొరకినది. అది ఓరియంటల్ లైబ్రరి (ప్రాచ్యలిఖిత పుస్తకశాల) లో గలదు. నూనూగుమీసాల నూత్న యౌవనమున శ్రీనాథుండీ గాథాసప్తశతిని తెనిగించినాడు. శ్రీనాథుని యీ తొలిగ్రంథ మిప్పుడు గానరాదు. అది నవరెడ్డిగారి కంకితమయి యుండును.

(3) సాహిత్యచింతామణి:-ఇది యలంకార శాస్త్రగ్రంథములలో జేర్చదగిన యుత్కృష్టగ్రంథము. కాని ప్రకాశితము కాలేదు. ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత కుమారస్వామిసోమపీథి దీని నుదాహరించినాడు. సహింభ భట్లు వ్యాకరణవేదము నిది ఖండించినాడు. ధ్వనికారుని మతమును బలపరచినాడు. ఈ గ్రంథములోని శ్లోకము లుదాహరింపబడినవి. "యథా మమైవ శాంతే" యనియు, "యథా మమ కావ్యే వీరనారాయణ చరితే" యనియును రెండు శ్లోకము లుదాహరింపబడినవి. కోమటి వేమారెడ్డిగారే స్వయముగ నాగ్రంథము తెల్పుచు చెప్పియున్నారు. (4) సంగీతచింతామణి:— ఈ గ్రంథము పేరు ననంతపురము నున్నది కవిసార్వభౌమ శ్రీసర్వజ్ఞచక్ర న నిట్లు పొగడిరి :

"జ్ఞాతా మదిన హి దాతా దాతా చేత్కో—పి ఘవి న చ జ్ఞాతా
జ్ఞాతా దాతా చాభూః పెదకోమటి వేమభూపతే చిత్రమ్."
"అర్థిజనచింతితార్థా, ప్రదం చేం నృతోపి పే వాడ
అస్యా అపి దిశిదిశి పెదకోమటి వేమభూపతే చిత్రమ్."

"శ్రితపోషణ రిపుశోషణ బుధతోషణ సత్యభాషణాదిగుణాన్
ధత్తే దశరథరామః ప్రాగద్య కలౌ చ కోమటివిభు వేమః"

వామనభట్టబాణుఁ డను కవీశ్వరుఁడు పెదకోమటి వేమారెడ్డిగారి చరిత్రమునే 'వేమభూపాలచరిత్ర' మను పేర సంస్కృతమున గద్యకావ్యముగా రచించిరి. శ్రీనాథుఁడే కాఁబోలును పెదకోమటివేమారెడ్డిగారి మీఁద రచించిన చాటుధారలు పెక్కులు చాటుపద్యమణిమంజరిలోఁ జూడఁదగును.

ఈ కాలముననే కందుకూరు రాజధానిగా రాజ్యమేలుచున్న చిన్నకోమటిరెడ్డిగారి కుమారుఁడు శివలింగభూపతి హరదత్తాచార్యుఁడు "చతుర్వేదతాత్పర్య సంగ్రహ" మను పేర రచించిన ప్రౌఢ సంస్కృతగ్రంథమునకు వ్యాఖ్య రచియించెను. ఆయన యాస్థానమున నీశ్వరభట్టు అను గొప్పవిద్వాంసుఁ డుండెను. ఆయన తోడ్పాటుతో రెడ్డిగారా గ్రంథమును రచించిరి.

పెదకోమటి వేమారెడ్డిగారితర్వాతఁ దత్పుత్త్రుఁడు రాచవేమన మూఁడేండ్లుమాత్రమే రాజ్యమేలెను. అంతటితోఁ గొండవీటిరెడ్డిరాజ్య మంత మందెను. కాని పెదకోమటి వేమారెడ్డిగారు తాము జీవించియుండఁగానే తమ్ముఁ డగు మాచారెడ్డిగారికిఁ గొండపల్లెదుర్గము రాజధానిగాఁ దత్ప్రాంతదేశమును గొంత రాజ్యమేలు కొనఁ బంచి యిచ్చి పంపిరి.

"పెదకోమటిమాచేంద్రో వేధసా నిర్మితో నృపః
ఇతరే చ నృపా స్సర్వే విశ్వామిత్రేణ నిర్మితాః"

అని యీతని పొగడ్తఁ గనెను. ఈ రెడ్డిగారు క్రీ. 1414 సం॥రమునను, దత్పుత్రుఁడు తిప్పయరెడ్డిగారు క్రీ. 1415 సం॥రమునను జేసిన యగ్రహార దానశాసనము లున్నవి.

పెదకోమటి మాచారెడ్డిగారు కొండపల్లిలో రాజ్య మేలుచు

"అకలంక సకలభాషాకవితామూర్ధాభిషిక్తాయ
విద్వన్నిరూఢరాజాస్థానసుధాంబోధిపూర్ణచంద్రమసే"
"గద్యత్రే బాణక వేః పద్యే-పి తథైవ కాళిదాసకవేః
........................................................
ఉజ్జ్వలతరాష్టభాషాకవితాసామ్రాజ్యపట్టబంధస్య
పుత్రా యాన్నయసుకవేః శ్రీభారద్వాజగోత్రాయ"
"అనుజేన పాణిబపరిష్కృతపాణిని ఫణితమార్గేణ
త్రిపురారి సుకవిమణినా సంస్మారయిత్రే స లక్ష్మణం రామమ్"
"పాల్గుమి శ్రీకంఠగురోః పంచాక్షరమంత్రపానయుక్తస్య
శిష్యాయ.........................................."

బజ్లేపల్లిగ్రామము నగ్రహారముగా నొసఁగెను. తర్వాతి వత్సరమున మాచారెడ్డిగారి కుమారుఁడు తిప్పయ్య రెడ్డిగారు గుడివాడతాలూకాలోఁ బామఱ్ఱుదగ్గఱఁ గల యేకమూరు గ్రామమును ప్రతాపరుద్రదేవుని భాండా గారాధిపుఁ డగు మల్లనకు మన్మఁ డగు బంకమల్లయ

యను బ్రాహ్మణునికి దానము చేసెను. తండ్రికొండమకు పెద్దఅన్నగారును నరహరి యనువిద్వాంసుఁ డాస్థానకవిగా నుండెను.

కొండవీటిరెడ్డి రాజ్యముతో పాటు కొండపల్లి రాజ్యవిభాగమును చెడిపోయినది. వెలుగోటి వెలమరాజులు కొంతభాగమును, విజయనగరరాజ్యము కొంతభాగమును, వేమవీరభద్రారెడ్లు కొంతభాగమును గొనియుండిరి.

## వేమవీరభద్రారెడ్లు

క్రీ॥ 1425 సం. ప్రాంతములఁ గొండవీటిరెడ్డి రాజ్యము కూలిపోఁగా శ్రీనాథుఁ డొంటరియై సమధికాభ్యుదయములో నున్న రాజమహేంద్రవరరెడ్డిరాజ్యమునకుఁ జేరినాఁడు. అంతదాఁక శ్రీనాథున కాశ్రయ మయిన పెదకోమటివేమారెడ్డిగారికిఁ బ్రబలశత్రువులై రాజమహేంద్రవరరాజ్యమును బెంపొందించినవారు-కుమారగిరిరెడ్డిగారి కుమారుఁడు అనపోతారెడ్డి, వేమవీరభద్రారెడ్ల తండ్రి అల్లాడరెడ్డి, కాటయవేమారెడ్డి, తత్పుత్రుఁడు కుమారగిరిరెడ్డి-వీరెల్లరు రాజమహేంద్రవరమున క్రీ. 1390-1420 సంవత్సరముల నడిమికాలమునఁ జనిపోయిరి. రాజమహేంద్రవరరాజ్యము కాటయవేమారెడ్డిగారి కుమార్తె యగునని తల్లిమూలమునఁ దద్భర్త యగు వీరభద్రారెడ్డిగారికి సంక్రమించెను. వీరభద్రారెడ్డిగారి [illegible] యగు బెండపూఁడి యన్నమంత్రి శ్రీనాథునకు బంధువు. తొల్త శ్రీనాథుఁ డాతని ప్రాపుఁ బడ

సెను. ఆతని సంకేతముగా క్రీ. 1430 కిఁ దరువాత భీమ ఖండము రచించెను. ఆకృతియవతారణికలో వేమవీర భద్రారెడ్లను వర్ణించెను. క్రమముగా 1430 తర్వాత శ్రీనాథుడు 'రాజమహేంద్రవరపు' "వీరభద్రారెడ్డి విద్వాంసుఁ" డయ్యెను

ఈ కాలమున శ్రీనాథునితో పాటు రాజమహేంద్రి వరమున నిశ్శంక కొమ్మనామాత్యుఁ డను మహాలోక మంత్రికవి యుండెను. అతఁడు వీరభద్రారెడ్డితమ్ముఁ డగు దొడ్డారెడ్డి సంకేతముగా శివలీలావిలాస మని ప్రౌఢ ప్రబంధము రచించెను.

వీరభద్రారెడ్డిగారి సంకేతముగా శ్రీనాథుఁడు కాశీ ఖండము రచించెను. శ్రీనాథుఁ డాంధ్రకవీశ్వరులలో వింత తిరువాఁడు. అతఁడు తత్పూర్వాంధ్రకవులుచేయు సంస్కృతాం ధ్రీకరణమునకంటెఁ జాల మార్పు కల్పించినాఁడు. కాశీఖండ భీమఖండపురాణములను దెలిఁగించినను వానిని స్వతంత్ర ప్రబంధములుగానే తెలిఁగించినాఁడు. భీమఖండము గోదావరీతీర దేవ దివ్యవైభవవర్ణన మనఁదగినది. కాశీ ఖండము గొప్పపురాణగ్రంథ మయినను నీతఁడు దానిఁ దనయిచ్ఛ వచ్చినతీరునఁ గొన్ని క్రొత్తవిషయములఁ జేర్చి కొన్ని మార్చి మూలముతో నంతగా సంబంధము లేనితీరున నతిప్రౌఢ మయిన ప్రబంధశయ్యలో స్వతంత్ర కృతి యనఁదగినట్లు రచించినాఁడు. తెలుఁగు కాశీ ఖండము నెవరుగాని కాశీమాహాత్మ్యమని పురాణకథా

పరిజ్ఞానమునకయి చదువరు. అది ప్రౌఢాంధ్రకవితాపరిజ్ఞానమునకయి చదువదగిన ప్రబంధమే. ఇట్లే శివరాత్రిమహాత్మ్యమని మఱియొక గ్రంథమును శ్రీనాథుఁడు రచించినాఁడు. ఈశానసంహితలో దానిమూలము నూఱు శ్లోకములు గలది. తెలుఁగుగ్రంథము విచ్చలవిడిగా వర్ణనలతో, శృంగారప్రసక్తులతోఁ బెరిఁగినది. పురాణాంధ్రీకరణ మని పేరే గాని శ్రీనాథుని తెలిఁగింపు లాయన యిష్టప్రకారము సాగినవే. శ్రీనాథునకుఁ బ్రౌఢకవితాపాకముమీఁదఁ బ్రీతి. తదనుగుణముగా నాతఁడు గ్రంథగ్రంథిమయ మయిన శ్రీహర్షనైషధమును దెలిఁగించినాఁడు. ఆయనడెందము మెచ్చిన కవితాసందర్భ మిట్టిది.

"హరచూడాహరిణాంకవక్రతయుఁ గా
లాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢపయోధరస్ఫుటతటీ
పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా
సత్కావ్యముల్ దిక్కులన్
చిరకాలంబు నటించుచుండుఁ గవిరా
జీగేహరంగంబులన్."

ఈయన గ్రంథములలో నెల్లఁ గాశీఖండము పండఁ బాఱిన కవితారచనాశౌండీర్యము గలది. ఇట్టికవితావైభవమునకుఁ గారణములను శ్రీనాథుఁ డిట్లు చెప్పుకొన్నాఁడు.

సీ. ఆంధ్రక్షమామండలాఖండితుం డైన
వేమభూపతి కృపావీక్షణంబు
ఘోడెరాయాంక సద్గురురాయధీమేశ్వ
రస్వామిపదసమారాధనంబు
కమలాద్రినిలయమార్కండేయశివమౌళి
చంద్రాంశునవసుధాసారధార
వేదాద్రినరసింహవిపులవక్షస్స్థలీ
కల్హారమాలికాగంధలహరి
కారణంబులు సుబోధకములు గాఁగ
సంభవించినసాహిత్యసౌష్ఠవమున
వీరభద్రేశ్వరుఁ బ్రబంధవిభునిఁ జేసి
కాశికాఖండముఁ దెనుంగుగా నొనర్తు

ఈ సాహిత్య సౌష్ఠవ కారణములెల్ల శ్రీనాథునకు రాజమహేంద్రవరమున సమకూరినవే.

ఇట్టి కవితా వైభవముల వెలయఁజేయుచు, సర్వ సౌఖ్యముల ననుభవించుచు నివసించుచుగా క్రీ. 1450 సం|| దాఁక శ్రీనాథుఁడు రాజమహేంద్రవరమున వర్ధిల్లి నాఁడు. అంతలో రాజమహేంద్రవరమున వేమవీరభద్రారెడ్ల రాజ్యమును నంతరించినది.

రఘువంశమున దశరథుఁడు రాజ్యపట్టాభిషిక్తుఁ డగునాఁటనుండి మహామంత్రిగా నుండి దశరథమహారాజుమరణము మొదలుగాఁ దద్వంశక్లేశముల నెల్ల ననుభవించుచు సుమంత్రుఁడు చిరకాలము జీవించినట్లు, మన శ్రీనాథుఁడును పెదకోమటివేమారెడ్డిగారి రాజ్య

లాభమునాఁటినుండి సదాస్థాయియైన విద్యాధికార్యస్థతోద్యోగము వహించి, కొండవీటి రెడ్డిరాజ్యవైభవములు పిదప రాజమహేంద్రవర రెడ్డి రాజ్యవైభవములు సమసిపోయినపిదపఁ గూడ జీవించి దీర్ఘ జీవితమును బరువును మోపినట్లు మోపవలసినవాఁ డయ్యె. దానినిఁక స్మరింపను.

మహావైభవ మనుభవించిన రెడ్డిరాజ్య మిట్లంతరించినను చాఁప చిరిగి చదర లయినట్లు తద్రాజ్యము చెదరులుగాఁ గొన్నిచోట్ల నేఁటికిని నిల్చుచున్నది. ఆంధ్రాభ్యుదయమునకు వా రెంతో తోడ్పడుచున్నారు గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దోమకొండ, మునగాల, ఇంకను గుంటూరుమండలము రాపూరు రాజధానిగా విజయనగరరాజులక్రింద రాజ్య మేలినవాఁడగు, బసవము రాఘవరెడ్డి వెన్నెలకంటి సూర్యనార్యునిచేఁ బదునాలవ శతాబ్ది యారంభమున విష్ణుపురాణమును నాంధ్రీకరింపించెను. ఈ విష్ణుపురాణము శ్రీనాథుని పురాణాంధ్రీకరణ ప్రౌఢిని దలఁపించుచు మూలానుసారముగాఁ జాల హృద్యముగా నున్నది.

గోదావరీతీరమున బిక్కవోలు రాజధానిగా రాజ్య మేలిన కామినేనివారు కృతికర్తలై కృతిపతులై యాంధ్రభాషకుఁ జాల నభ్యుదయముఁ గూర్చిరి. పట్టమెట్టసోమనాథకవి కామినేని కామిరెడ్డిగారి కవీశ్వరుఁడై సూతసంహితాది గ్రంథముల రచించినాఁడు ఈమహాకవి

గమనము చాల మేలయినది. కామినేని మల్లారెడ్డిగారు షట్చక్రవర్తిచరిత్ర మని ప్రశస్తప్రబంధము రచించిరి. వీరియాస్థానిలోఁ బెక్కు గ్రంథములు వెలసినవి. పదునేడవశతాబ్దిలో సిద్ధరకనీములోని మూగచింతపల్లెలోఁ బుట్టి సర్వాంధ్రద్రవిడదేశసంచారియై వేలకొలఁది యాటవెలఁదులను విజ్ఞాన జిహ్వారంగములపై నాట్యమాడించినదొడ్డకవి వేమనపద్యకర్త వేమారెడ్డిగారు రెడ్డిజాతి జగజ్జ్యోతి! సహజకవితాధారల యాటగడ్డ!

గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దోమకొండ, మునగాలసంస్థానములు పేర్వెలసిన కాలమునుండియు నంధ్రవాఙ్మయాభ్యుదయమున కెంతేని తోడ్పడుచున్నవి. గద్వాలలో ముష్టిపల్లి సోమభూపాలుని కాలమున కాణాద పెద్దసోమయాజి మహాకవియై యధ్యాత్మరామాయణ ముకుందవిలాసాది గ్రంథములఁ బెక్కింటిని రచియించినాఁడు. సోమభూపాలుఁడును సంగీతసాహిత్యచతురుఁడై స్వయము కవియై జయదేవగీతగోవిందము పద్యగేయాత్మకముగాఁ జాలఁజక్కగాఁ దెలిఁగించినాఁడు. గద్వాలసంస్థానమువలెనే ఆత్మకూరు, వనపర్తి, దోమకొండసంస్థానములును కవిపోషణమున, వాఙ్మయరక్షణమున నాఁటికి, నేఁటికిఁ బేర్వెలయుచున్నవి. నేఁడును నైజాంరాష్ట్రమున, రాయలసీమలో, మధ్యాంధ్రదేశమున సుగుణగణ్యులగు రెడ్డిగృహస్థు లెందరో గలరు. అందుఁ గవు లెందరో కలరు. ఆంధ్రాభ్యుదయము

నకు నాఁడు నేఁడునుగూడ రెడ్డిసంఘము గొప్పయాలంబమై వెలసినది, వెలయుచున్నది. నేఁటికిని నాంధ్రసారస్వతభాగ్యభాండాగారములో రెడ్డికులమువారొకగొప్ప భాగస్వాము లనియు; రేపటి యాంధ్రాభ్యుదయమునవారొకముఖ్యనిర్వాహకులై నిలువఁగల రనియు వారియెడ నాకుఁ గలపరితోషమును మరలఁ బ్రశంసించుచున్నాను.



అన్నమయ్య

# అన్నమయ్య

ప్రజలలో హృదయపరిపాకము చాలఁగా నేర్పడి నప్పుడే కవిత్వము, సంగీతము, శిల్పము మొదలయిన సుకుమారకళల సారస్యమును గుర్తించుట జరుగును. క్రూరహృదయులు సుకుమారకళల గుర్తింపలేరు. వానిని రక్షింపను లేరు. జాతిద్వేషము మతద్వేషము మొదలయినవి చెలరేఁగినపుడు వీనికి వినాశము తప్ప నభ్యుదయ ముండదు. పయికారణములవలన క్రీ. ౧౫౬౫ నాఁడు ఆంధ్రదేశమున సంగీతకళ విధ్వస్త ప్రాయ మయినను నంతకు నూఱేండ్లకుఁ బూర్వ మా కళకుఁ బ్రాణము పోసినమహనీయులనుగూర్చి యించుక ముచ్చటింతము.

అది యాంధ్రదేశమున శ్రీనాథుడు, పోతరాజు భవ్యకవితలు వెలయించిన బంగారుకాలము. ఆకాలమున ననఁగా క్రీ. ౧౫ శతాబ్ది ప్రథమపాదమున తాళ్ళపాక అన్నమయ్య యనుభక్తశిఖామణి కడప మండలము తాళ్ళపాక గ్రామములో నందవరీకస్మార్త బ్రాహ్మణకుటుంబమున నవతరించినాఁడు. అతనికిఁ బదు నాఱవయేట శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై వర కవితావైభవముఁ బ్రసాదించినాఁడఁట! ఆనాఁటినుండియు

నాతఁడు దినమున కొక్కసంకీర్తనకుఁ దక్కువ కానట్లు డెబ్బది తొమ్మిదేండ్లదాఁక సంకీర్తనములు గానించుచుండెను.

తాను జన్మచే స్మార్తబ్రాహ్మణుఁడైనను విశిష్టాద్వైతమతసామర్థ్యమునకు, నర్చావతారవైభవమునకు, శరణాగతిమాధుర్యమునకు, శ్రీ వేంకటేశ్వరమాహాత్మ్యమునకు లోఁబడి యహోబలమఠాధీశ్వరుఁడయిన ఆదివన్ శఠకోపయతిశిష్యుఁడై వైష్ణవమతమును స్వీకరించినాఁడు. పరాంకుశయతిప్రభృతులు ద్రవిడ వేదాంతమును వెలయించినట్లుగా నాళ్వార్ల సంప్రదాయము చక్కగా ననువర్తించి యుపనిషదర్థప్రతిపాదనములతో, స్వానుభవనివేదనములతో, సవరసిభాషతో, సరససంగీతకలావిలాసములతో సర్వసులభముగా సంకీర్తనాత్మకముగా నంధ్రవేదాంతము నవతరింపఁజేసినాఁడు. ఇప్పుడవి యన్నియు దొరకుట లేదుగాని యాతఁడు ముప్పదిరెండు వేలసంకీర్తనములు గానించినాఁడఁట. స్వామి నొక సంకీర్తనలో

"నే నొకండ లేకుండితే నీ కృపకు పాత్ర మేది
పూని నావల్ల నే కీర్తి పొందేవు నీవు"

అని హెచ్చరించినాఁడు. ఈతని శృంగారసంకీర్తనాంశ మిన్నూరేండ్లతర్వాత క్షేత్రయగాను, అధ్యాత్మసంకీర్తనాంశ మటుతర్వాత నూటేఁడ్లకు త్యాగయ్యగాను నవతరించె ననఁ జెల్లును.

అన్నమయ్య బాల్యమున విద్యానగరసామ్రాజ్యమును సాళ్వనరసింగరాయఁ డాక్రమించుకొను ప్రయత్నమున నుండినాఁడు. అన్నమయ సహాయము గొని వేంకటేశ్వరస్వామిదయతోఁ గొన్నియేండ్ల ప్రయత్నము మీఁద నతఁడు కృతార్థుఁ డైనాఁడు. అన్నమయ్య నందలా లెక్కించి యసాధారణవైభవము ననుభవింపఁ జేసినాఁడు. రాయఁ డొకనాఁ డన్నమాచార్యుని స్వామి మీఁద శృంగార సంకీర్తనములు పాడఁగోరెను. అన్నమయ పాడెను.

నాద నామ క్రియ

పల్లవి

ఏమొకో చిగురుటధరమున యెడనెడ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసినపత్రిక కాదు గదా
కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచినఁ
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు
నలువునఁ ప్రాణేశ్వరుపై నాఁటినయాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా॥ ఏమొ॥

అన్నమాచార్య చరిత్ర పీఠిక ౫౧ పుట

ఇట్టి కీర్తనలు తనపైఁ గూడఁ జెప్పఁగోరెను. అన్నమయ యసహ్యపడెను. కోపించి రాయఁ డన్నమయకు సంకెళ్లు వేయించెను. పాటలు పాడి యన్నమయ సంకెళ్లు విడఁగొట్టుకొనెను. రాయఁ డన్నమయ మహాత్మ్యమున కచ్చెరుపడి శరణాగతుఁ డయ్యెను. అన్నమయ

క్రీ. ౧౫౦౭ దుందుభి ఫాల్గునబహుళ ద్వాదశినాఁడు దివ్యధామ మందినాఁడు. ఆనాఁడు తండ్రినిగూర్చి పెదతిరుమలాచార్యుఁడు చెప్పిన సంకీర్తనము.

శ్రీరాగము

హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురుం డితం డన్నమయ్య ॥పల్లవి॥

వైకుంఠనాథునివద్ద వడిఁ బాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య
ఆకసపు విష్ణు పాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్ళపాక అన్నమయ్య ॥ హరి ॥

క్షీరాబ్ధిశాయి నిట్టె సేవింపుచున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు
ఆ రీతులఁ దాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥

ఈవల సంసారలీల నిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్లపాక అన్నమయ్య
భావింప శ్రీ వేంకటేశు పాదములందె వున్నవాఁడు
హావభావమై తాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥

అన్నమాచార్య చరిత్ర పీఠిక ౭౫ పుట

మఱి తర్వాతసంవత్సరములలో నాతని తీర్థదినమునాఁడు చెప్పిన సంకీర్తనము.

శ్రీరాగము

దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు
జనకుండ ! అన్నమాచార్య ! విచ్చేయవే ॥ పల్లవి ॥
అనంతగరుడముఖ్యు లయిన సూరిజనులతో
ఘన నారదాది భాగవతులతో
దనుజమర్దనుఁ డైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయువే ॥ దిన ॥
వైకుంఠాననుండి యాళువారలలోపలనుండి
లోకపునిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుఁ గూడి
ఈకడ నారగించ నింటికి విచ్చేయువే ॥ దిన ॥
సంకీర్తనము తోడ సనకాదు లెల్లఁ బాడ
పొంకపు శ్రీ వెంకటాద్రిభూమి నుండి
లంకె శ్రీ వెంకటగిరి లక్ష్మివిభుఁడ నీవు
అంకెల మాయింట విందు లారగించవే ॥ దిన ॥

అన్నమాచార్యచరిత్ర పీఠిక ౧౩౦ పుట

అన్నమయసంకీర్తనములు రాగిరేకులపైఁ జెక్కి దేవస్థానమున దాఁచినారు. క్రీ. ౧౫౬౫ లో విద్యానగర వినాశముచేఁ దిరుపతి దేవస్థానవైభవము తికమకలై తాళ్లపాకవారి ప్రాభవము తొఱ్ఱలై వారిసంకీర్తన ప్రఖ్యాతి సమసిపోయినది. కొంతకాలము చెల్లిపోఁగా మట్లరాజులు మరల స్వామివైభవము సంరక్షింపఁగా క్రీ. ౧౭౦౦ ప్రాంతములయందు మరల రేకెత్తసాఁగినది. అది యిప్పుడిప్పుడే గొప్పగా గుర్తింపనగుచున్నది. అన్న

మాచార్యులయు, తత్పుత్రుఁడగు పెదతిరుమలాచార్యులయు విగ్రహములు రాగిలో, రాళ్లలో మలఁచినవి దొరకినవి. అన్నమాచార్యచరిత్ర యని యన్నమయ మనుమఁడే రచించిన గ్రంథము దొరకినది. సంకీర్తనముల ముద్రణము సాగుచున్నది. అన్నమయసంకీర్తనముల ప్రఖ్యాతికిఁ దాళ్లపాకవారి వంశకవితాగౌరవములకుఁ దగినట్టు లన్నమాచార్యోత్సవమును దేవస్థానమువారు గొప్ప యుత్సాహముతో సాగించుచున్నారు. గొప్పయాంధ్ర గాయకు లందుఁ బాల్గొనుచున్నారు. త్యాగరాజసంకీర్తనలకంటె నన్నూఱేండ్లు పూర్వకాలమునాఁటివి యగు నన్నమాచార్యసంకీర్తనముల నాంధ్రులే జగత్ప్రఖ్యాతికిఁ దేవలసియున్నారు.

పల్లవి, అనుపల్లవి, చరణములు నను విభాగములతో నేఁడు వ్యవహరింపఁబడు సంకీర్తనముల కన్నమాచార్యుఁడే సృష్టికర్తయఁట! యతిప్రాసలు గలిగి సమము, అర్ధసమము, విషమము ననియు తెలుఁగులపాదములు గలిగి, ప్రతిపదముతుదను నన్నిపదములకు నేకవాక్యత కల్పించు పల్లవి యనుపేరు గలతొలిపదము గలిగి, యాభోగ మనుపేరు గలతుదిముద్రాపదము గలిగి, యుద్గ్రాహమేళాపకధ్రువాఖ్యలగు నడిమిపదములు గలిగి యొప్పారు గేయమునకు నిబంధమనుపేరవి యన్నమాచార్యుఁడు పేర్కొన్నాఁడు. రెండుచరణములున్నచోఁ దొలిపదము పేరు పల్లవి యనియు, నది యొక్కచరణమే కలదైనచో శిఖాపద

మనియుఁ. బల్లవియున్నచో శిఖాపద మక్కఱలేదనియు, శిఖాపద మున్నచో బల్లవి యక్కఱ లేదనియు నన్నమయ చెప్పినాఁడు. అతని సంకీర్తనము లనేక రాగములలో నున్నవి. పేరొక్క తీరుననే యున్నను గొన్ని రాగముల లక్షణములు చాల మారినవఁట! అన్నమయ పేర్కొన్న రాగములు గొన్ని యిప్పుడు వాడుకలోనే లేవఁట! ఆయా రాగములను సరిగా గుర్తించి యా సంకీర్తనములను బాడుటకును రాగములను శక్యమయినంతవఱకు సంప్రదాయప్రకారము సంరక్షించుటకును నాంధ్రగాయక వర్గు లభిలషింతురుగాక!

# ౬

# వచనరచన-తాళ్ళపాకవారు

ఆంధ్రవాఙ్మయమునఁ బ్రాచీనకాలమున వచనకావ్యరచన మాత్రగాఁ గానరాదు. భారతాదికృతులలోఁ బద్యరచనములనడుమ నెడనెడఁ గానవచ్చు వచనరచనలే కాని వచనైకరచనలు చాలఁదక్కువ. పద్యైకరచన లంత కింకను జాలఁ దక్కువ. తిక్కన నిర్వచనోత్తరరామాయణ మొక్కటే యట్టిది పేర్కొనఁ దగినది. సంస్కృతమునఁ బద్యైకరచనలే యెక్కువ. చంపూరచన లంతకుఁ దక్కువ. గద్యైకరచనలును దక్కువే. దక్షిణదేశభాషలలోఁ గర్ణాటకమున నొకతీరు గద్యరచనలు చాలఁ గలవు. అవి ప్రాయికముగా వీరశైవులు భగవత్ప్రార్థనాతత్త్వార్థ నిరూపణపరములుగా రచించినవి. అట్టిరచనలఁ బెక్కింటిని జేర్చి కర్ణాటకులు 'వచనశాస్త్రము' అనుపేరఁ బేర్కొనిరి. కొన్ని సంపుటములుగా నిటీవల వానిని బ్రకటించిరి. కన్నడమున నాయారచనము లించుమించుగాఁ బండ్రెండవశతాబ్దినుండి యారంభమయిన వనవచ్చును. ద్రవిడమునఁ బ్రాచీనకాలమున వచనైకరచనలు లేనే

లేవఁట! వ్యాఖ్యానరూపవచనరచనము లుండుఁ గాక యవి వచనకావ్యరచన లనఁదగినవి.

సంస్కృతమున వచనరచన ముత్తెఱఁగు లని వామనుఁడు కావ్యాలంకారసూత్రమున నిట్లు చెప్పి నాఁడు.

"కావ్యం గద్యం పద్యం చ. గద్యం వృత్తగన్ధి చూర్ణ ముత్కలికాప్రాయం చ. పద్యభాగవ ద్వృత్తగన్ధి. అనావిదలలితపదం చూర్ణమ్. విపరీత ముత్కలికాప్రాయమ్" అని.

పద్యపాదభాగముల కలయికతో వృత్తముల వాసనఁ దోఁపించు నుండువచనరచనము వృత్తగన్ధి. దీర్ఘసమాసముల గడబిడలు లేక తేలికపలుకులతో నుండు పొడిపొడివచనరచనము చూర్ణము. దీర్ఘసమాసముల గడబిడలు గలిగి, యుద్ధతోక్తులతో నుండురచన ముత్కలికాప్రాయము నని.

వామనునికిఁ దర్వాతివాఁ డగువిశ్వనాథకవిరాజు వచనము నాల్గుతెఱఁగుల విభాగించెను. "వృత్తలేశ విహీన మయినగద్యము ముక్తకము వృత్తగంధి ఉత్క

లికాప్రాయము చూర్ణకము అని నాలుగు విధములు. తొలిది సమాసరహితము. రెండవది వృత్తభాగములంకెం గూడుకొన్నట్టిది. మూడవది దీర్ఘసమాసాఢ్యము. నాల్గవది యల్పసమాసకము.''

పయి రచనాప్రభేదములలో రెండింటికి మాత్రము తెలుగున భారతాదికృతులలోని వచనభాగములనుండి లక్ష్యము లెత్తి చూపవచ్చును. ప్రాయికముగాఁ గవిత్రయమువారి రచనలలోని వచనరచనములు చూర్ణకము లనఁదగినవి. నాచనసోమన, పోతన ప్రభృతుల రచనలు గొన్ని యుత్కలికాప్రాయము లనవచ్చును. వృత్తగంధి రచనలు తెనుఁగునఁ బ్రాచీనకాలమున నంతగా లేవు. ప్రబంధరాజవేంకటేశ్వరవిలాసమున వృత్తగంధి వచనరచన లున్నవి. నేఁటికాలమున శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారు రచించిన *'ప్రాఁదెనుఁగుఁగమ్మ' వృత్తగంధియే. మచ్చునకు :—

'సిరిఁ దాల్చునట్టేఁ డొగిఁజిన్నిచూడ్కులఁ జూచు తెనుఁగుఁ జనువులరచ్చ తీర్పరులార! క్రిందను గైవ్రాలు సేసిన నే నయా! యాణగుట మెఱయుచు నాయోపు కొలందిఁ దెనుఁగుఁజనువులగులచి జాను మిన్నులంగఁ దొలితెనుఁగునుడు లనఁ దేటతెల్లగను విన్నపమొక్కండు వినిపింతు మిమ్ము మోడ్చియు నిరుచేయి మ్రోఁకరిలఁబడియు నెఱఁగియుఁ గైవార మొనరంగఁ

*చూ-ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సంపుటము ౨ సంచిక ౩.

చేసి తద్దయు వేడుకను నాలింపుఁ డయ్య వినారపోలెను నేను బ్రాంబోత్తనులు నాలుఁ జదువలేన'

కర్ణాటకమునఁ గూడ స్తోత్రగద్య రచనము లున్నవి. రామాశ్వమేధాదులందు లక్ష్యములు చూడ నగును.

సంస్కృతమున నామనుఁడు పేర్కొన్నముత్తెటఁ గులరచనములు నున్నవి. కాదంబరి, దశకుమారచరిత్ర, యశస్తిలకచంపూప్రభృతులందును, శ్రీ భగవద్రామానుజాచార్యులవారి గద్యత్రయమునందు, పాల్కురికి సోమనాథుని గద్య త్రయమునందును వీనికి లక్ష్యము లున్నవి. శ్రీభగవద్రామానుజాచార్యులవారి గద్యత్రయమునుండి ముత్తెటఁగుల రచనలకు మచ్చుతునుకలఁ జూపుచున్నాఁడను. మార్గమునకు—

అపారకరుణామ్బుధే, అనాలోచితవిశేషాశేష లోకశరణ్య, ప్రణతార్తిహర, ఆశ్రితవాత్సల్యైక మహోదధే, అనవరతవిదితనిఖిలభూతజాతయాథాత్మ్య సత్యకామ, సత్యసఙ్కల్ప, ఆపత్సఖ, కాకుత్స్థ, శ్రీమన్నారాయణ, పురుషోత్తమ, శ్రీరఙ్గనాథ, మమ నాథ నమోఽస్తుతే (శ్రీరఙ్గగద్యమ్)

ఉత్కలికాప్రాయమునకు—

స్వచ్ఛన్దానువర్తి స్వరూపస్థితిప్రవృత్తిభేదాశేష శేషతైకరతిరూపనిత్య నిరవద్య నిరతిశయజ్ఞానక్రియై శ్వర్యాద్యనన్త కల్యాణగుణగణ శేషాశన గరుడప్రముఖ

నానావిధానన్తపరిజన పరిచారికా పరిచితచరణయుగల పరమయోగివాఙ్మనసాపరిచ్ఛేద్యస్వరూపస్వభావ స్వాభిమతవివిధవిచిత్రానన్త భోగ్యభోగోపకరణ భోగస్థాన సమృద్ధానన్తాశ్చర్యానన్తమహావిభవానన్త పరిమాణ నిత్యనిరతిశయ శ్రీవైకుణ్ఠనాథ-

( శరణాగతిగద్యమ్ )

వృత్తగన్ధికి-

ప్రత్యగ్రోన్మీలిత సరసిజసదృశ నయనయుగలం-స్వచ్ఛనీలజీమూతసఙ్కాశమ్ - అత్యుజ్జ్వల పీతవాససం - స్వయాంప్రభయా అతినిర్మలయా అతిశీతలయా స్వచ్ఛయా మాణిక్యాభయా - కృత్స్నం జగద్భాసయన్తమ్ - అచిన్త్యదివ్యాద్భుత నిత్యయౌవన స్వభావ లావణ్యమయామృత సాగరమ్ - అతిసౌకుమార్యా దీషత్ప్రస్విన్నవ ద్దాలక్ష్యమాణలలాటఫలక దివ్యాలకావలీవిరాజితం - ప్రబుద్ధముగ్ధాంబుజచారు లోచనం - సవిభ్రమభ్రూలతమ్ - ఉజ్జ్వలాధరమ్ - శుచిస్మితం - కోమలగణ్డమ్ - ఉన్నసమ్ - ఉదగ్రపీనాంసవిలమ్బికుణ్డలాలకావలీబన్ధురకమ్బుకన్ధరం - ప్రియావతం - సోత్పలకర్ణభూషణశ్లథాలకా విమర్దశంసిభి శ్చతుర్భి రాజానువిలమ్బిభి ర్భుజై ర్విరాజితం - అతికోమలదివ్యరేఖాలఙ్కృతా తామ్రకరతలం, దివ్యాఙ్గులీయకవిరాజితమ్, అతికోమలనఖావలీవిరాజితం, అను

రక్తాంగుళీభి రలంకృతమ్, తత్క్షణోన్మీలితపుణ్డరీకసదృశ చరణయుగళమ్.

*(శ్రీవైకుణ్ఠగద్యమ్)

' తెలుఁగునఁ లక్షణగ్రంథకర్తలు వచనరచనల నిట్లు పేర్కొనిరి.

"క॥ కనుఁగొనఁ బాదరహితమై
పనుపడి హరిగద్దెపోలె బహుముఖ రచనం
బున మెఱయు గద్య మదిదాఁ
బెనుఁగుఁ గృతుల వచన మనఁగ దీపించుఁ గడున్.

గద్యము — స్వస్తి సమస్తభువనరక్షాదక్ష శ్రీపుండరీకాక్ష భుజగపతిసింహాసనారూఢ సురనికరమకుటతటఘటితానర్ఘ్యరుచిరమణిగణప్రభావిభాసితపాదపీఠ వేదనినాదానుకారగాఁగవలలితనూపురాలంకృత చరణసరసిజయుగళ నవ్యపదాంగుష్ఠనఖమయూఖలేఖాగ్రాతసురసరిత్ప్రవాహ పీతాంబరధర నూత్నమేఖలాకలితకటితటప్రదేశ చతురాననజనక నాళీకశోభితనాభిసరోవర యఖండబ్రహ్మాండమండలానుగోపనవిప్రణోదర క్షీరసాగరతనయామనోజ్ఞ గేహీకృతవిపులవక్షస్స్థల కనత్కనకకటక కేయూరప్రముఖభూషణభూషితచతుర్భుజ శంఖపంకజసుదర్శనగదాధర కిరీటకుండలాభిరామ యనవరతప్రసన్నవదన కౌండిన్యవరద శ్రీయనంతపద్మనాభ నమస్తే నమస్తే నమః—" (అనంతుని ఛందము)

* ఇందు ఆళవందార్ల స్తోత్రరత్నశ్లోకముల ఛాయలున్నవి.

'ఇఁక నందు గద్యల కేళీ–మఱియు నందు గద్యయు నైదుభేదంబుల విహరించు–నయ్యవి యేవంటేను–గద్యయు, బిరుదగద్యయు, చూర్ణికయు, వచనంబును, విన్నపంబులు నను గద్యభేదంబులైనను ప్రమోదంబున వివిధమ్ములై వినోదించు నందు గద్యక్రీడం బెట్టువలె నంటేని ౧ గద్య – అనుకరణ శబ్దయుక్తంబై యొప్పునందు ౨ బిరుదగద్య – సంబోధనాంత పదబంధురంబునై వర్తిల్లు నందు ౩ చూర్ణిక – ద్వివచన బహువచన సందర్భము లగు విభక్త్యనుశాసన సమాసాది సమాసాదిత కల్పనానల్పజల్పితంబై వెలయు నందు ౪ వచనంబులు – బహుప్రకారరచనానిచయప్రామర్యమ్ములై సంచరించు నందు ౫ విన్నపంబు – లెన్నవిన్నవై ఋజుమార్గమ్ముల నతిగమించి మించు నీపంచవిధమ్ములు మితివిరహితమ్ములై స్వేచ్ఛాకల్పనాగౌరవమ్ముల కొలందుల విలసిల్లు”

(లక్షణశిరోమణి)

మీఁది లక్షణగ్రంథకర్తలలో ననంతుఁడు పదునైదవ శతాబ్దివాఁడు. ఆతఁడు చెప్పినగద్యలక్షణమున కనుగుణముగానే కర్ణాటాంధ్రభాషలలోని ప్రాచీనవచనైకరచన లున్నవి. లక్షణశిరోమణికారుఁడు పొత్తపి వెంకటరమణకవి పదునేడవశతాబ్దివాఁడు గాఁబోలును. అతఁడు వచనరచనల నైదువిధముల విభజించినాఁడు! ఆతఁడు పేర్కొన్న 'విన్నపములే' యనంతామాత్యుఁడు

చెప్పంగద్యము లగును ఇట్టి రచనము లొకటి రెండు నిమిషములకు మించనికాలమునఁ జదువఁదగినవై స్తుత్యదేవతాసంబోధక పదాంతములై యుండును. వీనినే తాళ్ళపాకవారు వచనగీతము లని, తాళగంధిచూర్ణకము లని కూడఁ బేర్కొనిరి. ఈ విషయము మీఁద ముందు విన రింతును. అనంతామాత్యుని నాఁటికిఁ దెలుఁగున భారతభాగవతాది గ్రంథముల వచనైకరచనలు లేవు గాఁబోలును! అట్టివాని నాతఁడు పేర్కొనలేదు. పదునాలవ శతాబ్దినుండియే భారతభాగవతాదుల వచనైక రచనలు తెలుఁగున వెలసినట్లున్నవి. లక్షణశిరోమణికారుఁ డట్టివానిని దాను విభజించిన పంచవిధవిభాగములలో నాలుగవభేద మగు 'వచనముగా' నిర్వచించినాఁడు. ఈతని నాఁటికిఁ జూర్ణిక 'పాడిపాడి పలుకుల ప్రసన్నరచన గాక' సంస్కృతపుటుత్కలికాప్రాయ రచనగా మాఱినది. ప్రబంధరాజవిజయ వేంకటేశ్వర విలాసాదులందు దీర్ఘలఘువచనములు, అంత్యానుప్రాసచతుర్దశచూర్ణికలు మొదలగు వచనచిత్రరచనా ప్రభేదములు చూడఁదగును. మఱియు సంప్రదమున నన్నయాదికవుల కృతులలోని యాశ్వాసాంత వచనరచనలను 'ఆశ్వాసాంత గద్యము' లని పేర్కొనుట కలదు. అవి లక్షణశిరోమణికారుఁడు చెప్పిన 'బిరుద గద్యము' లగు నను కొనవచ్చును. అట్టి బిరుదగద్యములు సంబోధనాంతములుగా నుండవలె నని యాతఁడు చెప్పినాఁడు.

అట్లే ప్రాచీనరాజుల బిరుదగద్యములు నున్నవి గాని యోగగద్యముల కెల్ల సంబోధనాంతత నియతముగా నుండు నన్న నిర్ణయము నిలువదేమో! ఆశ్వాసాంత బిరుదగద్యములు సంబోధనాంతములుగా నుండవు గదా!

అనంతామాత్యుఁడు (వచన) గద్య మనియు, లక్షణశిరోమణికారుఁడు విన్నప మనియుఁ బేర్కొన్న తీరురచనము లవి సంస్కృతమున శ్రీ భగవద్రామానుజాచార్యులవారు రచించిన గద్యత్రయమును బాల్కురికి సోమనాథుఁడు రచించినపంచప్రకారగద్యములను బురస్కరించుకొని కర్ణాటాంధ్రములలో వైష్ణవ శైవ భక్తులు సాగించినరచనము లయి యుండు నని నే నను మానించుచున్నాఁడను. తెలుఁగున నాకుఁ గానవచ్చిన యిట్టి రచనలలోఁ బ్రాచీన మనఁదగినవి 'సింహగిరి వచనములు.' వీనికిఁ గృష్ణమాచార్య సంకీర్తనము లని నామాంతరము.*

మచ్చున కాతనివచన మొకటి:-

"దేవా! పదికోట్ల యజ్ఞాదిక్రతువులు నడపంగా నేమి, తొమ్మిదికోట్ల తులాభారంబులు తూఁగంగా నేమి, యెనిమిదికోట్ల సువర్ణదానంబులు, నేడుకోట్ల గోదానంబులు, నాలుకోట్ల భూదానంబులు, నయిదు

* ఆ వచనములు రచియించిన కృష్ణమాచార్యుఁడు కాకతీయ ప్రతాపరుద్రుని నాఁటివాఁ డని యేకశిలానగర చరిత్రాదులవలనఁ దెలియనగును.

కోట్ల కన్యాదానంబులు నాలుగుకోట్ల వస్త్రదానంబులు సేయుంగానేమి, మూండుకోట్ల సత్యాదివ్రతంబులు సలుపంగా నేమి, రెండుకోట్ల యన్నదానంబులు గావింపంగా నేమి, కోటిస్నానంబులు సేయుంగా నేమి మీ నామోచ్చారణంబు సేయుకే! పదివేల యజ్ఞాదిక్రతువులు నడపిన దేవేంద్రుండు నిలువెల్ల యోనులయ్యెను. తొమ్మిదికోట్ల తులాభారంబులు తూంగిన దుర్యోధనుండు యమపురికేంగెను. ఎనిమిదికోట్ల సువర్ణదానంబులు సేసిన కర్ణుండు పసిండికొండమీంది యన్నంబుల కపేక్షించెను. ఏడుకోట్ల గోదానంబులు చేసిన కార్తవీర్యార్జునుండు గోహత్యా బ్రహ్మహత్యా పాతకంబులం బొందెను. ఆఱుకోట్ల భూదానంబులు చేసినబలి విష్ణుపాదంబునం బాతాళంబునకేంగెను. అయిదుకోట్ల కన్యాదానంబులు చేసినధ్రువుండు కాశీక్షేత్రంబునం బంద్రెండువేల యేండ్లు భిక్షం బెత్తెను. నాలుగుకోట్ల వస్త్రదానబులు చేసిన మార్కండేయుండు మతిహీనుండాయెను రెండుకోట్లన్నదానంబులు చేసిన ధర్మజుండు యమపురి తొంగిచూచెను. కోటిస్నానంబులు చేసిన కుమారస్వామి కోరిక సిద్ధించదాయెను దేవా! మీ నామోచ్చారణంబు చేసి ప్రహ్లాద నారద పుండరీక వ్యాస శుక శౌనక భీష్మ దాల్భ్యరుక్మాంగదార్జున బలి విభీషణ భృగుగాంగేయాక్రూర విదురాదులగు పరమభాగవతోత్తములు కృతార్థులైరి. కావున యతిరామానుజ మునిపరందాతారు (?)

అనాథపతియైన స్వామీ సింహగిరి నరహరీ నమోనమో
దయానిధి."

(సింహగిరి నరహరి వచనములు) * కృష్ణమాచార్య సంకీర్తనములు

* సీ. కటకేంద్రుకూఁతురి కౌగిటిలోఁ జిక్కఁ
జెళ్లపెళ్లస్వామి చేతఁ గాదు
కృష్ణమాచార్య సంకీర్తనంబులఁ జొక్క
సింహాద్రి యప్పయి చేతఁ గాదు
కవ్వంపుఁగొండ సంఘర్షణోద్ధతిఁ జిక్క
శ్రీ కూర్మనాథుని చేతఁ గాదు
శాక్యకొండని జాలబడి వెంటయును బ్రుక్క.
చెన్నమల్లేశుని చేతఁ గాదు
పవనజవననిరాఘాటయవనఘోట
హరణజయధాటి మీచేత నౌను మేటి
వాదు వొకసన్నఁ జూచుమేలా పరాకు
శత్రుసంహార ! వేంకటాచలవిహార !

సీ॥ తాళ్లపాక చినన్న దండెమీటులు గావు
గోమాంసభక్షుదుర్గుణరవంబు
బంటొసంగినబంకమంటి పువ్వులు గావు
యవనాథముల చిలుకుంపగములు
సాముడిగ్గియనీటి చల్లులాటలు గావు
పాశ్చాత్యభటుల తుపాకిగుండ్లు
సంపెంగబాసలు జరగించుటలు గావు
రిపులపాశములు దర్శించుపగలు

ఇంకను నిట్టివి శంకరవచనము లని, శఠకోప విన్నపములని, కాలజ్ఞానవచనము లని, కార్తికావచనము లని, భవానీమనోహరవచనము లని, శివరాజయోగి వచనము లని, లక్ష్మీవల్లభ వచనము లని, శేషగిరినాథ వచనము లని మఱియుఁ గొన్ని పేళ్లతో వచనరచనలు ప్రాచీనములు గానవచ్చుచున్నవి. అవి యెల్ల నించు మించుగాఁ బదునాలుగవ శతాబ్దికిఁ దరువాతివే కాఁదగు ననుకొందును. ఇప్పటికి నా యెఱుక కందినంతలోఁ గాల

---

బంటుపంతము తగ దంచుఁ బంటకాఁపుఁ
దనము గైకొంటి విది మంచిగుణమె దినము
జనము దెచ్చిన ధనములప్పనము లిచ్చి
శత్రుసంహార ! వేంకటాచలవిహార !

సీ॥ పొట్టేళ్లఁగట్టి బట్టి బోడిసన్న్యాసుల
ఛీయని తాఁకు లాడించునొకఁడు
సోమయాజుల బ్రహ్మసూత్రముల్ ద్రెంచి సిం
గాణివింట్లకు నల్లె గట్టు నొకఁడు
ఖాబుఘోదా యంచు గుడిసెలు గుట్టము
నెక్కి ఛేయని తరబెత్తు నొకఁడు
పైకాలు గొమ్మని బిల్కిఁ గోమటివారి
చెలువపై. బడి బూతు సేయు నొకఁడు
యవనసమ్మర్ద దుర్దినం బైన దిగువ
తిరుపతిని జూచి యిటువంటి తఱిని నిదుర
పోవుచున్నాఁడు మీయన్న లేవలేక
శత్రుసంహార ! వేంకటాచలవిహార !

నిర్ణయముఁ జెప్పఁదగిన ప్రాచీన వచనరచనలలోఁ గృష్ణమాచార్యుల సంకీర్తనముల తర్వాత 'వేంకటేశ్వర వచనములే' పేర్కొనఁదగినవి. ఈ రెంటిలోఁ దొలిది పదుమూఁడవ శతాబ్ది తొలిది. రెండవది పదునైదవ శతాబ్ది తుదిది. ఇక్కడఁ బ్రసక్తములు శ్రీ వేంకటేశ్వర వచనములు.

## తాళగంధి చూర్ణకములు

ఇవి తిరుపతి క్షేత్రమున శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్యస్థానమున సంకీర్తనాచార్యులుగ సుప్రఖ్యాతు లయిన తాళ్ళపాకవారు రచించినవానిలోనివి. ఏతత్కర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు పదునైదవ శతాబ్ది చతుర్థపాదమున జనించి పదునారవశతాబ్ది పూర్వార్థమున వర్తిల్లినవాఁడు. * ఈ పెదతిరుమలాచార్యులవారికిఁ

* ఆతని కాలముననే యీ వచనములు రాగిరేకులమీఁదఁ జెక్కింపఁబడి తిరుపతి దేవస్థానమున భద్రపఱుపఁబడినవి. ఈ వచనములే కాక తాళ్ళపాకవారి పద్యగద్యగేయ రచనము లనేకములు రాగిరేకులపైఁ జెక్కఁబడి భద్రపఱుపఁబడినవి. అందుఁ గొన్ని రేకులు అహోబలమునకు శ్రీరంగమునకును గూడఁ జేర్పఁబడినవఁట! ఇటీవల నహోబలములోని రాగిరేకులు కొన్ని రాగిపాత్రలకై యమ్మఁబడినవనియు, నట్లమ్మఁబడినవి నాలుగైదు వందల రూపాయల విలువఁగల రాగిరేకు లనియు, వింటిని. తిరుపతి రేకులమీఁది సంకీర్తనములు శ్రీ తిరుపతి దేవస్థానమువారిప్పటికిఁ గొన్నింటి ముద్రించిరి.

కుమారుఁ డయిన చినతిరుమలాచార్యుఁడు తనతండ్రి పెదతిరుమలాచార్యులు వ్యాఖ్యానించినతీరు ననుసరించి తనతాత తాళ్ళపాక యన్నమాచార్యుఁడు సంస్కృతమున రచించిన 'సంకీర్తనలక్షణమును' దెలుఁగునకుఁ బరివర్తనము చేసెను. అం దీవచనరచనల నిర్వచనమిట్లున్నది.

'మఱియుఁ జూర్ణాఖ్యపదం బెట్టి దం టేని—

క॥ ధరఁ గృష్ణాచార్యాదిక
పరికల్పితపదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరఁగు నది నిరుక్తనామభాసిత మగుచున్.

మఱియు నుచ్చూర్ణవిధం బెట్టిదనిన—

క॥ ఛందోగణముల నియమం
బొందక తాళప్రమాణమునఁ గడుఁ జెలువై
కొంపఱిచేఁ డుచ్చూర్ణం
బందముగాఁ దాళగంధి యనఁ బొగడొందున్.'

పూర్వోదాహృత మైనసంకీర్తనలక్షణ గ్రంథ నిర్వచనముచొప్పునఁ దాళగంధిచూర్ణము లనఁ దగిన యీ వచనములను రచించి శ్రీ స్వామివారి సన్నిధిని శ్రీ తాళ్లపాక పెదతిరుమలాచార్యుఁడు రాగతాళములతో నాలాపించువాఁడు కాఁబోలును! రాగిరేకులనుండి యెత్తి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువా రింతకు ముందు ముద్రింపించినవచనములు నలువదేడింటికి రాగ తాళ

ములు నిర్ణీతము లయి యున్నవి. మఱియు నం దీవచనములు 'వైరాగ్యవచనమాలికాగీతము' లనుపేరఁ జేర్కొనఁబడినవి. అనఁగా నివి వచనములే యయినను గీతములుగాఁ బాడఁదగిన వన్నమాట! అందుచేతనే యివి సంకీర్తనలక్షణమున 'తాళగంధిచూర్ణకపదము' లని పేర్కొనఁబడినవి. సంస్కృతమున వామనుఁడు వృత్తగంధి, ఉత్కలికాప్రాయము, చూర్ణము నని ముత్తెఱఁగు గలవచనరచన చెప్పఁగా నితఁడా చూర్ణ మను వచనవిభాగముననే తాళగంధి యని పదరచనా విభాగముగాఁ గల్పించినాఁడు. ఈ తెలుఁగు వచనరచనలకుఁ జూర్ణ మను పేరు పొడిపలుకులందో నుండుటచే నేర్పడిన దగుట నీతఁడు సూచించినాఁడు. మనయీ వేంకటేశ్వరవచనములు పొడిపొడిపలుకులకూర్పే కాని, యిందుదీర్ఘోక్తులు, ప్రౌఢసమాసములు లేవు. ఇట్టిపదరచనములకుఁ గృష్ణాచార్యులు పరికల్పకు లని యీ సంకీర్తనలక్షణపద్యమున నున్నది. ఇంతకుముందు నేనుదాహరించినకృష్ణమాచార్యసంకీర్తనములకర్త కృష్ణాచార్యుఁడే సంకీర్తనలక్షణకారుఁడు పేర్కొన్న కృష్ణాచార్యుఁడు కాఁగలఁడు. ఇట్టిరచనములకుఁ గృష్ణమాచార్య సంకీర్తనము లనఁబడుసింహగిరినరహరి వచనములే ప్రప్రథమరచనము లని యీ సంకీర్తనలక్షణగ్రంథోక్తినిబట్టి గుర్తింపనగును. దీనిని లక్ష్యీకరించుకొనయే యనంతామాత్యుఁడు గద్యనిర్వచనము నట్లు

చేసియుండును. తర్వాతి కాలమున నిట్టివచనములు 'విన్నపము' లనియుఁ బేర్కొనఁబడినవి.

## వేంకటేశ్వర వచనములు - వానియోగ్యత

ఈ వచనములకు రచనములో నానుపూర్వి యేదియుఁ గానరాదు. వస్తువిన్యాసమునఁ గూడఁ గ్రమపద్ధతి యేదియుఁ దోఁపదు. కవి యప్పటికప్పుడు తనకుఁ దోఁచిన తత్త్వవిషయముల నీశ్వరస్తుతిపరములు గావించి విడివిడిగనే వచనములుగా రచించినాఁడు గాఁబోలును! ఇందు విశిష్టాద్వైత సిద్ధాంతవిషయములు సర్వత్ర కరడు గట్టియున్నవి. గ్రంథకర్త స్మార్తనందవరీక బ్రాహ్మణుఁడైనను వైష్ణవమతము స్వీకరించినవాఁడు. జాలిజాలిగాఁ గొంసరి కొంసరి శ్రీ వేంకటేశ్వరస్వామిని గవి యేతద్వచనరచనలలోఁ బలుదెఱఁగులఁ బరమార్థలబ్ధికై ప్రార్థించును. విశిష్టాద్వైతసిద్ధాంతపు జీవగఱ్ఱయగు 'శరణాగతి' యిందుఁ జాలఁ జక్కఁగా సమాదరింపఁబడినది. కవి యిందు స్వామిని బలుచోట్ల నేకవచనముననే తేలికగా 'నీ' వని యెచ్చరించును. కొన్నిచోఁ గొన్నిపట్టుల 'మీ' రని గొప్పగా బహూకరించును. తండ్రియొడిలో నాటవేడ్కలతో నుండు ముద్దులబిడ్డఁడు తండ్రిని నెయ్యంపుమురువునఁ దొక్కుఁబలుకులతో నీవని తుంకరించుట, యంతలోనే పెద్దఱికపుహద్దు తోఁపగా మరల మీ రని బహూకరించుట యందం దనుభూయమానమే

కదా ! ఆ యనుభూతి నాకీ తీర్పునకు సమర్థకముగాఁ దోఁచినది.

ఇందు ౧౮౭ వ వచనమున నూటయెనిమిది తిరుపతుల పేళ్లు పేర్కొనఁబడినవి. నిత్యానుసంధానాదులగు నర్వాచీన ద్రావిడ వైష్ణవ సంప్రదాయగ్రంథములలో నూటయెనిమిది తిరుపతుల (దివ్యస్థలముల) పేళ్లు ముద్రితములయి యున్నవి. వాని పరిగణన మాత్రముగా నేనాఁడు జరిగెనో గుర్తింపఁజాల నయితిని. ఆ పేళ్లకు నిందున్న పేళ్లకుఁ జాల భేదమున్నది. క్రీ ౧౫౦౦ ప్రాంతముల నూటయెనిమిది తిరుపతులపేరు ప్రసిద్ధముగా నుండె నని దీనిఁబట్టి తెలియ నగును. ఇందుఁ గొన్ని స్థలముల పేళ్ళు తప్పులుగా నున్నట్లున్నవి. ప్రబంధరాజ వేంకటేశ్వర విలాసమునను, హంసవింశతిలోను నూటయెనిమిది తిరుపతుల పేళ్లు నిందున్న తీరు ననుసరించి యున్నవి.

ఇందు వచనరచనారీతిలో ననంతుఁడు చెప్పిన గద్య (వచన) లక్షణము చక్కఁగా సరిపడినది. లక్షణశిరోమణికారుని 'విన్నపము' రచన కీ వచనములు మంచి లక్ష్యము లనఁదగును. దూరాన్వయము, సమాసక్లేశము, ననుప్రాసవిన్యాసపరిశ్రమము నిందు లేవు. సూటిగా మనసున నాటునట్లు భావము లున్నవి. కొన్ని వచనములు టాగోరుగారి గీతాంజలిరచనములఁ దలఁపించునవిగాఁ గూడ నున్నవి. కృష్ణమాచార్యసంకీర్త

నములు సరిగా నిట్టివే, వీనికి మూలకల్పములే కాని, యందు భాషాప్రాచీనత యింతకంటె విస్పష్టముగా గోచరించుచున్నది. ఈ వచనములను రాగతాళములతోఁ బ్రాచీనకాలమునఁ బలువురు పాడెడివారు గావలయు. కవియే భావానుగుణముగా వీనికి రాగతాళములఁ గల్పించినాఁడు.

## తాళ్లపాకవారు

ఏతద్గ్రంథకర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు నందవరీక స్మార్తబ్రాహ్మణుఁ డంటిని. తాళ్ళపాక నేఁటి రాజంపేట తాలూకాలోనున్నది. అది వీరి నివాసగ్రామము. ఈకవి తండ్రి

## అన్నమాచార్యుఁడు

ఈతఁడు వైష్ణవమతమును స్వీకరించినవాఁడు. గొప్పభక్తుఁడు. కవి. మహిమలు గలవాఁడు. ఈతఁడు డెబ్బదితొమ్మిదియేండ్లు జీవించెను. ఈ యన్నమాచార్యుఁడు దినమున కొక్కదాని కేని తక్కువకాని చెప్పిన గేయములు రచించుచు శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిని సంకీర్తనము చేయుచుండువాఁడట! ఈతనికిఁ బదునాఱవయేట స్వామి ప్రత్యక్ష మయ్యెనట! నాఁటనుండియే స్వామి యానతిచొప్పున నితఁడు సంకీర్తనములు రచింప నారంభించెను.

ఈతనికి సంకీర్తనాచార్యుఁ డని, ద్రవిడాగమసార్వభౌముఁ డని, పంచమాగమచక్రవర్తి యని బిరు

దులు. శ్రీ వేంకటేశ్వరస్వామి కీతఁడు వరాము. అలమేలు మంగాంబ కీతఁడు తండ్రి వరుసవాఁడు. ఇతని సంకీర్తనలను వినిపించెదని మఱొకరి సంకీర్తనముల విన నొల్లనని శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిజ్ఞఁ గావించెనఁట! ఈతఁడు రచించిన గ్రంథములు 1 ఆధ్యాత్మసంకీర్తనలు 2 శృంగారసంకీర్తనలు 3 శృంగారమంజరి 4 సంకీర్తనలక్షణము (సంస్కృతము; ఇది దొరకలేదు) ఈ కవికి సంబంధించినచరిత్రము శాసనాదులందుఁ గానరాదు. [1]కాని తాళ్ళపాక చిన్నన్న ద్విపదకృతిగా నితని చరిత్రము రచించినాఁడు. ఈతని కుమారుఁడు

## [2]పెదతిరుమలాచార్యుఁడు

ఈతఁడే శ్రీవేంకటేశ్వరవచనములకుఁ గర్త. శ్రీ తిరుపతి దేవస్థానమున నున్న రాగిరేకులమీఁద నీ వచనములు తిరుమలాచార్యరచితము లని గ్రంథారంభమునఁ జెప్పఁబడినది. ఈతఁడు మహైశ్వర్యసహితుఁడుగా వెలసెను. శ్రీ వేంకటేశ్వరస్వామి కితఁ డనేక కైంకర్యముల జరపించెను. శ్రీ స్వామి యీతనితోఁ దరుచువాతి

1. ఇది తిరుపతి ఓరియంటల్ యిన్‌స్టిట్యూట్‌వారు ప్రకటించిరి.

2. ఈతఁడు పెదతిరుమలాచార్యుఁ డని, పెద తిరుమలాచార్యుఁ డని, పెద తిరుమలయ్య యని, తిరుమలార్య దేశికుఁ డని పలు పేరులఁ బేర్కొనఁబడుచున్నాఁడు.



పెదతిరుమలయ్య


మూఁడుతరములవారికిఁ బ్రత్యక్షమును, నేఁడుతరముల దాఁకఁ బరమపదమును ననుగ్రహించెనఁట! ఈతని యితర కృతులు ౧ శృంగార సంకీర్తనలు ౨ శృంగారదండకము ౩ చక్రవాళమంజరి ౪ శృంగారవృత్తశతకము ౫ శ్రీవేంకటేశోదాహరణము ౬ నీతిసీసశతకము ౭ సుదర్శనరగడ ౮ రేఫఱకారనిర్ణయము ౯ ఆంధ్రవేదాంతము (ద్విపద) ౧౦ ఆంధ్రహరివంశము ౧౧ భగవద్గీత (వచనము) ౧౨ శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము ౧౩ అధ్యాత్మసంకీర్తనలు. ఈతనికి వేదమార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంతస్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి, శరణాగతవజ్రపంజర బిరుదములు కలవు. స్వామికీతఁడు జరపిన కైంకర్యముల సారము :___

పెదతిరుమలయ్యగారు క్రీ. 1517 నుండి 1552 దాఁక శ్రీ వేంకటేశ్వరస్వామివారికిని, నింక నితరస్థలములలోని దేవాలయములకును నైవేద్యప్రసాదోత్సవాది కైంకర్యములకై పదునాల్గు గ్రామముల నర్పించిరి. ఆ గ్రామములు అచ్యుతరాయఁడు, బుక్కయ తిమ్మరాజు మొదలగువారు తనకు దానము చేసినవి. అంతేకాక యెన్నో వేల పణములను గూడ నానాపుణ్యకార్యములకై వా

రర్పించిరి. తిరుమలమీఁదఁ దమసంకీర్తనములు చెక్కిం
చినరాగిరేకులు దాఁచియుంచిన సంకీర్తనభాండారము
రక్షించుటకై యర్చించుటకై కూడ గొప్పదానములు
చేసిరి. తండ్రిగారును దామును రచించిన సంకీర్తనము
లను స్వామివారిసన్నిధిని ప్రతిదినముఁ బాడుటకై యిద్దఱు
వైష్ణవుల నియోగించిరి. స్వామివారి కోనేటిని, గోపుర
ములను, మంటపములను చెక్కఁటిని జక్కఁబఱిపించిరి.
కోనేటికడను నీరాడుమంటపమును గట్టించిరి. ఇట్లెన్నో
పుణ్యకార్యముల జరపిరి. తండ్రివలె నీతఁడు గూడఁ
బూర్ణపురుషాయుష జీవితము గల్గినధన్యచరిత్రుఁ డయి
యుండును. ఈతని జన్మకాలము క్రీ 1473 అగును.
అప్పటినుండి క్రీ. 1553 తర్వాతిదాఁక నీతఁడు జీవించి
నాఁడు. ఈతనికి సాతానివైష్ణవు లిద్దరు శిష్యులుండెడివా
రఁట! వారుకూడ నీతనివలె స్వామికిఁ గొన్నికైంకర్య
ములు జరపిరి.

ఈతనికిఁ గుమాళ్లు ౧ చినతిరుమలాచార్యుఁడు ౨ అన్నయ ౩ పెదతిరువేంగళనాథుఁడు ౪ తిరువేంగళనాథుఁడు (చిన్నన్న) ౫ కోనేటి తిరువేంగళనాథుఁడు.

ఇందు నాల్గవకుమారుఁ డయిన తిరువేంగళనాథుఁడు రచించిన యష్టమహిషీకల్యాణమున వీరి వంశవృక్ష మిట్లున్నది.


1 అన్నమాచార్యులు (౧౪౨౪-౧౫౦౩)
(తిమ్మాంబ. | అక్కాంబ)
(తిమ్మాంబవలన)
అక్కాంబవలన
నరసింహ
(నాచ్చారమ్మ | అనంతమ్మ)
2 పెదతిరుమలాచార్యులు
(తిరుమలమ్మ) 1473-1553.
ఇంచుమించుగా
తిరుమలాంబ
(తిరుమలకొండ
యాచార్యులు)
నరసమాంబ
(?)
నారాయణ
(నాచ్చారమ్మవలన)
అప్పలార్య
(అనంతమ్మవలన)
అన్నయార్య
(అనంతమ్మవలన)
6 రేవణూరి వేంకటార్యులు
3 చినతిరుమలార్యులు
అన్నయ
పెదతిరువేంగళ
నాథుడు
4 చిన్నయ్య
అను
తిరువేంగళ నాథుడు
కోనేటి తిరువేంగళ
నాథుడు
5 తిరువేంగళప్ప

1. మూలపురుషుఁడు శృంగార సంకీర్తనాది గ్రంథకర్త.

2. వేంకటేశ్వరోదాహరణాది బహుగ్రంథకర్త. వేంకటేశ్వరవచనకర్త కూడ.

3. సంకీర్తనలక్షణాది గ్రంథకర్త.

4 అష్టమహిషీకల్యాణ పరమయోగివిలాస పరిణయ యామునాచార్య చరిత్ర గ్రంథకర్త.

5. ఆంధ్రనామరూపామర వ్యాఖ్యా సారప్రకాశ వ్యాఖ్యకర్త.

6. శకుంతలాపరిణయము, శ్రీపాదరేణుమాహాత్మ్యము ఇతని కృతులు.

ఈ తాళ్ళపాకవారికి దేవరాజుగారు జామాతృవంశమువారు. దేవరాజు వేంకటకవి తన శకుంతలాపరిణయమున నిట్లు చెప్పినాఁడు.

శ్రీవత్సాన్వయ దేవరాజకులజున్ శ్రీపాదరేణుప్రభా
సౌవర్ణస్ఫుట కావ్యకల్పనకళా సంకీర్తనాచార్యపు
త్త్రీవంశోత్తము సంద వైదికబుధాతిప్రోక్తసత్కీర్తియుం
భావుం దిర్మల కొండయార్యసుతు శుభద్వేంకటా
భిఖ్యునిన్.

శ్రీ వేంకటరమణునకు ......... సమర్పణంబుగా సమర్పించెద నిహపరసాధనములకు నింక నేమి కొదవ యదియునుం గాక యమ్మహాదేవుండు మదీయమాతా

మహావంశశిఖారత్నం బగు నన్నయాచార్యునకు జామాతరుం డనిపించుకొని భవదీయసంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితరసంకీర్తనంబు లాలించ నని ప్రతిజ్ఞఁ గావించెఁ దత్తనూజుం డగు పెద్దతిరుమలాచార్యబిడౌజునకుఁ ద్రిపురుషపర్యంతముగాఁ బ్రత్యక్షంబును, సప్తపురుషపర్యంతముగా మోక్షంబు నొసఁగెద నని వరమిచ్చె; సచ్చరిత్రు లగు తదీయపౌత్రులకుఁ జినతిరుమలదీక్షితాన్నయాచార్య తిరువేంగళనాథకోనేటితిరువేంగళనాథ మంగళార్యులకు విచిత్రముక్తాతపత్ర రత్నకిరీట ముద్రికా ప్రచండమణిమండిత మకరకుండలోత్కరాహః కరదీపికా పాదుకాది బహూకరణంబులఁ గరుణించె; విశేషించియు నత్తిరువేంగళనాథుండు సంకీర్తనంబుఁ బాడిన నాడఁగఁ దొడంగె నేతత్ప్రకారంబున నమ్మహానుభావునకుఁ బాండవసహాయుండైన శ్రీకృష్ణదేవునింబలె సహాయుండై......ధన్యుడ నయ్యెద నని నిశ్చయించి" ఈ గ్రంథమునుబట్టి చూడఁగా నీ వేంకటాచార్యకవి సంకీర్తనాచార్యుఁ డగు నన్నమాచార్యునికి దౌహిత్రసంతతిలోనివాఁ డని యేర్పడును. రచనయును జాలఁ దర్వాతిదిగానే యున్నది. ఈతనిదే యగు *శ్రీపాదరేణుమాహాత్మ్యమను గద్య మాతఁడు సంకీర్తనాచార్యుని మనుమఁడే యనఁదగిన ట్లున్నది:—

* ఇది తిరుపతి ప్రాచ్యపరిశోధనశాల లైబ్రరీలో నున్నది. కృత్యవతరణిక లేదు.

'ఇది సంకీర్తనాచార్యదౌహిత్ర రేవణూరితిరుమలకొండయాచార్యపుత్ర వేంకటాచార్యప్రణీతం బైన శ్రీపాదరేణుప్రభావం బనునిస్సహాయకావ్యంబునందు రంభాపురందరసంవాదం బనునది తృతీయోల్లాసము.' ఇది తప్పయి యుండునేమో! 'సంకీర్తనాచార్యదౌహిత్ర వంశ్య' అని యుండఁదగు నేమో!

ఆనాఁటి తాళ్ళపాకవారిశము వారు మహనీయులు. వారి రచనము లింక నెన్నో ప్రకటితములు గావలసి యున్నవి.

౨

# హరవిలాసము

## కృతికర్త

శ్రీనాథకవి జన్మదేశము కృష్ణామండలమందలి కాల్పట్టణము; ఒండెఁ, గలుపటము కాఁదగును. * పాకనాటి నియోగి గాన యాతఁడు పుట్టి పెరిఁగినయూరు పాకనాటనే యుండవలె ననుట సరి గాదు. పాకనాటినియోగులు తొలుత పాకనాట నుత్పత్తిల్లినవా రగుదురు. అంతే కాని, సదా వారక్కడే పుట్టుచుఁ బెరుఁగుచు నుండవలసినవా రనఁగాదు. శ్రీనాథుని బంధువులు (గాన, పాకనాటి నియోగులు) బెండపూఁడి యన్నామాత్యాదులు శ్రీనాథునినాఁటనే గోదావరీమండలమున నుండిరి. వారు కొన్నితరముల పూర్వమునుండి గోదావరీమండలవాస్తవ్యులే. పాకనాటివారు పాకనాటనే, వెలనాటివారు వెలనాటనే, యాఱువేలనాటివారు ఆఱువేలనాటనే యానాఁ డుండి రనుట కాధారములు గాన రావు.

శ్రీనాథుఁడు క్రీ. శ. 1385 ప్రాంతముల జన్మించి చిరంజీవియై పదునైదవశతాబ్ది యుత్తరార్ధమునఁ గొంత దాఁకఁ గూడ వెలయుచుండెను. ♦

* చూ. శృంగార శ్రీనాథము

# హరవిలాసము

సీ. కమలనాభునిపౌత్రుఁ గవితామహారాజ్య
భద్రాసనాసీనుఁ బరమపుణ్యుఁ
బాత్రు నాపస్తంబసూత్రు భారద్వాజ
గోత్రు సజ్జనమిత్రుఁ గులపవిత్రు
భీమాంబికామారనామాత్యనందను
నఖిలపురాణవిద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖాధీతినిష్ణాతు
సంప్రదాయాసైషధాబ్దిభవుని
నుభయభాషాకవిత్వ ప్రయోగకుశలు
వాలసఖు గారవించి తాత్పర్య మొప్ప
నవచిత్రిపురాంతకుం డబలాధిరాజు
హితమితోక్తులు వెలయంగ నిట్టు లనియె.

పై పద్యమున శృంగారనైషధరచనప్రశంస గలదు. కాన హరవిలాసరచనము శృంగారనైషధ రచనానంతరము జరగిన దగుట స్పష్టపడినది. శృంగార నైషధము పెదకోమటి వేమారెడ్డిగారు కొండవీటి సామ్రాజ్యము నేలుచుండు కాలమునఁ దన్మంత్రి యగు మామిడిసింగామాత్యున కంకితముగా రచియింపఁబడి నది. అందు మామిడిసింగమంత్రి యిట్లు ప్రస్తుతు డయ్యెను.

మ. అపుదారన్ వివిధాగ్రహారములతో
నాందోళికాచ్ఛత్రచా
మర (వ ?) ల్యాణకాచికాదులహూన
మ్మానార్థ చిహ్నంబు లా
దర మొప్పారఁగ వేమభూపతిసచే
తన్ గాంచె సామ్రాజ్యసం
భరణప్రౌఢుఁ డమాత్యసింగఁడు నయ
ప్రాగల్భ్యగర్వోన్నతిన్.

క. శ్రీమహిత పెదకోమటి
వేమక్షితిపాల రాజ్యవిభవకరణా
క్షమదికి సింగసచివ
గ్రామణికిన్ బాండ్యరాయగజకేసరికిన్.

మ. ...............వేమభూపతి మహా
సామ్రాజ్యరక్షామణీ
యవనాధీశ సభానిరంకుశవచో
వ్యాపార పారంగతా!

శ్రీనాథకవియుఁ బెదకోమటివేమారెడ్డిగారి రాజ్యకాలమునఁ దదాస్థానవిద్యాధికారిగా నుండెను. పెదకోమటివేమారెడ్డిగారు క్రీ. శ. 1404 నుండి 1420 దాఁక రాజ్యమేలిరి. శృంగార నైషధరచన మాకాలమున, అటు తర్వాతనేని జరిగినది కావలెను. హరవిలాసరచన మంతకు నింకను దర్వాతి దగునుగదా!

భీమఖండమును శ్రీనాథుఁడు క్రీ. శ. 1428 కిఁ దరువాత రచించెను. * భీమఖండము సంస్కృతగ్రంథ

* చూ. శృంగార శ్రీనాథము.

మునకుఁ దెలిఁగింపు అందలి పద్యము లెల్ల సంస్కృత మూలానుసారులు. భీమఖండమునను హరవిలాసమునను సముద్రమథనకథ గలదు. మూలానుసారి యగుభీమఖండపద్య మిూ క్రిందిది హరవిలాసమునను గలదు.

క. కటుకు మగువిషము విషధర
కటకం బగుకేలఁ బూని కౌతూహలియై
ఘుటికా సంసిద్ధుఁడు విష
ఘుటికయునుంబోలె మృడుఁడు గుటుకున మ్రింగెన్.

దీనికి సంస్కృత భీమఖండమున మూల మిట్లు కలదు.

శ్లో. గ్రసతేస్మ జగత్త్రాతా
విషభృద్భూషణో విషమ్
ఘుటికాం ఘుటికాసిద్ధో
బధ్వా రసమయీ మివ — ౧ అధ్యా. ౭

కాన, భీమఖండరచనానంతరము హరవిలాసరచనము జరగె ననవలె.— అనఁగా, క్రీ. శ. 1430 తర్వాత హరవిలాసరచనము జరిగిన దేర్పడును.

## కృతిపతి

హరవిలాసము శ్రీనాథుని బాలసఖుఁ డగు నవచి తిప్పయ యను వైశ్యవర్యుని కంకితము సేయఁబడినది. బాలసఖపదమునకుఁ జిన్ననాఁటి స్నేహితుఁ డని యర్థము. (ఈ యర్థముననే భారతాదిగ్రంథములయందుఁ బ్రయుక్తము.) హరవిలాసరచనమునాఁటికి నవచితిప్పయ కడు వృద్ధుఁడు.

క. కంటిఁ బ్రవిశుద్ధసంతతి
వింటిఁ బురాణములు పెక్కు విశ్వము పొగడన్
మంటి బహువత్సరంబులు
గొంటి యశోధనము సుకవికోటులచేతన్.

హరవిలాసము అవతరణిక.

అతని బాలసఖుఁ డగు శ్రీనాథుఁడును హరవిలాస రచనమునాఁటికి వృద్ధుఁడే. కాని, శ్రీనాథునికంటెను నవచితిప్పయ మఱీ వృద్ధుఁడు. అవచితిప్పయ కాంచీ పురనివాసి. శ్రీనాథుఁడు కాంచీపురి కరిగి యక్కడ నీ గ్రంథమును భీమఖండరచనానంతరము కాశీఖండరచన మునకుఁ బూర్వము రచించి యుండును. హరవిలాస కృత్యవతరణికాపద్యములు, కాశీఖండమున 'కంచి యతఁ డత లసమాస్తుశ్లిష్టలతిలు' అన్న పద్యమును నాతని కాంచీపురీపరిచయము నెఱిఁగించుచున్నవి

రెడ్డిరాజ్యారంభకాలమునాఁటనుండియును నవచి తిప్పయవంశమువారు ద్వీపాంతరములతో వ్యాపారము జరపుచు, రెడ్డి రాజుల కత్యాప్తు లయి యుండిరి. అద్దం కికిని గొండవీటికిని జేరువగాఁ దూర్పుసముద్రమునొడ్డునఁ గల ముకుళపురము (మోటుపల్లి) ఓడరేవుద్వారమున ద్వీపాంతరములతో వ్యాపారము వారు జరుపుచుండెడి వారు.

శ్రీనాథుని బాలసఖుఁ డగునవచితిప్పయ క్రీ. శ. 1390 నుండి 1404 దాఁక రాజ్యమేలిన కొమరగిరి

నృపాలు విపులన 'ఆందోళికాచ్ఛత్రచామరతురంగభద్ర పీఠాది రాజ్యచిహ్నములు' వడసెను. అమ్మహారాజునకుఁ బ్రతివత్సరంబును సంవత్సరోత్సవాంబులకుఁ దగిన 'కస్తూరీ కుంకుమకర్పూర సంకుమదహిమవాంబు కాలాగురుగంధ సార' ప్రధానము లగుసుగంధద్రవ్యము లొసఁగూర్చు చుండువాఁడు. మఱియు నాతఁడు 'చీని సింహళ తెనాయి హాలుకుమంజి జోళంగి ప్రభృతి నానాద్వీప నగరాంతరము లగుఘన కనక వస్తు నానావ మాణిక్య నాణిక్యములను' దెప్పించి యిచ్చువాఁడు. మఱియు,

సీ. పంజారఁ గర్పూరపాదపంబులు దెచ్చె
జలసోంగి బంగారు ( [illegible] ? ) మొలకఁ దెచ్చె
సింహళంబున గంధసింధురంబులు దెచ్చె
హాలుమంజి బలుతేజిహయములు దెచ్చె
గోవ సంపుష్టసంపదుత్ప్రభవముఁ దెచ్చె
యాంపఁ గస్తూరిమృగ్యాలు దెచ్చె
ఖోటఁ గస్తూరి కాపు (టోక) ములు దెచ్చె
చీనఁ జీనాంబరశ్రేణి దెచ్చె
జగపగోపాలరాయ వేశ్యాభుజంగ
పల్లవాదిత్య ఘూదాసపరశురామ
కొమరగిరిరాజదేవేంద్రు కార్తిమహిమఁబు
వాణిజగజెట్టి దేవయచామి సెట్టి.

మ. తరుణాసేరి, తవాయి, గోవ, రమనా,
స్థానంబులం జంపనా

గరుడ కర్పూరహిమవాలుక పంకము జవాది
కస్తూరికాద్రవ్యమున్
శరధిఁ గప్పలి జోఁగు వల్లి పసికా
సమ్మాన్యఁ దెప్పించు నే
ర్పరియై వైశ్యకులోత్తముం డవచితి
ప్పం డయ్యఁడే యిమ్మహిన్.

[పై పద్యములఁ గల దేశనామములకు కొన్నిటికి వివరణము: చీని-చీనాదేశము. సింహళము ప్రసిద్ధము. గోవా — మలయద్వీపకల్పమునఁ గల రేవుపట్టణము. తెలుఁగున "ఓడ యెక్కగోవాయి ఒడ్డు చేరితే" అని సామెత ప్రసిద్ధము. హురుమంజి (ముంజి)[1] — హార్మజ్ — పారసీక సముద్రతీరమునందలిది. జోనాంగి — ఇది మలబారుతీరమునఁ గల చిన్నద్వీపములలోని పట్టణము కావచ్చును. జోనాంగి సెకండ్లని పాడుకొనవచ్చును. మలబారుతీరపు లక్కదీవులకు కోనాహార్ అని పేరు. ఏలార్ — ఇది సుమాత్రాద్వీపమున జాక్ అను పేరు గలది. ఒంటి, బోర్నియో ద్వీపమున పంజార్ మాసిన్ అను పేరు గలది. ఈ రెండు దేశములు కర్పూరవృక్షములకు ప్రసిద్ధములే యుండుట! [2]జలనోంగి — ఇది యేదో యెఱుఁగరాలేదు. ఇక్కడనుండి బంగారు మొలకలను తెప్పించుచున్నాని ఆచరణమునఁ

(1) ఈ విషయమును శ్రీ సోమశేఖరశర్మగారు తెల్పిరి.
(2) జలనోంగి—చిటగాంగ్ అని శ్రీ కొమపపోలు సుబ్బారావుగారు భావించిరి.

దొల్లఁ గర్పూరపాదపములు గలవు గాన, యిక్కడ 'పన్నీరుమొలక' యని యుండదగు ననుకొంటిని. శ్రీనాథునినాఁటికి కొంచెము పూర్వమునుండి మాత్రమే మనదేశమునకుఁ బన్నీరుగ వచ్చుట యేర్పడెను. పన్నీటికిఁ గాని, గులాబిచెట్టునకుఁ గాని సంస్కృతమునఁ బేరు లేదు. అది మనదేశపుఁ బూలచెట్టు గాదు, శ్రీనాథుని కొంచెము పూర్వపువాఁడగు నాచనసోముఁడు పన్నీటిని పేర్కొనెను. సంస్కృతంబునఁ బన్నీటికి కల్పకదు 'హిమాంబు' అని పేరు వెలసెను. అది 'పన్నీరు' పదమునకు సంస్కృతీకరణము. అది సంస్కృత శ్లోకములఁ గలదు. శ్రీనాథుని తెల్గు గ్రంథములను బన్నీరని, గోజంగి యని దాని శైలి(గిరు) గలదు మనదేశమునకుఁ గొలుతఁ బన్నీరును పిదపఁ గొన్నాళ్లకు దాని చెట్లును వచ్చినవఁట! ఆ చెట్టునకుఁ బారసీకమున 'గుల్' అని పేరు. దాని నీటికి 'గుల్ + ఆబ్ (నీరు)' అని పేరఁట పన్నీటి నిచ్చు చెట్టు గాన అదే గులాబి చెట్టయినది. తెలుఁగున నా చెట్టునకు గోజంగి అనిపేరు ఈ పేరు హిమాలయపార్శ్వత్రారణ్యక వ్యవహారమునఁ గలదఁట. పన్నీరు గాని పట్టిగులాబిచెట్లు హిమాలయప్రాంతమునఁ బూర్వము లేవఁట అవి దక్షిణదేశములకు వ్యాపించి యూరోపీయులోనే వ్యవహారమునఁ బడెనఁట. పన్నీరు తీయు చెట్లు 'రోజ్' రంగు గల వట్టే. అవి పారసీకమునుండి వచ్చినవే యఁట. రెడ్డి రాజ్యమునాఁటిలో నా చెట్లను నవచి తిప్పయనఁగను

వారు మనదేశమునకుఁ గొని తెచ్చి యుండవచ్చును. పన్నీరు ద్వీపాంతరములనుండి తెప్పయు తెప్పించుకొందు రను శ్రీనాథుఁడే చెప్పినాఁడు. తెలుఁగు దేశమునందు 'గాజు గిన్నెలు' 'పంజరపు (రోజాంగు) గాజుగిన్నె' నవరత్నములు. నేఁటివఱకు తెలుపుచున్నవిగాని, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు[1] ఆస్ట్రేలియాది దేశములందు 'బంగారు మొలకలు' (మొలకలు = పలుకులు ఈ యర్థమున నీవరకు దేశములందు వ్యవహారము గలదు.) బంగారము చేతల్లు ప్రకృష్టమయి యున్నదనిరి. మొలక బంగారు అను పదమునకు శబ్దార్థకరమున 'పుట్టలలో పురుగులవల్లఁగలిగిన బంగారు' అని యర్థము కలదు. గోవా — పశ్చిమసముద్రతీరపు గోవాపట్టణమే కావచ్చును. యూరపు — యూరోప్ఖండము, జాన్సీ. ఇక్కడి నుండి ముత్యాలఁ దెచ్చెను. ఇవి ముత్యాలకుఁ బ్రసిద్ధము. భోట — భూటాన్ — ఇది కస్తూరికిఁ బ్రసిద్ధి కెక్కినది. చీని — చీనాదేశము - పట్టుబట్టలకుఁ బ్రసిద్ధము. ఇక్కడనుండి చీనాంబరములఁ దెచ్చెను. తరుణాసిరి — తర్నాసరి (Tarnassari), ఇదియు మలయద్వీపకల్పమున నొక రాష్ట్రప్రధాననగరము. తరుణాసిరి మన తెలుఁగున నిటీవల 'దనాసరి' అయినదనుకొందును. 'దనాసరికము', 'దనాసరి గోంగూర' అని వ్యవహారములు గలవు. గోంగూర భేదము తరుణాసరినుండి తోఁటకు వచ్చియుండవచ్చును.

1. దీనిని శ్రీ మ. సోమశేఖరశర్మగారు గుర్తించిరి.

షాజార్ మానీపే నుండి—పంపర పనస, ఒటివియా నుండి 'బత్తాయి' పండ్లు వచ్చినవి. రాగములలో ధన్యాసి యొక్క మొదటి రాగము గలదు - అది 'తెలుగ్గాసి' అని సింహళము గాంభోలువి. రాగములు కొన్ని దేశముల పేర్లతో నున్నవి. ఠిమర్గా-బర్మా దేశభాగము.

కృతిపతి యగు నవచితిప్పయను గూర్చి యింకను విశేషములు కృత్యవతారికనుండి యాశ్వాసాంతపద్యములనుండి గ్రహింపనగును.]

## గ్రంథరచన

హరవిలాస మెనిమిదాశ్వాసముల ప్రబంధము. ఇందు చిఱుతొండనంబి చరిత్రము, మదనదహనము, గౌరీకల్యాణము, దేవదారువనవిహారము, సముద్రపానము, కిరాతార్జునీయము ననుకథలు గలవు. ప్రథమ ద్వితీయాశ్వాసములు పీఠికతో, చిఱుతొండనంబి కథతో నిండుచుండుచుగా నిన్నూటపన్నెండు గద్యపద్యములు, తృతీయాశ్వాసము మదనదహనకథతో నూఱు గద్యపద్యములు, నాల్గవయాశ్వాసము గౌరీకల్యాణకథతో నూటయైదు గద్యపద్యములు, పంచమాశ్వాసము దేవదారువనవిహారకథతో డెబ్బదిరెండు గద్యపద్యములు, నాఱవయాశ్వాసము సముద్రపానకథతో నూటముప్పదియైదు గద్యపద్యములు యేడవ యాశ్వాసము కిరాతార్జునీయకథతో నూటతొంబది

యేడు గద్యపద్యములు వెరసి యేనూర్లు గద్యపద్యములు గలిగి యీ ప్రశస్త ప్రబంధము వెలయుచున్నది.

చిఱుతొండనంబి చరిత్రము

ఇది పాల్కురికి సోమన బసవపురాణకథ ననుసరించి కలదు. కాని, మూలమునకంటె హరవిలాసమునం దత్యధిక హృద్యముగాఁ జాలఁ బెంపు పొందినది. పెంపకమునఁ గలపనముత్కృష్ట కొక మచ్చుతునుక—

స్వదేశ యోగనేమమున నున్నప్పుడు చిఱుతొండనంబితో

'పండుగాలం బిద్యో. నేను హరుని నుద్దేశించి నిరాహారవ్రతము గైకొన్నవాఁడ. ఆ వ్రతమును కుద్యాపనము సేయుఁడు గావలయును. అతఁడు—

సీ. గీ. లోకసంకాశదేహుండు పాపసియును
వాఁడు పల్లియుఁ బంట్రియు పడుగు సేసి
వాని మొసరించు పట్టింప ఘనుని కొనగ
పంపుము నాబంతి నిలుపేఁడుఁ గొని రఁగుముప'

అనెను. చిఱుతొండఁ డంగీకరించెను. తుద కాశివయోగి యారగించునపుడు—

'పిన్నవాఁడు బంతిలో భోజనంబు సేయక నాకుఁ గడి నోరికిఁ బోదు. మగబిడ్డఁడు లేనినిర్భాగ్యునింట భోజనంబు సేయ. నీకుమారు నాబంతి నారగింప రప్పింపు' మనెను. చిఱుతొండఁడు—

మ. మొదలం దేవర యానతిచ్చితిర, యే
మ్మెఱఁ జిత్తవృత్తిఁ మదా
మది, నాకుం గొడు కింకనుం గలఁడు, వాఁ
డాడంగ నెం దేఁగెనో,
చనువం బోయెనొ, పిల్వఁ బంచెద నవ
శ్యంబుం, బ్రతీక్షించు నీ
యదనం గూరలు చల్లనాఱవె మహా
త్మా! యోగిచూడామణీ?—

అనెను. సోమనాథునికృతిలో వృద్ధశివయోగి నరమాంస మడుగఁగా—

'సర్వజ్ఞ! మీ మనోజ్ఞం బైనయట్టి
సర్వలక్షణగుణసంపూర్ణుఁ డొక్క-
వరపుత్త్రుఁడున్నాఁడు నరమాంస మింకఁ
బొరుగింటికిని బిల్వఁ బోయెద నయ్య!
యరుదైనమీవ్రతోద్యాపన సేఁడు
గర మర్థిఁ జెల్లింతు క్షణము గొ'మ్మనిన

పిదప నారగించునపుడు—

'అతిథిపూజలు సేయు నవసరంబునను
సుతులును దారు నుత్సుక లీలతోడఁ
బొత్తునఁ గుడుతు రట్లుత్తమపురుష'—యని
—'కాన పుత్త్రుఁడు గలఁడేని పిల్పింపు
లేనినాఁ డొల్లము పాన లొండేల?'—

అనెను. చిఱుతొండఁడు—

చకితదేహుఁ డగుచుఁ జయ్యన మ్రొక్కి
'యకలంక! మీ రప్పు డన్నారు నేను

విన్నాఁడఁ బుత్త్రుఁడు మున్నాఁడు చదువు
చున్నాఁడొ యాడుచు నున్నాఁడొ పిదపఁ
బను పెంచి మఱి మీప్రసాదంబు వాఁడు
గొనియెడిఁ గాక భోజన మాచరించి
రక్షింపవే యోగిరములు శాకములు
నక్షయాత్మక ! చల్లనారక యుండ—

అనెను. శ్రీనాథుని రచనమున వృద్ధశైవయోగి శోల్లఁ జెప్పినదాని

'వాసిఁ దల్లియుఁ దండ్రియుఁ బడుగుసేసి
పాక మొనరించి పెట్టింప భవుస కొసగి
కుడుతు నాబంతి నిలుతేఁడుఁ గొడుకుఁ గుడువ"

అనుచో రెండువిధముల వాక్యాన్వయములలో నర్థభేదము లున్నవి. ఇంటియజమానుఁడు గూడఁ గొడుకును (అనఁగాఁ గొడుకుమాంసమును) నాబంతి నారగింపవలె నని యొక విధము. ఈ విధమున 'ఇలుతేఁడున్' అను నది సముచ్చయార్థకవిశిష్ట మయిన ప్రథమాంత పదము. కొడుకున్ అనునది ద్వితీయాంతపదము. కొడుకు మాంసము వాడి యారగింపఁ బెట్టుచో నా బంతి నా యింటియజమానుఁడు వానిని పుత్త్రుఁడును నారగింప వలయు నని రెండవవిధము. ఈ విధమున తేఁడున్, కొడుకున్ అనుపదములు రెండును సముచ్చయార్థకోపేతము లయిన ప్రథమాంతములు. శ్రీనాథుఁ డీ యర్థద్వైవిధ్యమును జతురముగాఁ బొసఁగించినాఁడు.

సోమనాథుని కృతిలో నీ చమత్కృతి గానరాదు. మఱియు హరవిలాసరచనమందుఁ గథార్థము కరుణా ద్భుతరసోల్బణముగాఁ గడు విపులముగా నున్నది ఏ తత్కథాఘటితము లైనప్రసిద్ధ ద్వితీయాశ్వాసముతో నొక స్వతంత్రప్రబంధ మనఁదగును.

మఱియుఁ బ్రథమాశ్వాసములోని దగు నొకపద్యమును బిల్లలమఱ్ఱి పినవీరన శృంగారశాకుంతలమున ననుకరించినాఁడు——

మ. ఘనసీమంతినిఁ బెన్ సురధాటి నిండుకొలువై
కూర్చున్నచో నీ కరా
భ్యసనప్రౌఢి నుతించుచా యువచిత
ప్స్రా చంద్రసారంగ నా
భిసముత్పాదిత తాళవృంతపవన
ప్రేంఖోలనప్రక్రియా
వసరోచిత సాహసాంకవరను
వ్యాలోలరోమాంచముల్.

——హరవిలాసము.

మ. వినరా జూడర రమ్మ పూవుసురటుల్
విశ్రాంతిమూలంబుగా
వసుపు ల్వ్యాపుఁ దదంతరాంతరనితాం
తామోదహేలాలతాం

తసమాక్రాంతకృతాంతరూపసవమా
నప్రేంఖనప్రక్రియా
వసరోదంచిత సారసౌరభరస
వ్యాలోలరోలంబముల్.

శృంగారశాకుంతలము. ఆ. 3.

మఱియు ద్వితీయాశ్వాసపద్యము నొకదాని జక్కన విక్రమార్క చరిత్రమున ననుకరించెను.

ఉ. మానికలాడఁజొచ్చె దివి
ధూళి భ్రమింపఁగఁ జొచ్చెఁ బిచ్చుకల్
మానక యుప్పు గబ్బులుఁగు
మాటికి మాటికిఁ గ్రోల్చెఁ గొమ్మపై
వాన యపశ్య మింక బహు
వాసరముల్ జడి పట్టునం చొగిన్
వానికి వాని కాడిరి య
వారణఁ బౌఁడలు గంచిలోపలన్.

—హరవిలాసము

ఉ. మానికలాడెఁ బోయనిధిఁ
బోరపు మ్రోఁత ఘనించె జంతులై
కానఁబడెన్ బలాకములు
కప్పులెలుంగు చెలంగె నిర్జల
స్థానములందుఁ గుంభములు
దన్ గృకలాసము నిల్చి నింగిపై
నానన మెత్తె భూమిరజ
మంగము సం బెరయించెఁ బిచ్చుకల్.

—విక్రమార్కచరిత్ర

జక్కన శ్రీనాథుని చారిత్రకాధారములఁబట్టి యించుమించుగా సమకాలమువాఁడుగాఁ దెలియుచున్నాఁడు. స్పష్టముగాఁ బూర్వుఁడితఁడు, పరుఁడితఁడు నని నిరూపింపఁదగ్గతగాధారములు లేవు. కాన శ్రీనాథజక్కనలలో నెవ్వ రెవ్వరి ననుకరించిరో నిరూపింప ననువుపడదు. అయినను నీక్రిందిపద్యము పరిశీలింపఁగా జక్కనగారే శ్రీనాథు ననుకరించె నని తోఁచును. శ్రీనాథుని భీమఖండమున___

మ. జగతీమోహనపుంసభూషణము వి
  శ్వఖ్యాతమున్ గాఁగ నా
నగరంబుం బెడఁబాసి పోను జగ
  న్మాన్యైక చారిత్ర యీ
చిగురుంబోఁడికి నాథుఁడుం గలఁడు సూ
  చీబ్రాటు వాసిష్ఠసీ
మగుణం బర్చినయుంతపై పనుపనన్
  మోమోట లేదో సుమీ.

ఈపద్యము సంస్కృతభీమఖండశ్లోకముల క్రిందివానికిఁ దెలిఁగింపు___

"జగతే ప్రశంసార్హచరిత్ర కంఠోత్సవ
షోడశవంశభూషాయాః కాశ్యా విరహకారణాత్
ఉపాస్యాః కోమలాంగ్యాశ్చ మమాప్యాస్తి రజాయత
ప్రణేతా యోజితపదే దేవస్య సుకృపానతమ్."

జక్కన విక్రమార్కచరిత్రలోని పద్యమునఁ గూడ శ్రీనాథుని యీ సంస్కృతానుసారి పద్యరచనానుకరణము గానవచ్చుచున్నది. మంచి పలుకుబడి పేరుపడ్డ శ్రీనాథుఁడు చేసిన "త్రినేత్రాగ్ని యోజితవంశో దేవస్య మన్మథస్య కిమ్" అనుదాని తెలుఁగుసేఁతను జక్కన యనుకరించె ననవలెను. శ్రీనాథుఁడే సంస్కృతభాషాఖండమును గూడ రచించియుండు నన్నట్లు నే నెన్నఁడో చెప్పినాఁడను. సిన్నకిందటి విక్రమార్కచరిత్రయే నేఁడు ఈ పద్యము నిలువఁజాలకపోవును. విక్రమార్కచరిత్రపద్య మిది:

చిగురాకు టమ్ముఁ గొనుచుఁ జేఁబట్టి పం
 చ్చి జక్కెఱం విలు పో
నగు సిరాసు టెఱుంగు పెరిఁగి నె
 య్యం జిచ్చు సమ్మై యను
చిగుఁరో వీఁకఁ జాఁటు సంగమము పో
 నాహారిభాగ్యం బను
ముగురన్ గాల్చినయింపు వైభవమునన్
 బ్రోల్కుంచు జేసె యమునన్.

మదనదహనము — గౌరీకల్యాణము

ప్రథమ ద్వితీయాశ్వాసముల (గౌరీకల్యాణకథ) రచనముకంటె నీ తృతీయచతుర్థాశ్వాసముల కవితారచన పరిష్కృతతరముగా నున్నది. తృతీయాశ్వాస కథ మదనదహనము, చతుర్థాశ్వాసకథ గౌరీ

కళ్యాణమును, కాళిదాసుని కుమారసంభవమహాకావ్యమున కించుమించుగాఁ దెలుఁగుఁజేఁత యనఁ దగినట్లు శ్రీనాథుఁడు రచించినాఁడు. కాని కాళిదాసు కుమారసంభవములోని కథాక్రమ మిందుఁ గొంత మార్పు నొందినది. శ్రీనాథుని గ్రంథము లెల్లఁ బ్రాయికముగా నాంధ్రీకరణములే యైనను, నా యాంధ్రీకరణము సంస్కృతపు హద్దుపద్దులలో నుండక శ్రీనాథుని యిచ్చకు వచ్చినట్లు విచ్చలవిడిగా నుండును. కొలఁది పట్టులందు మూలాతిశాయిసౌభాగ్య మున్నను రసోత్తరమైన కాళిదాసుని కుమారసంభవమును దెలిఁగించుటలోఁ గూడ జాగ్రత్త వహింపక విశృంఖలముగా వర్తించుట గొన్నిచోట్ల వైరస్యకారణమును నైనది. ఐనను కాళిదాసకృతి నెఱుంగక స్వతంత్రముగా శ్రీనాథరచనమునే చూచువారి కది శయ్యా సౌభాగ్య సౌశబ్ద్యాదిగుణవిశేషములచేఁ గొఱఁత తోఁపనీయనంత హృద్యతతోనే యున్నది. సంస్కృతమూలము ననుసరించి యందలి విషయమును గొంత విడిచియుఁ, గొంత గ్రహించి సంగ్రహించియుఁ, గొంత పెంచియు విశృంఖలముగాఁ జేసిన తెలుఁగుచేఁతలు కొన్ని—

అథ సలలితయోషిద్భ్రూలతాచారుశృంగం
రతివలయపదాంకే చాప మాసజ్య కంఠే
సహచరమధుహస్తన్యస్త చూతాంకురాస్త్రః
శతమఖ ముపతస్థే ప్రాంజలిః పుష్పధన్వా.

కుమార. స. 2, శ్లో. 64.

సీ. కాంతాజనంబుల కటివంక బొమలతోఁ
బ్రతివచ్చు పుష్పచాపంబుతోడఁ
గోకిలవ్రాతంబుఁ గ్రుక్కిళ్లు మ్రింగించు
క్రొమ్మావిచిగురాకుగొడుగుతోడ
రతిదేవి సిగబోగ గ్రాలుక్రొన్నెలవాలుఁ
దలఁపించుమీనకేతనముతోడ
భుజగలీలావతీ భుక్తశేషము లైన
గంధవాహకిశోరకములతోడఁ
జందురునితో వసంతమాసంబుతోడ
రాజకీరరథంబెక్కి ప్రాభవమున
వచ్చె వలరాజు చిత్రానువర్తనముగ
సంభ్రమముతో మహేంద్రునాస్థానమునకు.

హర. ఆ. 3. ప. 38.

రతివలయేత్యాది సంస్కృతశ్లోకభాగము మూలాఱినది. పద్యము బాగుగాఁ బెరిఁగినది. హృద్యత కొఱవడినది. సంస్కృతమునఁ దోఁచు కామవినీతత తెలుఁగునఁ గానరామి కొఱంతయే కదా.

దదౌ రసాత్పంకజరేణుగంధి
గజాయ గండూషజలం కరేణుః
అర్ధోపభుక్తేన బిసేన జాయాం
సంభావయామాస రథాంగ నామా.

కుమార. స. 3, శ్లో. 37

ఉ. పంకజరేణుగంధి యగు
పల్వలవారిఁ గరేణు విచ్చెని

శృంగ మహావశంబునను,
జాఁచి గజంబును బిమ్మనిమ్మృణా
లాంకుర మర్ధహస్తము ని
వాంగనసుం బ్రియ మార నిచ్చె నా
వంకఁ బయోధనుక్ హ్యాపయు
వప్పంతరఁ బ్రియ మంటి చూడఁగన్.

హర. ఆ, 3, ప. 61.

ఇందుశ్లోకమునఁ గల గండూషజలము పద్యమునఁ బల్లవాలవారి యగుట హృద్యముగాదు. శ్లోకోత్తరార్ధమున గల భాగము తెలుగుపద్యమున గజముగా మారినది. ఈ మార్పు నేర్పుగలదే.

సుగంధినిశ్వాసవివృద్ధతృష్ణం
బింబాధరాసన్న చరం ద్విరేఫమ్
ప్రతిక్షణం సంభ్రమలోలదృష్టి
ర్లీలారవిందేన నివారయంతీ.

కుమార. స. 3, శ్లో. 56

ఉ. ఇమ్మనియూప్ప గాడుపుం
గంపముఁ గ్రోలఁగ వచ్చి యోష్ఠముం
బమ్మసమీపదేశమునఁ
బాయక యాడెడు తేఁటిఁ గేళిఁ
ద్రిమ్మున మాటిమాటికి స
మంచితవిభ్రమలోలదృష్టియై
యమ్మదిరాక్షి చోఁపె దర
హాసవికస్వరగండపాళియై.

హర. ఆ. 3. ప. 71.

ఇందు "సుగంధినిశ్వాసవివృద్ధతృష్ణం" అనుటకు నెమ్మళియూర్పుఁదుప్పులగందముఁ ద్రోలఁగ వచ్చి' యనును తెలిఁగింపు సుందరము గాను.

కుసుమాస్తరణే సహాయతాం
బహుశః సౌమ్య గతస్త్వమావయోః
కురు సంప్రతి తావ దాశు మే
ప్రణిపాతాంజలియాచితశ్చితామ్.
తదను జ్వలనం మదర్పితం
త్వరయేర్దక్షిణవాతవీజనైః
విదితం ఖలు తే యథా స్మరః
క్షణమప్యుత్సహతే న మాం వినా.
ఇతి చాపి విధాయ దీయతాం
సలిలస్యాంజలిరేవ నస్త్వయా
అవిభజ్య పరత్ర తేన మయా
సహితః ప్రాస్యతి తే స బాంధవః.
పరలోకవిధౌ చ మాధవ
స్మరముద్దిశ్య విలోలపల్లవాః
నివపేః సహకారమంజరీః
ప్రియచూతప్రసవో హి తే సఖా.

కుమార. స. 4, శ్లో. 35-38

సీ. హస్తయుగ్మము మోడ్చి ప్రార్థించి పలికెదఁ
దమ్ముఁడా! నాకొక్క పనిఁ జితాగ్ని
యుంచుమంచుమ్మగా మలయానిలము గాప్పు
వెరవుగో మండింగ వసఁడుఁ గాఁడ
పరలోకవృత్తికై బంధు లిద్దమను
ధర్మోదకం బెందు దమ్మిచ్చెనె

సహకారమంజరీచరుపిండకబళంబు
పెట్టుండు మాకు నై పికము ముట్టఁ
దేనె వెట్టుండు కస్తూరిఁ దీర్చి యచటఁ
జేర గొజ్జంగ పూనీటఁ జెంబు లిడుఁడు
నన్ను వలరాజుఁ దలఁచి మన్నన దలిర్పఁ
దగ సమర్చన సేయుఁడు దంపతులకు.

హర. ఆ. 3. ప. 49.

ఈ తెలుఁగు సీసపద్యము మూలమును గొంత విడిచినను హెచ్చుగాఁ గొంత సంతరించుకొని ముచ్చట గొల్పుచున్నది. తస్మితేనె ధర్మోదక మిడుట, పికములు ముట్టునట్టు సహకారమంజరులు పిండముగఁ బెట్టుట, గొజ్జంగిపూనీటి యుదకుంభము లిడుట మూలాతిశాయి సౌందర్య సంపాదకములు.

భవ త్యనిష్టాదపి నామ దుస్సహాత్
మనస్వినీనాం ప్రతిపత్తి రీదృశీ
విచారమార్గప్రహితేన చేతసా
న దృశ్యతే తచ్చ కృశోదరి ! త్వయి.

కుమార. స. 5, శ్లో. 42.

సీ. ప్రథమ ప్రజానాథ.........
గీ. దుష్కరంబైన తప మిట్లు దొడరి సేసి
మేను డయ్యించుకొనఁగ నేమిటికి వచ్చెఁ
జిత్తము విచారమార్గంబుఁ జేరఁ దెచ్చి
తత్త్వముఁ దెలియఁజెప్పు చూతము మృగాక్షి !

హర. ఆ. 4. ప. 23.

శ్రీనాథు నాంధ్రపద్యము ననుసరించి నాశుకవి తలఁపో రచించియుండును. మఱియు,

కియ చ్చిరం శ్రామ్యసి గౌరి! విద్యతే
మమాపి పూర్వాశ్రమసంచితం తపః
తదర్ధభాగేన లభస్వ కాంక్షితం
వరం త మిచ్ఛామి చ సాధు వేదితుమ్.

కుమార. స. 5. శ్లో 50.

ఉ. ఏనును బ్రహ్మచారిఁ, బర
మేష్ఠి! నీవును గన్య. వింతకా
లానకు నీకుఁ బెండ్లియె ఫ
లం బగునే? విచార మేల? స
న్మానముతోడ నన్ను ముని
మాన్య వివాహము గమ్ము లెమ్ము. కా
దేనిఁ దపంబులోని సగ
మిచ్చెద మాను తపోభిమానమున్.

హర. ఆ. 4. ప. 25.

పై శ్లోకమునకు శ్రీనాథుని తెలుఁగుపద్యము సరియయినది కాదు.

'కన్యే కామయమానం మాం
న త్వం కామయసే కథమ్
ఇతి గ్రామ్యోఽయ మర్థాత్మా
వైరస్యా యైవ కల్పతే'

అను దండిసూక్తికి లక్ష్యమై యున్నది.

'ఎంతదాఁక శ్రమింతువు? బ్రహ్మచర్యాశ్రిత మగునాతపసున సగ పాలిత్తును. దాన నీకాంక్షిత వరలాభమును బడయుము. నీ వరాపేక్ష యేదో యదియు నేఁ దెలియఁ గోరుచున్నాను.' అని యర్థము గల శ్లోకమునకు సరిపడని తీరున నీకుఁ బెండ్లియే కావలసి నదిగాని మునిమాన్యుని నన్నుఁ బెండ్లాడుము. లేక, తపస్సే కావలసినదియేని నా తపస్సులోన సగ పాలిత్తును. కైకొని తపోభిమానము వీడుము' అన్న తెలిఁగింపు గోఁతగా నున్నది. ఇట్టి వటునిమాట విని పార్వతి యట నుండి లేచి పోవలసినదే! వటుఁడు శివుఁడే కనుక, పార్వతికిఁ దనపై నేకాంతానురాగముకల్మిని గుర్తింప నట్లు పలికె నని సరిపుచ్చుకొందమన్నను వటుం డిట్లన్న మీఁదటఁ బార్వతి రోఁత చెందినట్లు చెప్పకుండుట యసంగత మగును.

నన్నయ భట్టారక పద్యానుకరణోత్సాహమున శ్రీనాథుఁడు కాళిదాసశ్లోక రసభావౌచిత్యానుశీలనము మఱచినాఁడు.

శ్రీనాథుని ప్రస్తుతపద్య మీ క్రింది నన్నయ భట్టారకపద్యమున కనుకరణము—

ఉ. నీవును బ్రహ్మచారివి వి
నీతుఁడ వేనును గన్యకన్ మహీ
దేవకులావతంస! రవి
తేజ! వివాహము నీకు నాకు మున్

భావజశక్తి నైనయది
పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు సం
జీవనితోడ శుభ్రదయఁ
జేయుము నాకుఁ బ్రియంబు నావుడున్.

ఆది. ప. ఆశ్వా. 3.

శ్రీనాథుఁ డీ తృతీయ చతుర్థాశ్వాసముల రెంటిని రెండునాళ్లలో వడివడిగా రచించినట్లున్నాఁడు రసోత్తరములయిన మూలశ్లోకములఁ బెక్కింటిని దేలికపాటు పదరచనలోఁ బొందించినాఁడు.

ఈ కథను శ్రీనాథునికిఁ బూర్వము నన్నిచోడ మహాకవికూడఁ గుమారసంభవ ప్రబంధగత్నమునఁ గూర్చినాఁడు. అతఁడును గాళిదాసకుమారసంభవశ్లోకములఁ గొన్నింటిని నందుఁ దెలిఁచినాఁడు. కాని యది చాలఁగా స్వతంత్రరచనమే. శ్రీనాథుని రచనకుఁ గల శయ్యాసొంపు. ప్రసాదము దానఁ గానరాదు గాని దానికున్న దేసిరచన, జానుఁదెనుఁగు పొలుపు, భావగాంభీర్యము, అర్థపుష్టి శ్రీనాథుని రచనకులేదు. కాళిదాసకథాకల్పనానుసారి యగు శ్రీనాథకథాసంగ్రహము నన్నిచోడకథాకల్పనమునకంటెఁ జతురత గలదై యున్నది. అర్వాచీనాంధ్రకవి యగు కోటిరఘునాథ భూపాలుఁడు నొక కుమారసంభవ ప్రబంధమును రచించినాఁడు. అది కథాసౌందర్యము, కల్పనాచమత్కారము, నేఁటి తేట

తెలుఁగు కూర్పుసొంపు గలదై చాలఁ జక్కఁగా నున్నది.

దారువనవిహారము

సంస్కృతమున నుత్ప్రేక్షావల్లభుఁ డనుకవి యీ దారువనవిహారమును 'భిక్షాటనకావ్య' మను పేర సవిలాసముగ వర్ణించెను. అది శృంగారరసపూరితమగు నుచ్ఛృంఖలకావ్యము. ఆ కావ్యమునకును శ్రీనాథుని యీ రచనకును సంబంధము లేదు. పరమశివలీల యగు నీ కథాఘట్టమున నౌచిత్యచర్చ జరుపుట సంగతము గాదు. ఐనను శ్రీనాథుఁ డీ కథారచనలో నౌచితి నంతగాఁ గోల్పోకుండుట ముదావహము.

'ఎంచి నుతింప శక్యమె యహీశ్వరు సంతతివాని కైన' ఇత్యాదిక మగు హరవిలాస పంచమాశ్వాస పద్యము పిల్లలమఱ్ఱి పినవీరన శృంగార శాకుంతలమునఁ గూడఁ గానవచ్చుచున్నది. నిజముగా దాని రచయిత యెవ్వరో యీ యిద్దఱిలో?

సముద్రమథనము. హాలాహలభక్షణము

శ్రీనాథుఁ డీ కథను భీమఖండరచనానంతరమే రచించినట్లు గుర్తింపనగును. సముద్రమథనారంభమున దేవాసురులు విఘ్నేశ్వరపూజ సేయుట సంస్కృతభీమఖండమునఁ గలదు; తెలుఁగుభీమఖండమునను గలదు. ఈ సందర్భము భాగవతాదిపురాణములలోనిది గాదు. హరవిలాసమునఁ గూడ నీ విఘ్నేశ్వరపూజాప్రకరణ

మున్నది దీని యునికి భీమఖండ కథాసందర్భానుకరణమే యనుకొందును. మఱియు సంస్కృత భీమఖండశ్లోకపుఁ దెనుఁగుసేఁత కందపద్యము భీమఖండమునం దున్నది. ఆ పద్యమే యీ హరవిలాసమునను నున్నది. ఇందు హాలాహలభక్షణము, సముద్రమథనము నను గల కథాగతితో నున్నవి.

### కిరాతార్జునీయము

భారవి రచించిన కిరాతార్జునీయకావ్యపుఁగథయే యిది. కాని నా చూచినంతలో నా కావ్యమునకు దీనికి సంబంధము కానరాలేదు. భారతారణ్యపర్వమునఁ గల కథాసంక్షేపమున కిది విస్తృతి. శ్రీనాథుని కవితాశయ్య యీ యాశ్వాసమున మిక్కిలి సిగనిగలు దేరి యున్నది. ఈ యాశ్వాస మొక్క స్వతంత్రసత్కృతి యనఁదగినది. ఇంద్రుఁగూర్చి యర్జునుఁ తపశ్చర్య, వృద్ధబ్రాహ్మణవేషమునఁ జేరవచ్చి యింద్రుఁ డర్జునునితో సంభాషించుట, శివునిఁగూర్చి తపస్సుచేయు మని బోధించుట, శివునిఁ గూర్చి యర్జునునితపస్సు, శివకిరాతవేషము, వరాహహననము, అర్జునకిరాతవివాదము, పరస్పరయుద్ధము, ఈశ్వరసాక్షాత్కారము, పాశుపతవరప్రదానము, అర్జునస్వర్గయాత్ర, ఊర్వశీదర్శనము, అర్జునోర్వశీభాషణము, అర్జున నిర్మలశీలసౌభాగ్యము, ఊర్వశి యవమానపాటు, శాపప్రదానము, అరుణోదయాదివర్ణనము, నివాతకవచాదులవిజయము, ఇంద్రసత్కారము

నను విషయవిభాగములు గలదై యీ యాశ్వాస
మీ గ్రంథములోని యన్ని యాశ్వాసములకంటె
గొప్పదై యొప్పు మీఱి యున్నది. ఇందు అర్జునోర్వశీ
సంవాద మౌచితీరుచిరమై మనోహరముగా నున్నది.
శ్రీనాథుని గ్రంథములనుండి కండపట్టఁదగిన కథలును
తెలిఁగింపు గానిదానిఁ బేరుకొనఁ గోరుకొందు మేని
యీ కిరాతార్జునీయమే యందుకుఁ దగినది.

హరవిలాసము శ్రీనాథుని తక్కిన గ్రంథములన్నిటి
కంటె మృదుమధురరచనము గలది. బహుప్రౌఢ
సంస్కృతపదఘటనలు, అన్వయక్లేశములు కారక
ప్రయోగ వైచిత్ర్యములు—భాషాంతరీకరణము లగుటచే
శ్రీనాథుని యితరగ్రంథములలో నధికములైయున్నవి.
ఇం దంత గానరావు. శ్రీనాథుని రచనలలోఁ దుపాఁ
తుల సక్రమముగాఁ నెఱుఁగఁ గోరువారు హరవిలాసోప
క్రమముగాఁ దద్గ్రంథములను జదువఁ దగుదురు.
నన్నయ తిక్కన నాచనసోమనల తెలుఁగురచనల
పోలికలు, మురారి నాటకశ్లోకానుకృతులును నీ హర
విలాసమునఁ గొన్ని కానవగును. విస్తరభీతిచే వాని
నిందుఁ జూపకుంటిని. అపూర్వశబ్దములు, ప్రయోగ
విశేషములు, లక్షణవిశేషములు నిందుఁ గొన్ని గాన
వచ్చుచున్నవి. సవిశేషము లని పరికింపఁదగినపద్యాంశ
ములఁ గొన్నిటి మాత్ర మిందుఁ జూపుచున్నాను.
పెడము వెట్టి, చింకల్, వాడెపట్టులు విఱిచి, బారాది

దివ్వించి, భోరించి కుర్యుముఁడు, అంపాజాలంబు గుర్రిసి, అనంచిన్యే కంచి నీకు, ఎంబ్రాసఁగుటమ్ములు, మిస్కక మిరెండుకుమూరకుఁడు, చిలుబంతిపసప్రంతోఁ జెవపు నలఁది, సీకాయయుప్పున జిడ్డుఁ బాపి, కెఱ వాఁడిగా నూటికి గంటికి దీసె, గోజఁగనీటఁ జేపట్టు గావించి, చిత్త స్పృత్తికి మెఱుంకు, ఒత్తిజిత్తక చీఁకే, వానె నైశ్యులఁ బిల్ల యర్వ్యలను గూడి——ఇట దైశేయుఁడు...కత్తెను శోఁడఁ బుండరీకంబుశోలు, మస్రణాస్థిగతరత్నచర్మ ముయు, నైయూభ్రూజినఖండమధ్యమున, ఏటలవి నేసి...గాబులుకునఁ గొఱంతిడి, అబసరపుం దెఱంగున-ఇత్యాదులు.

కూచిమంచి తిమ్మకవి లక్షణసారసంగ్రహమున హరవిలాసపద్యములఁ బెక్కింటి నుదాహరించినాఁడు. ఆయూపట్టులఁ దప్పవ్యపాఠముల గుర్తించితిని. మిన్న కమిరెండు, అబసరపుంగెఱఁగున ఇత్యాదిపాఠములు వ్రాతఁబ్రతులలో నున్నట్లు తిమ్మకవి యుదాహరణము నను గలవు. ఇట్టిపట్టులఁ బూర్వపూర్వతర ముద్రణ పాఠములు గొన్ని సరియైనవిగావు. శక్య మయినంత వఱకు కవి చక్కఁబఱుపఁబడినవి. పూర్వ పూర్వతర ముద్రణములందు 'కమ్మనూనె' మొనంటి నలుగుతో జలకమార్చి యొసంగిరి ధౌతవస్త్రముల్'-(ద్వితీయాశ్వాసము) అని కలదు 'ఒసగు' సానుస్వార మనుట కాదికప్రయోగములు మృగ్యములు. శాసనములలో

ఎసఁగు, ఒసఁగులు నిరనుస్వారములుగా నున్నవి అవి తిక్కనభారతమున నిరనుస్వారములుగాఁ బ్రాసస్థలముల నున్నవి. శ్రీనాథుని గ్రంథములలోనే గుర్తించి సంతసింపఁదగినది యొక్కటే 'యొసంగిరి' అని పూర్ణానుస్వారవిశిష్టముగాఁ గానవచ్చును దీనిఁగూర్చి భారతి సంపు 12, సంచిక 12, పు 881—4 చూడఁదగును. హరివిలాసపు వ్రాఁతప్రతులఁ బరిశీలింతుముగదా-అందు 'జలక మార్చిరి యిచ్చిరి ధౌతవస్త్రముల్' అన్నపాఠ మున్నది 'ఒసంగిరి' అన్న పూర్వ పూర్వతర ముద్రణ పాఠము గానరాదు. ఆముక్త మనుచరిత్రాద్యర్వాచీన గ్రంథములందు 'ఒసంగు' సానుస్వారముగా నున్నది.

అధ్వాన్నపుం బట్టునన్ (74 పుట)—'అధ్వాన్నము శత్రుమధ్యము' అని నానుడి కలదు. దాని ననుసరించి పై యట్లు ముద్రిత మయ్యెను. 'అధ్వానము' అనియే వ్రాఁతప్రతి. 'అధ్వ' శబ్దము తత్సమ రూపము 'అధ్వానము' కాఁబోలును. శ్వ, శ్వాన శబ్దములు సంస్కృతముననే యున్నవి అట్లే అధ్వ, అధ్వానశబ్దములు నున్నవేమో! శబ్దరత్నాకరకారులు అధ్వానము=అమార్గము అని యర్థముతో అకారాంత సంస్కృతపదముగా గ్రహించిరి. కర్ణాటమునఁ బంపకవి విక్రమార్జున విజయములో 'అధ్వానపదపరిశ్రమశ్రాంతి' యని ప్రయోగ మున్నది. తన్ముద్రాపకు

లాయధ్వానపదంబును మార్గార్థకముగా గ్రహించిరి. మార్గమని, అపార్గ మనియేని యర్థము గలసంస్కృత శబ్దమని, అధ్వశబ్దపుఁ దత్సమరూప మనియేని గ్రహించినను, శ్రీనాథుని 'మధ్వానపుంబట్టు' సమర్థిత మగును. ప్రాంతప్రతి పాఠము పరిగ్రాహ్యమే కావచ్చును. కాని తెలుఁగున నిఁక నెక్కడను నీ 'యధ్వానము' నాకుఁ గానరాలేదు. వాచస్పత్యమున 'అధ్వాంతశాత్రవః=మార్గసీమారిపుః' అని యున్నది దానిఁబట్టి 'అధ్వాంత' మని యుండిన బాగనిపించును.

శా. మౌళిం గోహళి సంఘటించినక్రియన్
మధ్యాహ్న వేళన్....
ప్రాలేయాహితసంప్రదీప్తకిరణ
ప్రక్రీడ దర్కోపల
జ్వాలాజాలజటాలజాంగలతటీ
వాచాలకోయష్టిపై

హర. ఆ. 7. ప 109.

పయిపద్యమున 'కోహళి' కర్థ మెఱుఁగరాదు. 'ఆలవట్టము' కాని, 'ఉల్లడ' కాని కాఁదగు నను కొందును. నాచనసోమన కూడ నీ పదమును బ్రయోగించెను. 'పార్వతీపతికిఁ బ్రభాతభూపతి గొన్నయలరుఁ గెందమ్మి కోహళి యనంగ—భానుబింబంబు కన్నుల పండు వయ్యె'—ఉ. హరి. ఆశ్వా. 3. ఇక్కడఁ గూడఁ బై యర్థములే సంగతము లగును. సంస్కృతాంధ్రము

లలో నాకీ పద మింక నెక్కడను గానరాలేదు—
పయిపద్యోత్తరార్ధము క్రీడాభిరామమునను గలదు.
మురారి నాటకశ్లోకభాగము దీనికి మూలము.

౨ యతియు——'విభూతిమంగళ, స్నానముఁ జేసి ధౌతపరిధానము గట్టి' (ఆ. 2. ప. 37.) ఇక్కడ యతినిగూర్చి పూర్వము 'భారతి'లోఁ గొంత చర్చ జరిగెను.

స్నానపదము 'స్త్నానము' అని యుండవలె ననియు, నది వేదోచ్చారప్రకార మనియు, శ్రీనాథుఁడు వేదజ్ఞుఁడు గాన యట్లు ప్రయోగించెననియు నొకానొకరి వాదము. వేదోచ్చారము వేదమునకే కాని భాషకుఁ గాదు. ప్రశ్నమునకు ప్రశ్ఛ్నము, సంవత్సరమునకు 'సంవత్థ్సరము' అని యిత్యాదివిధముల వేదోచ్చార మున్నది. సంస్కృతభాషలో నట్టియుచ్చారము గాని లిపి గాని కానరాదు. సంస్కృతగ్రంథములందుఁ గాని, శాసనములందుఁ గాని కానరాకున్నను నీ యతిని రక్షించుటకై యిక్కడి 'స్నానము' ను 'స్త్నానము'నుగాఁ జేయ నక్కఱలేదు. తెలుఁగునఁ దద్భవవ్యాజయతి యని యొక యతి భేదము గలదు. దానిఁబట్టియే ప్రాచీన కవీశ్వరులు 'జ్ఞ' కు 'న' తోను 'కవర్గము'తోను యతిఁ గూర్చిరి. విజ్ఞానము—విన్నాణము, సంజ్ఞ—సన్న, ప్రజ్ఞ—పగ్గె, సంజ్ఞ—సైఁగ అగుటనుబట్టి 'జ్ఞ' కు న, కవర్గములతో యతి చెల్లినది. అంతేకాని విజ్ఞానాదిపదములలో

'జ్ఞకారము' న 'నకారము' గాని కవర్గాక్షర మేది గాని కలదన రాదు. అట్లే స్నానపదము గూడఁ దద్భవ మయినపుడు తాన మగును. సంజ్ఞాది శబ్దములువోలె సంస్కృతసమాసగతముగా నున్నను స్నానశబ్దము దద్భవవ్యాజమునఁ దవర్గముతో యతిమైత్రిం జెందెను.

మఱియు నీ హరవిలాసమున 'ప్రారంభం బొకయింత లేకను తృణప్రాయంబు నల్లు' అనుచో 'లేకను' అని ప్రయోగమున్నది. ఇది నన్నయ భట్టారకుని 'లేకను సంతానోచ్ఛేద' ప్రయోగముం బోలినది. అక్కడఁ జెప్పఁ దగ్గసమర్థనో పత్తులే యిక్కడను జెప్పఁదగినవి.

ఈ హరవిలాసము పీఠికాభాగము కొఱంతగా గ్రంథ మెల్ల నొక్క తాటియాకుప్రతి తంజావూరు లైబ్రరీలోఁ గలదు. పీఠికాభాగ ముండి సప్తమాశ్వాసము లేక ప్రాచ్యలిఖిత శాలలో వేఱొకప్రతి గలదు. ఈ రెండు ప్రతుల తోడ్పాటునసే పూర్వము కాకినాడ సరస్వతీ పత్రికాధిపతు లీ హరవిలాసమును ముద్రించిరి. నాఁటికి నేఁటికి నీ రెండువ్రాఁతప్రతులే కాని క్రొత్త దేదియుఁ గానరాలేదు.

# ౧

# మనుచరిత్రము

ఉ. తల్లి సమస్తభాషలకు దైవతభాషయు, దేశభాష లన్
పిల్లలలోన నాంధ్రి యను పేరిటి చెంతయు ముద్దులాఁడి రా
ట్తల్లజు లాదరించినకతంబునఁ బల్కులఁ గుల్కు మీఱి యు
ల్లల్లనఁ దక్కు నక్కు నెలియంత్రన నెక్కుఁకీర్తి చేకొనెన్.

క. జిలిబిలిపలుకుల బలుము
ద్దులు గులికెడు తెలుఁగుదానతో సరియగునే
తెలిసియుఁ దెలియక వీనుల
నలయించెదు వెట్టిమొట్టి యఱవముబదానల్.

సంస్కృతమని పేరొందఁబడిన యార్యభాషయే తొలుదొలుత భరతఖండమునఁ బెంపొందిన వాఙ్మయము. చాలవఱకు దానివలననే తర్వాతఁ బ్రాకృతములును దేశభాషలును బెంపొందినవి. దక్షిణహిందూదేశమునఁ గల దేశభాషలలో నాంధ్ర ద్రవిడ కర్ణాట భాషలు ప్రధానమైనవి. ఇందు ద్రవిడ కర్ణాటభాషలాంధ్రమునకంటెఁ బ్రాచీనములని యూహింపఁ బడుచున్నవి. ఆ రెండుభాషలలోను గ్రంథములు రచింపఁ బడుచు వచ్చినకొంతకాలమునకుఁగాని యాంధ్రభాషలో గ్రంథరచన ముపక్రమింపఁబడినట్లు చూపట్టదు. గ్రంథరచన ముపక్రమింపఁబడుటకుఁ బూర్వ మాంధ్రభాష

స్థితి యెట్టిదో యించుకయుం దెలియరాదు. ఇటీవల నాంధ్రకవితకుం బుట్టిల్లనం జెల్లిన వేంగీదేశమునం దానాఁడు జన్మించిన నాగవర్మ కర్ణాటభాషకు ఛందోంబుధి యను ఛందశ్శాస్త్ర గ్రంథమును రచించె; కాని యాంధ్రభాష యుబుసైన నెత్తఁదయ్యె. నాఁటి కీభాషకుఁ దిన్ననిరూ పేర్పడలేదు కావలయు. ఆకాలమున మనదేశమును జాళుక్యులు పాలించుచుండిరి. ఆర్యధర్మము నిర్వక్రముగా సాగింపఁబడుచుండెను. జనులకుఁ బురాణాదిజిజ్ఞాసయు నాదరము మెండుకొని యుండెను. వారు సంస్కృతభాషాగ్రథితములైన తత్తద్గ్రంథములను 'గాసటబీసటే' చదివి కథలు చెప్పుచుండిరి. రాను రాను దేశభాషకును గొంత రూ పేర్పడుచుండెఁబోలు. అక్కాలమున నట్టి దేశభాషాకవన మావశ్యకమయ్యెను. అయినను దానికిఁ దగిన సామాగ్రిని గూర్చి కవితను వెలయించువా రవతరింపవలసియుండిరి. ఇట్లు సనఁ జన,

క. మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్రవిషయమునఁ
జన సత్యాశ్రయునిఁ దొట్టి చాళుక్యనృపుల్.

నన్నెచోడని కుమార సంభవము.

దాదాపు నేఁటికి వేయి సం॥లకుఁ బూర్వము చాళుక్యాన్వయభూషణమును సత్యాశ్రయాది బిరుదాంచితుఁడును రాజమహేంద్రము రాజధానిగా వేంగీ

దేశమును బాలించినవాఁడును నగు రాజరాజనరేంద్రుని యాస్థానమునఁ గల సర్వజ్ఞుఁ డగునన్నయభట్టారకుఁ డను పండితకవియే మన యాంధ్రభాషఁ దొలుతఁ గవిత నవతరింపఁజేసినవాఁ డని తెలియఁబడుచున్నాఁడు. రాజరాజనరేంద్రుని ప్రేరణమున నీతఁడు పంచమవేద మగు భారతమును దెలుఁగున రచింప దొరఁకొని యరణ్యపర్వములోని కొంతభాగమువఱకును నెఱవేర్చెను. ఈతని కవనమున సంస్కృత మర్యాదలు మెండుకొని యుండును. సుడికారము గల తెలుఁగుఁ బలుకుబడులఁ గూర్చుటయం దీతఁడు తక్కువవాఁడు కాఁడు.

చ. బహువనపాదపాబ్ధికులపర్వతపూర్ణసరస్సరస్వతీ
సహితమహామహీభర మజస్రసహస్రఫణాళిఁ దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్య యైనయ
య్యహిపతిదుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడున్.

గీ. పల్లవారు నెఱుఁగ నొల్ల నిధర్మపు
బేల! నీకుఁ జెప్ప! నేల వలనెఁ
జిఱుతవాని కింత తఱుసంటి పలుకులు
నన్నె వృద్ధజనము లున్నచోట.

పదపడి కవిబ్రహ్మ నాఁబరఁగుతిక్కన విరాటపర్వము మొదలు ౧౫ పర్వములభారతమును దెలుఁగు గావించెను. తెలుఁగుఁ బలుకుబళ్లను సుబాళింపఁజేయుటయం దీతని కీడు మఱి లేఁడు. ఈతని కవనమున రసపోషకములు గాని పదములు సాధారణముగాఁ జూపట్టవు.

ఉ. చిచ్చులకన్ను మూసికొని చేత్రిశూలము డాఁచి లీలమై
వచ్చిన రుద్రుదంభమున వ్రాలుదు వీవనిలోన నోర్వఁగా
వచ్చునె నిన్ను నెట్టిసుగవారికి నీకృప నాశ్రయింపఁగా
వచ్చిరి మెవ్విధిం గెలువ వచ్చు మహాత్మ! యెఱుంగ జెప్పవే.

తర్వాత నీ యిర్వురకుఁ దుల్యుఁ డనఁదగువాఁ డెఱ్ఱాప్రెగ్గడ. ఈతని కృతులం దరణ్యపర్వశేషపూరణ మొకటి.

చ. స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై పవిత్రకమలవైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనము ల్సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్.

ఈ ముప్పురను కవిత్రయ మందురు. వీరివాక్కు లాంధ్రభాషకుఁ బరమప్రమాణములు. ఇట్లాంధ్రభారతము ముగియునప్పటికి దాదాపు 300 సం॥ పట్టెను. ఈ సమయమున గొందఱు మేటికవులితర పురాణాదులను దెలిఁగించుచు వచ్చిరి. ఇట్లు రానురాను గ్రొత్తత్రోవలు త్రొక్క కవనమునకు మార్పులు గలిగించినవాఁడు కవిసార్వభౌముఁడు నాఁబడు శ్రీనాథుఁడు. ఈతఁడు తొంటివారివలెఁ జాలమట్టునకు సంస్కృతగ్రంథములనే తెలిఁగించినవాఁ డయ్యును గూర్పునందు మార్పు కలిగించి తర్వాతి ప్రబంధరచనకు మార్గ

దర్శకుఁ డయ్యెను. *సీసపద్యముల యొయ్యారపు నడకలు మొదలగునవి యీతఁడు నెలకొల్పినవే. శ్రీనాథునితర్వాత నాతని చరణముల నంటుకొనక కవిత చెప్ప నేర్చినవారు లేరు. శ్రీనాథుని కాలమునకు ముందే యవనులయులజడి కలుగుచు వచ్చుటచే వారియాచారవ్యవహారములును కొన్ని మన దేశమున నెలకొనఁ జొచ్చెను. కావున నా కాలమునుండియుఁ గవులు తమ కవనములఁ గొన్ని యన్యదేశ్యపదములు రుచివిశేషమునుంబట్టి యందందుఁ బొందుపఱచుచు వచ్చిరి. మచ్చునకొకటి యుదాహరింపఁబడుచున్నది.

ఖుసి మీఱఁ సురధాణి నింటుకొలువై కూర్చున్నచోఁ.
శ్రీనాథుని హరవిలాసము.

కొందఱు

సీ. పచ్చని హంసమంచి పనివాగె పక్కెర
పారసి పల్లంబు పట్టమయము
రాణ నొప్పారు పైతాణంబు సింగిణి
తఱుచలకోరుల తరకసంబు

* శ్లోకపద్యములు సమానార్థకము లయ్యు నవి యాంధ్రభాషలో సంస్కృతభాషాగ్రథితమునకును నాంధ్రభాషాగ్రథితమునకును వ్యవహరింపఁబడుచుండునట్లే ప్రబంధపదము భారతాది సర్వగ్రంథవాచక మయ్యు నిటీవల మిశ్రోత్పాద్యాన్యతర మగునితివృత్తముతోఁ జతుర్దశవర్ణనలఁ గూర్చి రచింపఁబడు కావ్యమునకుఁ బేరుగా వాడఁబడుచున్నది.

మిహిరపసిండి పసుంజు మొహదా కెలంకుల
తావు గుబ్బరిసేత కేవశంబు
నాకెలంకున నిరాజీక రా మరకత్తి
కుఱుగటఁ గ్రొవ్వాకి గొరకలపొది
పీలికుంచెతలాటంబు బేరజంబు
మణుల మొగముట్టు వన్ని పాహిణి యొకంపు
కర్త యెదుటికిఁ గొనివచ్చె గంధవాహ
బాంధవం బగునొక మహాసైంధవంబు.

ఆ. 4, ప. 28.

ఈ మొదలగు పద్యములలోఁ బెద్దనయే తొలుదొలుతఁ జూపింప మొదలిడె ననిరి.

పదపడి శ్రీనాథుఁడు చూపినత్రోవఁ గొని సంస్కృతగ్రంథములఁ దెనిగించుటయ కాక పురాణకథలఁ గైకొని స్వకపోల కల్పనలఁ గూర్చి చతుర్దశవర్ణనలతో మిశ్రప్రబంధములను దర్వాతికవులు రచింప నారంభించిరి. ఆకాలమున నుత్పాద్య మను నితివృత్తముతో గృతి సెప్పుట తప్పుగాఁ దలఁపఁబడుటచేఁ గావలయు నాంధ్రమున నేకవియు దానికి దొరకొనినవాఁడు కాఁడు. అట్లు శ్రీనాథునకుఁ దర్వాత మిశ్రప్రబంధములు రచించినవారిలోఁ దొల్లిటివాఁ డనఁదగు పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి యీవిషయము నిట్లు వాక్రుచ్చెను.

శా. ప్రఖ్యాతం బను మిశ్రబంధ
మన నుత్పాద్యం బనంగా ద్రిధా

వ్యాఖ్యాతం బగు వస్తు,
వందు మఱి యధ్యాహారముం జేయఁగాఁ
బ్రఖ్యాతం బతివృత్త మైనఁ
గృతి సెప్పన్ వక్తయున్ శ్రోతయున్
విఖ్యాతిం గలిగించుఁ బుణ్య
మహిమన్ విశ్వంభరామండలిన్.

ఈతఁడు భారతమందలి శకుంతలోపాఖ్యాన కథను గైకొని దానికిఁ గాళిదాసుని యభిజ్ఞానశాకుంతలనాటకమును దోడుచేసికొని శృంగార శాకుంతలమును ప్రబంధమును రచించెను. శృంగార శాకుంతలము రచియింపఁబడిన తర్వాత సర్వోత్కృష్టముగా వెల్వడిన మహాప్రబంధము మన యీ

## మనుచరిత్రము.

దీనికిఁ బ్రధానముగా గ్రంథకర్త పేరొన్న పేరు స్వారోచిషమనుసంభవము. అయ్యును మనుచరిత్ర మను నామము కవిచే 'మనుచరిత్రము బంగారుకొనువేళ' నని యొకచోఁ బేరొన్నఁబడియున్నది మఱియు లోకమున రూఢమై యున్నది. ఇది చతుర్దశవర్ణనలు గలిగిన యాఱాశ్వాసముల ప్రబంధరత్నము. దీనికి

## కృతిభర్త కృష్ణదేవరాయలు.

ఈతఁడు బళ్లారిమండలములోని యానెగొందికి సమీపమున నుండిన విద్యానగర మనుపట్టణరాజము రాజధానిగా దక్షిణహిందూదేశమున కెల్ల నేకచ్ఛ

తాధిపత్యము నిర్వహించిన శూరాగ్రేసరుఁ డగు నృపసార్వభౌముఁడు. ఈ నృపాలరత్నము జనించినకాలము సరిగాఁ దెలిసినదికాదు, గాని ౧౫౦౯ సం॥ పట్టాభిషిక్తుఁ డయినట్లు కనుఁగొనఁబడినది. కృష్ణరాయలు బహువారములు దండయాత్రలు వెడలి నానారాజుల జయించి రాష్ట్రముల నాక్రమించుకొని తురుష్కుల నుమ్మర కృత్యముల నడఁగించి మహారాజ్యవైభవము ననుభవించుటయె కాక సరసకవితావిలాసలాలసుఁడై పెద్దనాదికవిముఖ్యుల పంక్తుఁ దేల్చుచుఁ జూటలఁ గొని సంస్కృతాంధ్రములందు మేలయిన కవనము చెప్ప నేర్చిన సుకవిరాజశేఖరమణి. ఈతఁడు తెలుఁగున విష్ణుచిత్తీయమును ప్రౌఢప్రబంధమును రచించెను. సంస్కృతమున మదాలసచరిత్ర, సత్యాప్రీణనము, సకలకథాసారసంగ్రహము, జ్ఞానచింతామణి మొదలగుగ్రంథములను రచించిన ట్లాముక్తమాల్యదలోఁ జెప్పికొనెను గాని యవి నామావశిష్టము లయినవి.

* కృష్ణరాయఁడు మనుచరిత్రమునకే కాక ముక్కుతిమ్మన రచించినపారిజాతాపహరణమునకును, కర్ణాటభాషలోఁ దిమ్మనార్యుఁ డనుకవి రచించినభారతమునకుఁ గూడఁ గృతిపతియయ్యెను. ఈతఁడు దండయాత్ర

* అస్మన్మిత్రు లొకరు జాంబవతీపరిణయ మను పేర నాటక మొకటి కృష్ణరాయవిరచితము నూత్నముగాఁ దమకుఁ జిక్కినదని చెప్పుచున్నారు.

లను నెదిరించునపుడు వెంటఁ గవీంద్రుల సయితము గొంపో యెడువాఁడు.

♦ ఈతనికిఁ జదరంగపుటాటయందు మిక్కిలి కుతూహలము మెండనట్లు క్రింద నుదాహరింపఁబడిన ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమందలి ప్రాచీన విలేఖనముల వలనఁ దెలియుచున్నది. ఆంధ్రభాషను మహోచ్ఛదశ నందించిన యీ ప్రభుసార్వభౌముఁడు ౧౫౩౦ సం॥ కీర్తిశేషుఁ డయ్యెను. ఆంధ్రభోజుఁ డని ప్రసిద్ధి గన్న యీ కృష్ణ రాయల యాస్థానమున నష్టదిగ్గజములు నాఁబడు కవీశ్వ

---

• ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమందలి చారిత్రక సంపుటములలో "నృసింహదేవరాయల కుమారుండు శ్రీకృష్ణదేవమహారాయలు విజయనగరమందు వజ్రసింహాసనారూఢుఁడై పృథివీ రాజ్యం చేయుచుండగాను పై వ్రాసిన ( కొప్పోలు ) గ్రామ కరిణాలు దొడ్డుచర్ల పెద్దతిమ్మన్న చినతిమ్మన్న అనే యిద్దరు అన్నతమ్ములు. వీరిలో పెద్దతిమ్మన్న అనే ఆయన గ్రామంలో కరిణీకం అనుభవిస్తూ వుండెను. చిన్నతిమ్మన్న అనే ఆయన కవీశ్వరవృత్తి అవలంబించుకొని కృష్ణరాయలవారివద్ద పోయి రాయలతో చదరంగం ఆడుతూ వుండేవాఁడున్నూ ఆట గెలిస్తే వెయ్యార్లువరహ పందెంచేసి గెలుస్తూ ఉండేవాఁడున్ను. అప్పుడు శ్రీకృష్ణదేవమహారాయలు చాలా సంతోషించి కొప్పోలుగ్రామం సర్వాగ్రహారంగా ధారవోసి యిచ్చి కొప్పోలుకు ప్రతినామం కృష్ణరాయపురం అని నామం యేర్పరిచిరి. ఈ చిన్నతిమ్మన అనేకరణం కవీశ్వరుఁడు చెప్పిన పద్యం."

రులలో నెల్ల వయసునందును గవితానైపుణిచేతను పెద్దవాఁడు మన యీ మనుచరిత్రమునకు

## కృతికర్త పెద్దనామాత్యుఁడు.

ఈతఁడు నందవరీక బ్రాహ్మణుఁడు. ఇంటిపే రల్లసానివారు. తండ్రిపేరు చొక్కన. బళ్లారిప్రాంతమందలి దోపాడు పరగణాలోని దోరాలగ్రామ మీతని వాసస్థలము. కృష్ణరాయలు మనుచరిత్రమును గృతి నందుకొనునప్పు డూరేగించుటకై పెద్దనార్యునిఁ బల్లకి నెక్కించి తన చేతితో నద్దాని లేవనెత్తి యాతనియెడఁ గలయాదరాతిశయమును వెల్లడించెనఁట. కృష్ణరాయల యాస్థానమునఁ గల యాకవిపండితమండలిలో నాతనికే గౌరవ మెక్కువ. ఒకప్పుడు కృష్ణరాయలు పసిఁడిపళ్లెరమునఁ గవిగండపెండేరమును గొనివచ్చి సభాస్థానమున నిడి సంస్కృతాంధ్రములందు సమముగాఁ గవనము

---

క. శతసంఖ్య లొక్కమైనను
సతతము శ్రీకృష్ణరాయజగతీపతితోఁ
జతురంగ మాడి గెల్చెను
ధృతిమంతుఁడు బొడ్డుచెర్ల తిమ్మన బళిరే.

ఉ. ధీరుఁడు బొడ్డుచర్ల చినతిమ్మనమంత్రికుమారుఁ డంచితా
కారుఁడు సత్కళావిదుఁడు కౌశిక గోత్రుఁడు పద్మ నేత్ర సే
వారతబుద్ధి నందవరవంశ్యుఁడు సత్కవిలోకనాథుఁ డా
చారసమగ్రవర్తనుఁడు చారువచస్స్థితి నొప్పువాఁ డొగిన్.

చెప్పనేర్చునవా రిద్దానిఁ గైకొన నర్హులనఁగా సభ్యులు మిన్నకుండి రనియు దానిపైఁ గృష్ణరాయలు

ఉ. ముద్దుగ గండపెండియరమున్ గొనుఁడంచు బహూకరింపఁగా
నొద్దిక నాకొసంగు మని యొక్కఁడుఁ గోరఁగ లేఁడు పేర్మితో

అని సగముపద్యముఁ జదివె ననియుఁ బెద్దనామాత్యుఁ డంతట లేచి

పెద్దనఁ బోలుపండితులు పృథ్విని లే రని నీ వెఱుంగవే
పెద్దన కీఁ దలంచితివి పేరిమి నా కిడు కృష్ణరాణ్ణృపా!

అని పూరించి

ఉ. పూఁత మెఱుంగులుం బసరుపూప బెడంగులుఁ జూపునట్టి వా
కైతలు జగ్గునిగ్గు నెన గావలెఁ గమ్మనఁ గమ్మనన్వలెన్
రాతిరియుం బవల్ మఱపు రానిహొయల్ చెలియారజంపుఁ
దాతరితీపులంబలెను దారసిలన్వలె లోఁ దలంచినన్
బాతిగఁ గైకొనన్వలెను బైదలిపుట్టుకలోని పల్లటీ
కూఁత లనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
జేతికొలందిఁ గౌఁగిటను జేర్చఁగ నిన్నియ చిన్నిపొన్ని మే
ల్మూఁతల చన్నుదోయివలె ముచ్చట గావలెఁ బట్టి చూచినన్
వాలొడ నున్న మిన్నులమిటారపు ముద్దులగుమ్మ కమ్మనా
వాతెఱ దొండపండువలె వాచవి గావలెఁ బంట నూఁదినన్
గాతలఁ దమ్మిచూలిదొరకై పసపుంజపరాలి సిబ్బెపు
న్మే తెలియబ్బురంపుజిగినిబ్బరపుబ్బగుగబ్బిగుబ్బ పొం
బూఁతల నున్నకాయ సరిబోఁడిమి కిన్నెర మెట్లబంతి సం
గాతపు సన్నబంటియకారపుఁ గన్నడగౌళ పంతుకా
సాంతత తానతానలపసం దివుటాడెడుగోట మీటుబల్

ప్రోఁతలునుంబలెఁ హారుపు మొల్లము గావలె నచ్చ తెన్గు లీ
రీతిగ సంస్కృతంబు పచరించినపట్టున భారతీవధూ
టీపసియుగర్భసిరటీ భవదానసపర్వ సాహితీ
భౌతిక నాటక ప్రకరభారతభారతిసమ్మత ప్రభా
సాతసుధా ప్రపూరబహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మలయసంగతి చుంచుపిసంచికామృపం
గాతట కేహితత్తహాహహోధిరిపంధణుభాణుధింధిమి
ప్రాపసియూను హూలసదవానపహూ హ్వహహోరికింకిణీ
నూతనఘుల్లాచరణనూపురఝూళఝుళీ ఘుళంపినం
ఘూటవియద్ధునీచట చటద్విట చోత్పలసారసంగ్రహో
యూరసమూరిగంధవహహోరిమగంధవిలాసయుక్తమై
చేసు చెల్లఁజేయువరి చిల్లుగఁ జల్లవటె నృమనోహర
ద్యోతితగోత్రపీఫలమధుద్రవగోఘృత వాయసుప్రసా
రాటరసప్రసాదరుచిరప్రపసంబుగ సాగెసాగెసఁ.

అను పద్యమాలిక నాశువుగా విరచించి చదివెనఁట! దానిపైఁ గృష్ణరాయలు తానై యాకవిగండపెండేరము నాతని పాదమునఁ దొడిగెను. ఆశుకవిత్వమనఁగా నాలోచనము సల్పకయే నెట్టిరసము కూర్పవలెనో యట్టే యాశువుగను జెప్పనేర్చినది గాని చిత్తకూరుపు గానేరదు. మఱొకప్పుడేదో కృష్ణరాయలాశువుగా విరచింపు మని కోరఁగా నాతఁడు—

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
ప్పురవిడె మాత్మకింపయినభోజన ముయ్యెలమంచ మొప్పుత

ప్పరయురసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినఁ గాక యూరక కృతుల్ రచియించు మనంగ శక్యమే.

అని నిరాకరించె నని చెప్పుదురు.

పెద్దనార్యున 'కాంధ్రకవితాపితామహుఁ' డని బిరుదనామము కలదు. ఈ బిరుదము "పురాణకథను గాని స్వకపోలకల్పనలు గూర్చి తొలుదొలుత మను చరిత్రమును బ్రబంధరూపమున రచించుటచేఁ గలిగిన" దని కొందఱందురు గాని యది సరి కాదు

ఇట్టి ప్రబంధములఁ గూర్చినవారిలోఁ బెద్దనార్యుఁడు తొలుదొలుతటివాఁ డనునది నిలువనేరనిమాట. అంతకుముందే యిట్టి రచనము కలదని తెలిపి యున్నాఁడను. ఒకవేళ తొలుదొలుతటి దనియే యొప్పుకొన్నను నీ బిరుద మీగ్రంథరచనమును బట్టి వచ్చినదనుట పొసఁగ నేరదు. మనుచరిత్రమును రచింపు మని కోరునప్పుడే కృష్ణరాయలచే,

క. హితుఁడవు చతురవచోనిధి
వతులపురాణాగమేతిహాసకథార్థ
స్మృతియుతుఁడ వాంధ్రకవితా
పితామహుఁడ వెవ్వ రీడు పేర్కొన నీకున్

మను. పీఠిక, ప. 15.

అని పెద్దన పేర్కొనఁబడియున్నాఁడు.

కృష్ణరాయలు తన యాస్థానకవులలో నెల్ల వయసుచేతను, గవితచేతను బెద్దవాఁ డగుటచేఁ బెద్దనా

మాత్స్యనకే బిరుద మొసంగి యుండును. ఈతఁడీమను చరిత్రమును గాక హరికథాసార మను వేఱొక ప్రబంధమును రచించి తన గురు వగు శఠకోపయతికిఁ గృతి నొసఁగెను. ఆగ్రంథమునుండి యీ క్రిందిపద్యములు రంగరాట్ఛందమున నుదాహరింపఁబడి యున్నవి.

క. అంబరము పగుల నార్చి ప్ర
లంబాసురుఁ డాగ్రహము వెలయఁ గదిసినవే
కం బలరాముఁడు చేముస
లంబున వానిం బ్రుంచె లావు మెఱయఁగన్.

క. ఆదేవకీసుతుఁడు సుధాం
భోధిసమై కాగ్రిమునివశమున బాయం దై
చేవోయిచేత దిషిణా
సావము గొని నోటఁ జెప్పెఁ బటపట నగుచున్.

క. శఠకోపయతికి ఘనతర
శతారకోపమమతికిని గుణితమహాత్కా
ర్మపనిరతికిఁ జతురాగమ
పరనాయకనియతికిని జపాసంధృతికిన్

గీ. అఖిలహరి కాంక్షి కాశ్రయపణ్ణశా
గోపకంఠమునకు లోకకర్త
చేరు నేఁగి యచటఁ బారివంబున డిగ్గి
యధివసించి యుండు సద్ధితోడ.

క. బాలరసాలకిసాలము
గ్రోలుచుఁ బలికెడిపికంబు కోయనఁ జాలం

జాలిఁబడి యానయమధు
రాలాపము లనియె నాదరణమున వినఁగన్.

ఇది గాక కృష్ణరాయలు స్వర్గస్థుఁ డైనపిదప నాతని నిర్యాణమునుగూర్చి సీసపద్యశతక మొకటి రచించె ననియుఁ దా మాపద్యశతకము కొంతచోఁ జూచి యుంటి మనియు మిత్రు లొకరు నుడువుచున్నారు; కాని యది లభించినది కాదు.

సీ. ఎదు రైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
కోకటగ్రామాద్య నేకాగ్రహారంబు
లడిగినసీమలయందు నిచ్చె
మనుచరిత్రం బందుకొనువేళఁ బుర మేఁగఁ
బల్లకిఁ దనకేలఁ బట్టియెత్తె
బిరు దైనకవిగండ పెండేరమున కీవె
తగుదని తానె పాదమునఁ దొడిగె
గీ. 'ఆంధ్రకవితాపితామహ అల్లసాని
పెద్దనకవీంద్ర' యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగ లేక
బ్రతికియున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు

అనుపద్య మొకటి మాత్రము చాటువులలోఁ గలదు. మఱియుఁ గృష్ణరాయ నిర్యాణానంతరము కన్నడ రాజ్యముపైకి గజపతిరాజు దండెత్తిరాఁగా

సీ. రాయరాహుత్తగండరాచరేసుఁగు వచ్చి
యారట్లకోట గోరాడినాఁడు
సంపెటనరపాలసార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చినాఁడు
చెంగోలుసింహంబు చేరి ధిక్కృతిఁ గాంచు
తల్పులఁ గటకంబు దీకొల్పు నాఁడు
ఘనసింహనిర్ఝరగండఁడు పెంపెర మిచ్చి
హూణుఁడు రాయల కొనఁగూర్చునాఁడు
గీ. నాఁడ తెలుంగఁడో వచ్చెనో యుర్వి లేదో
చేరఁజాలఁ డిల వెనికి దీర్ఘమైనొ
కన్నడం బెట్లు నొచ్చెను గజపతీంద్ర!
తెలివిసలుపక నొచ్చెను తెలుఁగు వాఁడు

అను సీసపద్యమును బంపె ననియు, దానిపై నాతఁడు సిగ్గిలి తిరిగి పోయె ననియుఁ దెలియుచున్నది. మును మనుమసిద్ధిరాజు ప్రతాపరుద్రునకుఁ దనరాజ్యము నోడి పోఁగాఁ దిక్కనామాత్యుఁడు తన కవితచేతఁ బ్రతాపరుద్రుని మెప్పించి మరల నారాజ్యమాతని కిప్పించెనఁట !

వెలుగోటిరాజయిన మాదయలింగమనేఁడల్లయవేముని తల నఱికి తనతమ్మపడిగం బొదిగించి సందికంత పోతరాజను పేరి కఠారిఁ గైకొనఁగా శ్రీనాథకవిసార్వభౌముఁ డాతనిఁ జేరి సరిగి కవనముచే నాతనిఁ బొగడి మెప్పించి మరల నాకఠారిఁ గొనితెచ్చెనఁట! బళిరా కవిత్వమహాత్త్వము !

ఇంకను కృష్ణరాయనిచే రచింపఁబడినట్లు గల యాముక్తమాల్యదయుఁ బెద్దనచేతనే రచింపఁబడినదని యొక యైతిహ్యము బహుకాలమునుండి కలదు. రంగరాట్ఛందమునం దాముక్తమాల్యదలోని పద్యము లుదాహరింపఁబడునెడ 'పెద్దనగారి యాముక్తమాల్యదలో' నని నుడువఁబడియున్నది. మఱియు నాముక్తమాల్యదకుఁ బ్రాచీనవ్యాఖ్యాత యొకఁడు తన వ్యాఖ్యానావసానమునఁ 'బెద్దన రచించిన యాముక్తమాల్యద' యని పద్యరూపమున వాక్రొచ్చియున్నాఁడు. ఇంకను గొన్ని యెడలఁ బెద్దనకృతి యని కలదు. మనుచరిత్ర మెట్టి హృదయంగమము లగుభావములతో విలసిల్లుచున్నదో యాముక్తమాల్యదయు నట్లే చెల్వు మీఱుచున్నది. కాని రెండిటికిని శైలియందుఁ గొంచెక భేదము కలదు. ఇట్టిభేద మొకకవియే కాలభేదముచే రచించిన కృతులందుఁ జూపట్టుచుండుట లేకపోలేదు. ఇయ్యెడ బాణుని కాదంబరీహర్షచరిత్రములు తారతమ్యముగాఁ జూడ నగును. 'కవితాప్రావీణ్యఫణీశ' మొదలగుపదములచే సంబోధింపఁబడిన కృష్ణరాయలు కవనము చేయలేక యితరుఁడు రచించినదానిని దనపేరఁ బ్రకటించుకొనె ననుటయుఁ బొసఁగుఁబాటు కలదిగాఁ దోఁచుటలేదు. ఈ విషయము సత్యమైనను నసత్యమైనను దాము రచించిన గ్రంథములను దమరాజులు రచించినట్లే వారి పేళ్లతోఁ బ్రకటించునాచారము వెనుకటి కవులకు లేక

పోలేను. ఇవిగాక పెద్దనకృతము లని వాడఁబడునవి కొన్ని చాటుపద్యములు గలవు.

తన దివ్యకవిత్వకలాపమునఁ జేఁ గృష్ణరాయల మెప్పించి యాతని యాస్థానకవీశ్వరుఁడై యీమనుచరిత్రము నాతనికే కృతినిచ్చి యనేకాగ్రహారములను గొని మహాభోగముల ననుభవించి యైహికేచ్ఛం దనియుటను గాక తపస్వ్యగ్రేసరుఁడై కోకట మను తన యగ్రహారమునకు శఠకోపపుర మని యాత్మగురుఁ డగు శఠకోపయతిపేరఁ బెట్టి బ్రాహ్మణులకు సర్వాగ్రహారముగా నొసంగి యొక యనేక దేవాలయములకు భూదానములు చేసి పారలౌకికసౌఖ్యమును సయితము సమార్జించుకొనిన యీ యాంధ్రకవితాపితామహుఁడు కృష్ణరాయ నిర్యాణానంతరము సయితము జీవించి యుండి ౧౫౪౦ సం|| ప్రాంతముల నశ్వర మగు భౌతిక శరీరమును త్యజించి శాశ్వతమగు కీర్తిమూర్తిని గైకొనెను. ఎంతవఱకు నీయాంధ్రభాష ప్రచారము గలదై సుస్థితిని వెలయుచుండునో యంతవఱకును పెద్దనార్యుని యశశ్శరీరమునకు భంగపాటు వాటిల్ల నేరదు.

## —: గ్రంథవిమర్శనము :—

### రచనాచాతుర్యము.

మార్కండేయపురాణమునం దీస్వారోచిషమను జన్మవృత్తాంతము సమగ్రముగాఁ గలదు. ఆపురాణమును

మారన యాంధ్రీకరించెను. కేవలాందూపంబుల నొకటి పోషణమునకె బిఱుసూర్పులఁ గావించెఁ గాని పెద్దనామాత్యుఁడీ ప్రబంధరాజమును ముద్దుగుట్ట మార్కండేయపురాణపు ద్రోణనే పెంపొందించెను. మారన కవిత్వమున ౧౫౦ పద్యములలో ముగిసినకథ యీతని కవనమున ౮౦౦ పద్యములవఱకుఁ బెరిఁగినది. ఈ మను చరిత్రము 'అల్లసానివాని యల్లికజిగిబిగి' యనునుడులకును బ్రతిపదమును సార్థకమై యున్నది. పెద్దనామాత్యుఁ డీ ప్రబంధమును దీర్ఘకాలము పరిశ్రమ చేసి తనసర్వతో ముఖ పాండిత్యమును జాతుర్యాధికప్రతిభావిలాసమును నెల్ల నుంచి నిబ్బరమైన శైలి నాహాపట్టి మెఱుఁగులు పోహ ళించెను గాని యుందమునకులుగా నెందును ముడిపెట్టలేదు. ఈ గ్రంథమునందుఁ గూర్పునేర్పును భావవైచిత్ర్యమును బిక్కటిల్లని పద్యము కాని గద్యము గాని చూపట్టదు ఎక్కడఁ బట్టిన నక్కడఁ గవిశ్రేష్ఠుని లోకజ్ఞానమును భాషానైపుణ్యమును గల్పనాచాతుర్యమును వెల్లి విరియుచున్నవి. పెద్దనార్యుని పద్యములు ముద్దులొలుకు నిద్దంపుఁబలుకుల నేర్చి కూర్చి తీర్చి దిద్ది చికిలిసేసి నను మెఱుఁగు వెట్టి వెల్వరింపఁబడినవి కావుటచే నెక్కడను నొక్కులు వోయి కాన్పింపవు. మఱియు సంస్కృతాంధ్రముల సందము గాఁ గలయఁగూర్చు కతన నితని కవనమున సంస్కృతప్రౌఢిమయుఁ దెలుఁగునుడికారమును మిసమిసలు దేఱుచుఁ జెజలాడుచున్నవి.

## శైలి.

శా॥ రాపుల్ ప్రేవలఁ బిల్లుమెంగలను వేదాంతంబు పేరంబునన్
మాపుల్ ప్రోవులు పెల్లుపెల్లి గొనఁ గాంతారంబులం దైంపన
గ్రాహాలిప్తికాయమానకటిప్రాఘగుహచ్ఛంబులం
బాపుంచే వెల నొప్పునొక్కఁ బవనంబులఁ గారుపోల్కృష్ణముల్.

ఆ 2. ప 22

క. మృగమదసౌరభవిభవ
ద్విగుణితఘనసారసాంద్రవీటీగంధ
స్థగితేతరపరిమళమై
మగువపలుకు వెలయునొక్క మాయపు మొలనన్.

ఆ 2, ప 24

ఈ పద్యములు నాల్గు వరణ మట్టిమాంగుత్తము నోల యించుచునే యున్నది.

శా॥ హాలాహలం గొనగోళ్ళ పి వంచిసిన హాయించుచో నాటసన్
మేఘం బైనవిపంచి నిస్సు మొనయుఁ నీ వంటమించేసి యా
యాలాపంబె సుమేఘ బల్కెసుఁ బ్రథారాయాంపాహాహతా
లోలత్తిగ్రహల మేఘ బంధుఁగపవే లోలాకి పెశాషిపిన్.

ఆ 3. ప 57.

ఉ॥ విలుఁగుల పట్టుచుం బోవలఁ జెంప్రచిసోసి యంట మైరటిం
పకపెక వేనిచీరఁ గటి పంపి పఁ బిసుల్లుఁ జేర్చిరొంచు వే
బలంపము లాపి యూడి యొచ్చాన కరస్థితవేణ యై నృపు
న్వెలువడి చూచె లోపలిపి సి ని బాసట నిల్చెనో యనన్

ఆ. 5, ప 68.

## ఔచితీనిర్వాహము.

క. అల్లదె కంటే పొనపొన
వెల్లనిగట్టులత ముబ్బు దేవెడుపాలమం
దెల్లెడఁ జూచిన ధరణీ
వల్లభ సీరాముసేన వాలు మెకంబుల్.

అ. 4. ప. 16.

క॥ తిమిరంపుగుబ్బ పన్నుల
కొమరాలపు నీటఁ దిగినగోవాళ్ళ మహిన్
నెమకి నగరాదె ముదిసిన
మముఁ జెనకిన నేమి గలదు మన మేమిటికిన్.

అ. 4. ప. 83.

## కల్పనాచాతుర్యము.

చ॥ మరున కొసంగఁ గాలము తమశ్ఛట గాటుక గా నవోదయ
స్ఫురదరుణప్రభాపధికశోణితసిక్తసితోరుభక్తమున్
హరిహయదిజ్ఞనస్సలమునన్ బలి చల్లి పటాంకమునన్ వసూ
త్కరభరితంబు నై వెలుఁగఁ గాంచి సుధానిధి నెత్తె నత్తటిన్.

అ. 3. ప. 21.

## భావప్రకాశనము.

మ॥ మునుమున్ పుట్టినకొంప లౌల్యము నిచన్ మోదంబు వీక్షింతం
జొనుపం గోర్కులు గ్రేళ్ల ద్రిప్ప మది మెచ్చుల్ చెప్పలల్లార్పన
త్యనుషంగస్థితి దిచ్చపాటొనఁగ నొయ్యారంబునం జంద్రికల్
దనుకం జూచె లతాంగి భూసుపఁ బ్రఫుల్ల న్నేత్రపద్మంబులన్

అ. 2. ప. 30

## స్వభావపరిజ్ఞానము.

చ॥ పలుకులు నేర్పువేళఁ గలభాషిణి నీ విటు లుండఁ బంజరం
బుల నరగన్ను వెట్టి ముఖముల్ చరణాగ్రనఖాళిఁ గ్రొఁకుచుఁ
నిలుగుచు నావులించుచు వనీవిహగోత్కర మెట్లు వల్కె న
ప్పలుకులె యట్లు లత్తి విని పల్కెడు వింటివె కీరశారికల్.

ఆ. 3. ప. 58.

సీ॥ ఏ విహంగముఁ గన్న నెలుఁగించుచును సారె
కును సైకతంబులఁ గూడఁ దారుఁ
దారి కన్గొని యది తనకోపు గాకున్న
మెడ యెత్తి కలయంగ మింట నరయు
నరసి కన్నీటితో మరలి తామర యెక్కి
వదన మొండఁగ సరోవారి నద్దు
నద్ది త్రావఁగ నైఁప కట్టిట్టు గన్గొని
ప్రకటించ మీక్షించి భ్రమసి యులుకు
నులికి యెలుకలు దపియ వేరొక్కతమ్మి
కరుగు నరిగి రవంబుతోఁ దిరుగు తేంట్లఁ
బొడుచు ముక్కున మఱియును బోవు వెనక
సంజఁ బ్రియుఁ బాసి వగ నొక్కచక్రవాకి.

ఆ. 3. ప. 16.

ఈ సీసపద్యము పెద్దనార్యుని భాషాంతరీకరణ చాతుర్యమును వెల్లడిచేయుచున్నది. చూడుఁడు.

శ్లో. ఆయాతి యాతి పున రేవ జలం ప్రయాతి
పక్షాంకురాణి విచినోతి ధునోతి పక్షౌ
ఉన్మత్తవ ద్భ్రమతి కూజతి మందమందం
కాంతావియోగవిధురో నిశి చక్రవాకః.

ఈశ్లోకమున కాపద్యమునకు వాదమయ్యు నెంతయేని మనోజ్ఞముగాఁ బెంపొందింపఁబడినది. మఱియుఁ బుంలింగమున నన్న కర్తృపద మత్యంత స్వారస్యాపాదక మగునట్లు స్త్రీలింగముగా మార్పఁబడినది. పెక్కుచోటుల నీతఁ డేదే నొకలోకోక్తినో, ప్రకృతిచిత్రమునో కైకొని దానికి వన్నెలు చిన్నెలు వచ్చునట్లు మేలయినకల్పనఁ గల్పించి పద్యమునఁ బెట్టి బాగుగా గనిపించును.

చ॥ మదకలకుంభికుంభనవమౌక్తికముల్ గనుపట్టు దట్టమై
వదలక కృష్ణరాయకరవాలమునం దగుధారనీట న
భ్యుదయము నొంది శాత్రవుల పుట్టి మునుంగఁగ ఫేనపంక్తిలోఁ
బొదిగొని పైపయిన్ వెడలు బుద్బుదపంక్తులువోలెఁ దోరులన్.

అ. 1. ప. 41.

ఈ పద్యమునందలి కల్పన 'వానిపుట్టి మునిఁగినది' యను లోకోక్తిని బట్టి పుట్టినది.

ఉ. ప్రాకవ నేభదంత హతకుడ్య పరిచ్యుతవజ్రపంక్తిఁ దొ
ల్పారు మిణుంగురుంబురువు లందు వెసం గొనిపోయి పొంతశృం
గారవనద్రుమాళి గిజిగాడులు గూడులఁ జేర్చుదీపికల్
గా రహిఁ గృష్ణరాయమహికాంతుని శాత్రవపట్టణంబులన్.

అ. 1. ప. 36.

ఈ పద్యము గిజిగాఁడులు మిడుఁగుఱుఁబుర్వులను దమ గూండ్లలో వెలుఁగునకై చేర్చి యుంచుకొను నను ప్రకృతిచిత్రమును బట్టి యందముగాఁ బొందుపఱుపఁబడినది.

కృష్ణరాయని వంశాదివర్ణనమున నితఁడు చిత్రించిన ప్రతికల్పనయు ననుపమానమై వెలయుచున్నది.

పెద్దన తనవెనుకటికవుల కూర్పులలోని మే లేర్చికొని పొందుపఱుగా నదుకికొనుచు నొక్కొకయెడఁ దొంటికంటె సుతారముగ మిగులఁ బల్లవించును.

చ. ఉడిగి మడింగి మై మఱచి యున్నతఱిం గలలోనఁ జేరె నె
క్కడిమగవాఁడొకో యనుచుఁ గందఁగ మేల్కనుచో నతండ (యి
ప్పుడు మగఁడంచుఁ గోరుటయుఁ బొందుగఁ జెప్పితి ముల్లు పుచ్చి (కొ
ఱ్ఱడఁచినచంద మయ్యెఁ గమలానన యీ విరహానలంబునన్.

ఉత్తరహరివంశము. సోముఁడు.

చ॥ ఉడుపలిబారికిన్ వెఱచి యూఱట యౌ నని పేరుటామునిన్
ముడివడఁ బంపుసేసలకు మొయ్యేలగు ట్టయినట్టియిందు రా
నడఁగునె తాఁపవహ్ని మనమై హరిణేక్షణ ముల్లు పుచ్చి కొ
ఱ్ఱడచిన చంద మయ్యెఁ బనిమా యెలదోఁటఁ జరింప నేటికిన్.

ఆ. 3. ప. 34.

మ. అనుమానింపక యాసుధాంధసులు మాయాకల్ప నావంచనం
బున వైశ్వానరునిన్ హరించిరి యవుంబో యింతమాత్రంబులో
నన నాయోగమహానుభావమునకున్ భంగంబు వాటిల్లు నే
ననిక ల్లాఁచినఁ బెంప్లి మానునొకొ దుశ్చారిత్రులం గంటిరే.

కాశీఖండము. శ్రీనాథుఁడు.

శా॥ తండ్రీ! నాకు ననుగ్రహింపఁగదె వైద్యం బంచుఁ బ్రార్థించినన్
గంద్రల్ గా నటు లాడి ధిక్కృతులఁ బో కాల్మంటి వోహో (మదిం

దీంట్రెల్ గల్గినవారి కేకరణి నేనిన్ విద్య రాపండునే
గుండ్రా డాఁచినఁ బెండ్లి యేమిటికిఁ జిప్పఁగం గష్టముష్టింపచా ।
ఆ. 5. ప. 17.

సీ. పులిమల్లఁ దడవిపోతులరాజు గరుడుండు
గాలివేగంబు పందేలపసిఁడి
విష్ణుప్రసాదంబు వెండిగుండులపరి
పచ్చిమిర్యము పెట్టిపచ్చకాయ
వేఁటమాణిక్యంబు విరవాది మొకబల్మి
పెట్టుగాఁడు వకారి పిడుగుతునుక
జిగురుఁడు చిత్రాంగి శ్రీరామబాణంబు
పులియందు కస్తూరి బొడ్డుమల్లె
గీ. యనఁగ మఱియును బెక్కుతోయముల పేళ్ల
దారఁలు దేర వచ్చె నుద్దండవృత్తి
వేఁటకుక్కలు మృగరాజవిగ్రహములు
వటుక నాథుని వాహ్యాళివాహనములు
శృంగార శాకుంతలము. పినవీరభద్రకవి.

చ॥ పులియఁడు బూచిగాఁ డసురపోతులరా జనుమంతిగాఁడు చెం
గలువ సివంగి భైరవుఁడు గత్తెర సంపఁగి వెండిగుండు మ
ల్లెలగుది వాయువేగి చిటిలింగడు సాళ్వుఁడు వత్సనాభి యే
కలములమిత్తి గబ్బి యనఁగాఁ గలవాని గ్రహించి యుద్ధతిన్.
ఆ. 4. ప. 32.

పెద్దనామాత్యుఁడు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని శాకుంతలమునఁ గల వేఁటవర్ణనము మొదలుకునది తిన్నగ నెత్తుకొని దానికంటెఁ బెక్కుమడుఁగు లెక్కువ చక్కఁ

దనము గల్గునట్లు తాను సమకూర్చెను. మఱియు మారన మార్కండేయపురాణమును బట్టియే యీ గ్రంథము పెంపొందింపఁబడిన దగుటచే నందలి రచనలును కొన్ని యిందుఁ జొచ్చినవి. ఒండు రెండు జక్కనపద్యములఁ బోలినపద్యములుఁ గలవు. ఇవిగాక కడునుఁ బోకడలకు గనియు, నుడికారములకు విడిదిపట్టును నగు కవిసార్వభౌముని కవితావిలాసములు బహువారములు తఱచి తఱచి చదివి ముదంపడినవాఁడు కావుటచేఁ బ్రౌఢకవనమునం దత్యంతాదరము గలపెద్దనార్యుఁడు తన యాదరాతిశయమున కుద్యోతకముగాఁ గావలయు నాయా రచనాచమత్కారములను మనుచరిత్రమునఁ బెక్కు-చోటుల నెలకొల్పెను. "మిన్నులు పడ్డచోటు, కులము సాములు, నెన్నుతోఁ బెట్టినది, కడుపారఁ గన్నతల్లి, హుటాహుటికడలు, చన్నపిసి పిదుకన్, బండికంబైన చాయ" మొదలగు మేలయిన తెలుఁగు పలుకుఁబడులు పెక్కులు శ్రీనాథుని కవనమునుండి మనుచరిత్రమునకుఁ గొనితేరఁబడినవి. పైగ్రంథములోని పద్యములు పరిమితముగాఁ బెద్దనార్యుని పద్యములతోఁ బోల్చి చూపఁబడుచున్నవి.

సీ. అని యమ్మహాభాగుఁ డాచమన మొనర్చి
నియమంబు శుచియునై నిలిచి గార్హ
పత్యాగ్నిఁ దనమది భావించి వందన
మొనరించి యిట్లను ననిలమిత్ర

నీయంద యాహవనీయాగ్నియును దక్షి
ణాగ్నియుఁ బ్రభవించె నఖిలదేవ
తలకును దృప్తి నీవలన సిద్ధించును
సకలలోకముల కాశ్రయము నీవ
గీ. నిత్యసత్యమూర్తి నీ ప్రసాదంబున
సినుఁడు గ్రుంకకుండ నిపుడ యింటి
కరుగువాఁడఁ గాక యాగమోదితకర్మ
జాతనైష్ఠికుండ నైతినేని.

మార్కండేయ పురాణము.

తే॥గీ॥ అనిన నేమియు ననక యవ్వనజగంధి
మేనకజవ్వాదిపస గదంబించునొడలు
గడిగికొని వార్చి ప్రవరుండు గార్హపత్య
వహ్ని నిట్లని పొగడె భావమునఁ దలఁచి.

ఆ. 2. ప. 74.

మ॥ దివిషద్వర్గము నీ ముఖంబునన తృప్తిం గాంచు సన్నీఁతుగా
స్తవముల్ సేయు శ్రుతుల్ సమస్తజగదంతర్యామివిన్ నీవ యా
హవనీయంబును దక్షిణాగ్నియును నీ యందుద్భవించుం గ్రతూ
త్సవసంధాయక నన్నుఁ గావఁగదవే స్వాహావధూ వల్లభా!

ఆ. 2. ప. 75.

ఉ॥ దానజపాగ్ని హోత్రపరతంత్రుఁడ నేని భవత్పదాంబుజ
ధ్యానరతుండ నేనిఁ బరదారధనాదులఁ గోరనేని స
న్మానముతోడ నన్ను సదనంబున నిల్పు మినుండు పశ్చిమాం
భోనిధిలోనఁ గ్రుంకకయమున్న రయంబున హవ్యవాహనా!

ఆ. 2. ప. 76.

తే॥ అసఖు మందారవిద్యాధరాత్మజన్మ
నే విభావసి యనుదాన.... .........

మార్కండేయపురాణము.

తే॥ అనఘ మందారవిద్యాధరాత్మభవను
నను విభావసి యండ్రు గంధర్వవరులు
తెలిసి యుండుదు నిమ్మహీతలమునందుఁ
బరఁగుమృగపక్షిజాతుల భాష లెల్ల.

ఆ. 6. ప. 17.

ఇట్టులు మార్కండేయపురాణపుఁ బోలికలుకొన్ని గలవు.

సీ. సంపూర్ణ పౌర్ణిమాసాంద్రచంద్రాతప
విలసితశశికాంత వేదికలను
మంజరీసంజాతమకరందనిష్యంద
మాకందమాధవీమంటపముల
శృంగారవనమహాశృంగారమణిశృంగ
హాటక శైలశృంగాటకముల
సంఫుల్లహల్లకసహకారవాసనో
జ్జ్వలదీర్ఘదీర్ఘికా సైకతముల
గీ. గగనగంగాతరంగిణీగంధవాహ
బంధురోదగ్రసౌధాగ్రభాగములను
నవనవోల్లాసరతికళా నైపుణములఁ
బ్రతిదినంబు రమించిరి సతియుఁ బతియు.

జక్కన విక్రమార్కచరిత్ర.

సీ॥ గంగాతరంగిణీరంగత్తరంగ శీ
కరశీత సైకతోత్కరములందు
మందారమాకందమకరందకుందలేం
దిందిరానందకృన్నందనములఁ
గాంతనిశాకాంతకాంతవితర్దికా
క్రాంతభూభృద్వృందకందరముల

మసృణబిసాహారమాంసలహింసికా
సంపదాసారకాసారతటులఁ
దమః తమక ప్రియుం డని తమక మెసఁగఁ
బపెఁతు లుప్పొంగఁ గ్రీడించెఁ బద్మినీప్ర
భావ ఘటితాన్నపానభూషావిశేష
మాల్యవస్త్రానులేపసామగ్రిఁ జెంది.

ఆ 6. ప. 62.

సీ. నలినసంభవువాహనమువారుపంబులు
కులముసాములు మాకుఁ గువలయాక్షి
చవిలేటిబంగారుజలరుహంబులతూండ్లు
భోజనంబులు మాకుఁ బువ్వుఁబోఁడి
సత్యలోకముదాఁక సకలలోకంబులు
నాటపట్టులు మాకు నబ్జవదన
మధురాక్షరము లైనమామాటలు వినంగ
నమృతాంధసులు యోగ్యుల నుపమాంగి
గీ. భారతీదేవిముఁ జేతిపలుకుఁజిలుక
సమదగజయాన సబ్రహ్మచారి మాకు
వేదశాస్త్రపురాణాదివిద్య లెల్లఁ
దరుణి నీయాన ఘంటాపథంబు మాకు

సీ॥ చిన్ని వెన్నెలకందు వెన్ను దన్ని సుధాబ్ధిఁ
బొడమిన చెలువ తోఁబుట్టు మాకు
రహి వుట్ట జంత్రగాత్రములరాల్ గరఁగించు
విమలగాంధర్వంబు విద్య మాకు
ననవిల్తుశాస్త్రంపుమినుకు లావర్తించు
పని వెన్నతోఁ బెట్టినది మాకు
హయమేధ రాజసూయము లనఁ బేర్పడ్డ
సవనతంత్రంబు లుంకువలు మాకుఁ

గనఁ నగసీమఁ గల్పవృక్షములనీడఁ
బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకుఁ
బద్మసంభవవైకుంఠభర్గసభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర.

అ. 2 ప. 43

సీ. గిరినికుంజములఁ గుంజరపుంజ మనుశంకఁ
గంఠీరవంబు లుత్కంఠ నెగయఁ
బల్వలంబులఁ గిరిప్రకరంబు లనుశంక
నెఱకురాజులు వింధు లెక్కువెట్టఁ
గదలిమధ్యంబునఁ గాకోల మనుశంక
జలదేవతలు భీతిసంభ్రమింప
నదములఁ గువలకాసనవాటి యనుశంక
నిందిందిరశ్రేణి లెనుకకొనఁగ
గీ. రజతగిరియందుఁ దాండవారంభరభస
భంగిచలితపరశ్వథపాణివికట
కంధరాపృష్ఠగజకృత్తికంపశంక
ప్రమథులకుఁ దోఁప సంఘకారంబు ప్రబలె.

భీమఖండము — శ్రీనాథుఁడు.

సీ॥ ఉరుదరీకుహరసుప్తోత్థశార్దూలముల్
ఝరవారి శోణితశంకఁ ద్రావ
వనకుంజమధ్యశాద్వలచరన్మృగపంక్తి
దావపావకభీతిఁ దల్లడిల్ల
నాశ్రమాంతరభూరుహాగ్రముల్ మునికోటి
బద్ధకాషాయవిభ్రాంతిఁ జూడ
ఘనసానుశృంగశృంగాటకంబులఁ గాంచి
యమరులు హేమాద్రి యనుచు వ్రాలఁ
గానెఁ బేశలరుచిఁ గింశుకప్రవాళ
ఘుసృణకిసలయకంకేళికుసుమగుచ్ఛ

బంధుజీవజపారాగబాంధవంబు
లన్నగంబున జరతారుణాతపములు.

అ. 3. ప. 11.

సీ॥ పతిపాణిపల్లవచ్యుతనీవిబంధన
వ్యగ్రబాలాహస్తవనరుహంబు
ధవకృతాధరబింబపీడనక్షతవ్యథా
భుగ్నలీలావతీభ్రూలతంబు ..

శృంగారనైషధము.

సీ॥ సహసానఖంపదస్తనవిత్తిపరిరంభ
మామూలపరిచుంబితాధరోష్ఠ
మతిశయప్రేమకల్పితదంతసంబాధ
మగణితగ్లానిశయ్యానిపాత
మతివేలమణితయాజ్ఞారగల్లచపేట
మతిదీనవాక్పూచితాత్మవిరహ
మంకురత్పులకజాలావిద్ధసర్వాంగ
మాకంపకృతహారవాసనాబ్జ
మాక్రమక్షీణనుతిపర్ణ మానిమీలి
తాక్ష మాస్విన్నగండ మాయుక్తచేష్ట
మాస్తిమితభాషణారవ మావఘూటి
ప్రథమసురతంబు గంధర్వపతికిఁ గరంచె.

అ. 3. ప. 116.

చ. కొసరి వసంతకాలమునఁ గోయిల క్రోల్చిసభంగి నేడ్చెన
ప్పసరుహనేత్ర కొండచఱిఁ బెద్దయెలుంగున వెక్కివెక్కి వె
క్కస మగుమన్యువేగమునఁ గాటుకకన్నులనీరు సోనలై
యుసిరికాయలంతలు పయోధరముల్ దిగువాఱునట్లుగన్.

కాశీఖండము.

ఉ॥ పాటున కింతు లోర్తురె కృపారహితాత్మక నీవు త్రోవ ని
చ్చోట భవన్నఖాంకురము సోఁకెఁ గనుంగొనుమంచుఁ జూపి య
ప్పాటలగంధి వేదన నెపం బిడి యేడ్చెఁ గల స్వనంబుతో
మీటిన విచ్చుగుబ్బచనుమిట్టల నశ్రులు చిందువందఁగన్.

ఆ. 2. ప. 70

ఇట్లనేకములుగాఁ జూపఁదగును. పై యేడ్పుపద్దెములఁబట్టి పారిజాతాపహరణమునఁ దిమ్మనయు, వసుచరిత్రమున రామరాజభూషణుఁడును రెండుపద్యములఁ గూర్చిరి

ఉ. ఈసునఁ బుట్టి డెందమున హెచ్చినశోకదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభుకట్టెదురన్ లలితాంగి పంకజ
శ్రీసఖ మైన మోముపయిఁ జేలచెఱంగిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీధ్వనిన్.

పారిజాతాపహరణము.

శా. ఆకాదిల్లి వెలుంగు వెల్లిఁ దల డాయన్ లేక రాకానిశా
రాజశ్రీసఖ మైనమోమునఁ బటాగ్రం బొత్తియొత్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూరాజత్కరాంభోజకాం
జీభో మేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగన్.

వసుచరిత్రము.

ఈ పద్యములపైఁ దెనాలి రామలింగకవి 'అల్లసాని పెద్దన అఱ్ఱు నిఱ్ఱు నేడ్చెను. ముక్కు తిమ్మన ముద్దు ముద్దుగా నేడ్చెను. భట్టుమూర్తి బావురని యేడ్చెను' అని యభిప్రాయ మిచ్చెనఁట!

పెద్దనామాత్యుని తర్వాత మనుచరిత్రమునకుఁ బ్రతిబింబములుగాఁ బ్రబంధములు కుప్పతిప్పలై యుప్ప

తిల్లినవి. మనుచరిత్రమునందలి పద్యముల పోలిక పద్యము లును బెక్కులు పొడసూపినవి.

క॥ సురగరుడోరగనరిఖే
చరకిన్నరసిద్ధసాధ్యచారణవిద్యా
ధరగంధర్వకుమారుల
నిరతము గనుఁగొనమె పోల నేర్తురె వీనిన్.

ఆ. 2. ప. 37.

క. నరఖేచరవిద్యాధర
గరుడోరగసిద్ధసాధ్యగంధర్వరతిన్
నిరతముఁ గనుఁగొందున యీ
నరనాథునిఁ బోలఁగలరె నమనిరూఢిన్,

సకలకథాసారసంగ్రహము,

మ. అనిమేషస్థితి మాన్పె బిత్తరపుఁజూపస్వేదతావృత్తి మా
న్పె నవస్వేదసమృద్ధి బోధకళ మాన్పెన్ మోహవిభ్రాంతితో
డనె గీర్వాణవధూటికిన్ భ్రమరకీటన్యాయ మొప్పన్ మను
ష్యుని భావించుట మానుషత్వము మెయిం జూపట్టె నానత్తఱిన్

ఆ. 2. ప. 33.

మ. అనిమేషస్థితి మాన్పెఁ జంచలపుఁజూపస్వేదభావంబు గ్ర
ద్దన వారించె వినూత్నఘర్మజలవిస్తారప్రపూరంబుతో
డన దేవాంగన కయ్యెడన్ భ్రమరకీటన్యాయమై యొప్పి య
మ్మనుజేంద్రున్ భ్రమియించునంతనె రహిన్ మర్త్యత్వమున్ -
(సంధిలెన్

సకలకథాసారసంగ్రహము

సి॥ వదనప్రభూతలావణ్యాంబుసంభూత
కమలంబు లన వీని కన్ను లమరు
నిక్కివీనులతోడ నెక్కసక్కెము లాడు
కరణి నున్నవి వీని ఘనభుజములు

సంకల్పసంభవాస్థాన పీఠికవోలె
వెడఁదయై కనుపట్టు వీని యురము
ప్రతిఘటించు చిగుళ్లపై నెట్టివాటిన
రీతి నున్నవి వీని మృదుపదములు ...

సీ. వదనసౌందర్యవిస్ఫారాంబుసంభూత
కంబంబు లగు వాని కన్నుదోయి
మదన సామ్రాజ్యసమ్యక్ప్రతిష్ఠ యొసంగ
సరసమౌ వాని వక్షస్స్థలంబు
కర్ణకుండలరత్నకాంతులఁ గొన నిక్కు
వగలు మీరెడు వాని యెగు భుజములు
అతులప్రవాళసంతతి రుచిసంపద
నవలింపఁ జను వాని మృదుపదములు ...

సకలకథాసారసంగ్రహము.

ఈ సకలకథాసారసంగ్రహము నొనర్చిన యయ్యలరాజు రామభద్రకవి కృష్ణరాయలయాస్థానకవియే. ఈతఁడు పెద్దనకు శిష్యుఁ డందురు. సమకాలముననే యిట్టి ప్రతిపద్యము లేర్పడినవి. ఇట్టివి చూపఁ దొరఁకొన్న నెన్నేనిఁ జూపనగును. పెద్ద[illegible] నాగరాజామాత్యుఁడు రచించిన శకుంతలాపరిణయము మనుచరిత్రపుఁ బ్రతిరూపమే. ఇట్లనేకులు కవులు మనుచరిత్రమునకుఁ బోలికగాఁ గవనము చెప్పఁబూనుటకు దాని యందుఁ గల గుణౌత్కృష్ట్యమే కారణము.

# కథాసంవిధానము

సంస్కృతభాషలో ' దృశ్యకావ్యములయందుఁ దక్క శ్రవ్యకావ్యములందు వస్త్వైక్యము తఱచు కన్పట్టదు. శాకుంతలమృచ్ఛకటికాదులగు రూపకములలోని యితివృత్తము ప్రధానపాత్రములగు నాయికానాయకుల వృత్తాంతమున కనుబంధియై పొంది తుద కానాయికా నాయకుల వృత్తాంతముతోడనే పర్యవసించుచున్నది. నాటకములం దితివృత్తమును హారమునకు నాయికానాయకులు కొలికిముత్తెములుగా నుందురు. ఇయ్యది యత్యంత చమత్కారాపాదకమై యింపునింపుచుండును. ఇంక శ్రవ్యకావ్యములందుఁ గొన్నిట నట్లుగాక యెక్కడ కక్కడ కితివృత్తము తెంపు చెందుచున్నది. దిలీపుని వృత్తాంతముతో నారంభింపఁబడిన రఘువంశకావ్యమగ్నివర్ణుని వృత్తాంతముతో ముగింపఁబడినది. ఎక్కడనో యారంభింపఁబడినకథ యెక్కడనో ముగింపఁబడుటచే వస్త్వైక్యము లేదు. ఇంక మన యాంధ్రభాషలోఁ బ్రాచీన కవులు దృశ్యకావ్యముల రచింపరైరి. మఱియు సంస్కృతమందలి దృశ్యకావ్యములను దెనిఁగించునెడ సహితము శ్రవ్యకావ్యములుగనే తెల్గించుచు వచ్చిరి. యక్షగానము లను కొండొక తెలుఁగు రూపక ప్రతిరూపము లుత్పత్తిల్లినవి గాని వానిని దృశ్యకావ్యములక్రిందఁ బరిగణింపఁబోలదు. ఇటీవల మిశ్రోత్పాద్యాన్యతర మగు నితివృత్తముతో గావింపఁబడుచు

నచ్చిన పెక్కు శ్రవ్యకావ్యములందు సంస్కృతనాటకక్రమమునఁ గొంత వస్త్వైక్యము కాననచ్చుచున్నది. వీరభద్రుని శృంగారశాకుంతలము, తిమ్మన పారిజాతాపహరణము మొదలగునవి వస్త్వైక్యము గలిగినవే కాని యట్టులు వస్త్వైక్యము కలిగి తీరవలయు ననునిబంధమీ తెలుఁగు ప్రబంధముల పట్టున నున్నట్లు చూపట్టదు. దీనికి నిదర్శకముగా రఘువంశాది కావ్యములవలె మన మనుచరిత్రమును వస్త్వైక్యము లేకయున్నది. ఇంకను రసోత్తరముగా రచింపఁబడినవరూథినీ ప్రవర వృత్తాంతము మూఁడవయాశ్వాసములో ముగిసిపోవుచున్నది. నాలవయాశ్వాసమున నుపక్రమింపబడిన స్వరోచి వృత్తాంతమారవయాశ్వాసములోఁ గొంతవఱకే గలదు ఆవల స్వారోచిషమనువృత్తాంతములోఁ బ్రబంధము ముగింపఁబడినది. ఇట్టివిచ్ఛేదము శ్రోతలకుఁ గొంతొకపట్టుల నిరుత్సాహము గల్గించుచుండును. అందును నిందు సరిసగమువఱకు గ్రంథమునఁ బెంపొందిన ప్రవరవరూథినీవృత్తాంతము విచ్ఛిన్నమై వేఱొకకథలో సంక్రమించి పోవుట యెంతయుఁ బాఠకుల యుత్సాహమును వెన్నడఁ జేయుచున్నది. కాని లోకస్వభావమునకు సరిపోవు సంవిధానములో నయ్యైపాత్రముల నెలకొల్పి యౌచితి కెందును భంగము రాకుండఁ దద్రూపచేష్టాదుల సమర్చి యేపట్టునఁ జూచిన నాపట్టున నదిరాయనవలయు నట్టులితివృత్తమును నడపించునేర్పు పెద్దనకుఁ గుదిరినట్టు

మఱియొకకవికిఁ గుదిరినది కాదు. నిగూఢములుగా నుండుమనోభావములను స్ఫుటపఱచి చప్పున విప్పి చెప్పు నట్లు పద్యమున నీతఁడు నిరూపించును.

ప్రవరుని స్వరూపస్వభావాదులను వర్ణించుపట్టును సిద్ధునితోఁడి సంభాషణముఁ దెల్పుచోటును జదివిన పద పఙ్క్తి జ్ఞానదృష్టికిఁ బ్రవరుని శాంతిస్ఫూర్తి లోకులకు స్వరూపము పొడకట్టకపోదు.

ఈ సందర్భమున నీ చిన్నపద్యమును స్మరించినఁ జాలును.

గీ. మౌనినాథ ! కుటుంబజంబాలపటల
మగ్నమాదృశగృహమేధిమండలంబు
నుద్ధరింపంగ నౌషధ మొండుగలదె
యుష్మదంఘ్రిరజోలేశ మొకటిదక్క.

ఆ. 1. ప. 64

పద పఙ్క్తి ప్రవరవరూథినీసంభాషణమున నీతఁడు శాంతిశృంగారరసములకు స్పర్ధ పెంచి నించినహొయలు వర్ణనాతీతము. ఇచ్చో టంకుటాంగ్రజంకెవలును వలపులును దలఁపులును బసరు పిండినట్లు పిండివడపోసి తేర్చి చూపించెను. మఱియు బ్రహ్మవాదుల యైహికేచ్ఛావైముఖ్యమును, వైదిక కర్మాదరమును, బ్రహ్మవర్చస ప్రాభవమును వెల్లివిరియించి యద్దిరా యనిపించెను.

ఉ॥ ఎన్ని భవంబులం గలుగు నిష్టశరాసనసాయకవ్యథా
ఖిన్నత వాడి వత్తలయి కేలఁ గపోలము లూఁది చూపులన్

విన్నదనంబు తోఁపఁ గనువేఁడుము జనం బయిగాలి సోఁకినన్
వెన్నవలెం గరంగు నలివేణులఁ గౌఁగిటఁ జేర్చు భాగ్యముల్,

ఆ. 2. ప. 57.

ఈ పద్యము వెన్నవలెఁ గరఁగుచునేయున్నది.

శా ఈ పాండిత్యము నీకుఁ దక్క మఱి యెందేఁ గంటిమే కామశా
స్త్రోపాధ్యాయుఁడవి నా వచించెదవు మే లోహో త్రయీధర్మము
ల్పాపంబుల్ రతి పుణ్యమంచు నిఁక నేలా తర్కముల్ మోక్షల
క్ష్మీపథ్యాగమసూత్రపంక్తి కివె పో మీ సంప్రదాయార్థముల్.

ఆ. 2. ప. 64.

ఓహో! వేదాదివిద్యాసంపన్నుఁ డగు ప్రవరుని భాషణ మెట్టికూర్పునఁ గూర్చె యౌచిత్యము నించెను.

ఇట్లౌచిత్యవిచారచర్చ గావించుట కెంతయేని నవకాశము కలదు. కాని యిది యదను కాదు.

ఈ తెలుఁగున సరససంవిధానము గలయీప్రబంధరాజమునఁ గొంద ఱొక యసందర్భమును జూపుచున్నారు. ప్రవరుని యింటికి సిద్ధుఁడు కుతపకాలమున నరుదెంచినట్లు కలదుకదా! కుతపమనఁగాఁ బగటి పదునెన్మిది ముహూర్తములలో నెనిమిదవ ముహూర్తము. అప్పుడా సిద్ధుని క్షేమసంప్రశ్నాదికలనచే సంతుష్టిఁ గావించి యింకను దీర్ఘయాత్రానుభూతాంశప్రసంగము కొంత జరపి పదపడి యాతనియొద్దఁ బాదలేపము గొని ప్రవరుఁడు హిమవంతమునకు బయలుదేఱునప్పటికిఁ గొంత సమయము కడచి యుండును. అవ్వల హిమవంతమున

కరిగి యుందుఁ గొంతతడ వయ్యోవిశేషములఁ బరి
కించి చూచిన పదపడి ప్రవరుఁడు

మ. తలమే బ్రహ్మకునైన నీనగ మహత్త్వం బెన్న నేనియ్యెడన్.
గలచోద్యంబులు తేపు గన్గొనియెదన్ గాకేమి నేఁడేఁగెదన్
నలినీబాంధవభానుతప్తరవికాంతస్యందినీహారకందళచూ
త్కార పరంపరల్ పయిపయిన్ మధ్యాహ్నమున్ దెల్పెడిన్.
మను. ఆ. 2. ప. 12

అని యనుకొనుట యసంగతము. ఎంత లేదని నప్పటి
కపరాహ్ణమునఁ జాలవఱకుఁ గడచవి యుండును. ఇచ్చో
బ్రవరుఁ డాసిద్ధుఁడు చనుదెంచిననాఁడు హిమాలయమున
కరుగక మఱుదినము ప్రొద్దుట నరిగె నని చెప్పి మఱి
కొంద ఱాయనుపపత్తిని నివారించుచున్నారు. ఈ సమర్థ
నము మార్కండేయ పురాణానురోధియే కాని పెద్దన
మాత్ర మట్టి వ్యవధి నించుకయేని సూచించినవాఁడు
కాఁడు. గర్భితమునవలెను.

ఇదిగాక యొండు రెండు శబ్దదోషములును బొడ
కట్టుచున్నవి.

'వణినసూనుకణాదబాదరాయణసూత్ర
ఫక్కి విద్వాంసు లుపన్యసింప.'

ఇందుఁ బ్రయోగింపఁబడిన వణిసూనుపద మసా
ధువు. కవిసార్వభౌముఁడును దనశృంగారనైషధమున

శా. 'ప్రాతఃకాలము పాయసంబు ఫణి నా
పత్యోక్త శాస్త్రంబులోన్.'

అనెను. పెద్దన యాత్రోవనే త్రొక్కెను. అష్టాధ్యాయి మొదలగు గ్రంథముల రచించిన వ్యాకరణశాస్త్ర ప్రవక్త పాణిని 'పాణిన' మునియొక్క సంతానముగాని పణినముని సంతానము గాదు. 'పణనం పణః 'పణోఽస్యాస్తీతి పణీ" నకారాంతమగు నీ "పణిన్" శబ్దముపై గోత్రాపత్యార్థమున "అణ్" ప్రత్యయము రాఁగా "పాణిన" యను రూప మేర్పడినది. పదపడి యువాపత్యార్థమున "ఇఞ్" ప్రత్యయము రాఁగా "పాణిని" యనురూప మేర్పడినది. ఎట్లయినను బాణిని పాణినసూనుఁ డగునుకాని పణినసూనుఁడు గాఁడు. ఇది సమర్థింపనెరవు గానరాదు. మఱియుఁ గృత్యావతరణమున

'కౌఁగిఁతం బసిఁ గుకవి పృథ్వీభృత్స మీపస్థలిన్'

అనుచో న్యూనతా యనునర్థమునఁ "గౌఁగిఁత" యను పదము సరి యగుఁ గాని, 'శూల' మను రెండవయర్థమున 'కొఁఱఁత' అను రూపము సరికాదు. కొఱుశబ్దమునుండి యట్టిరూప మేర్పడనేరదు.

'కౌఁగిలిది యెక్కడ హా విధి యేమి సేయుదున్'

కౌఁగిలి అది, అనుచో నికారసంధి కావింపఁబడినది.

'అనాశ్వాసితదుఃఖితే మనసి సర్వ మసహ్య మనన్నెఱుంగవే'

ఇచ్చో "అనన్నెఱుంగవే" యని పోతన్నగారు ప్రయోగించెడు తెలుఁగునఁ బ్రయోగింపఁబడినది. ఈ సంధిసమంజమైనది కాదు.

అమృతరసపూర మగు పెద్దన్నగారి సరసకవితా ప్రసారమున నీ నలుసులు పరిగణనీయములుగావు. ఆ నెఱఁగి యాంధ్రకవనము నీతఁడు కూర్పఁగల్గిన ట్రెటీవల నెఃవ్వరును గూర్పనేరరైరి.

కొంటె కోణంగి యగు కవిచౌడప్పయును దన వెక్కిరింపు స్వభావమును మాని

క. పెద్దన వలెఁ గృతిచెప్పినఁ
బెద్దనవలె నల్పుఃవినిఁ బెద్దనవలెనా?
యెద్దనవలె మొద్దనవలె
గ్రద్దనవలెఁ గుందవరపుఁ గవిచౌడప్పా!

అని పెద్దనార్యునిఁగూర్చి తన మెప్పును వెల్లడించెను. కృష్ణరాయలవంటి రాజచూడామణిని బెద్దనార్యునివంటి విద్వత్కవిరత్నమును గాంచుభాగ్య మాంధ్రదేశమున కిఁక నెన్నఁటికైనఁ గలుగఁగలదా!

ఉ. కూర్చినకూర్పులా! స్వరస
గుంభనముల్, కవితాప్రసారమా
తేర్చినతేనె! యంచు విను
తింపఁ బ్రబంధము సంతరించి లో
కార్చితుఁ డైన పెద్దనమ
హాకవిసత్కవితావిలాసముం
గూర్చి విమర్శ సల్ప నొనఁ
గూడు నె యొక్కని కల్పబుద్ధికిన్.

ఉ. ముద్దులు మూఁట గట్టునుడి
పొంకమునందును, మేల్మికూరుపుం
బద్దెపుబింకమందు, రస
బంధమునందుఁ, గథాప్రకారముం
దిద్దెడు తీర్పునందు గడి
దేఱినయాకవితాపితామహుం
బెద్దన నాంధ్రపుంగవుఁడుఁ
బెద్దసనారతముం దలంచెదన్.

## ౬

# శతావధాని

# వెంకటశాస్త్రి.

సీ॥ మోహనమ్మున జగన్మోహనంబుగఁ బద్య
పఠనంబు నిచ్చోటఁ బాదుకొల్పె
మాదృశాంతేవాసిమండలంబున కెల్ల
వేడ్కమై నిచ్చోట విద్య నేర్పెఁ
దేట తేటగఁ దియ్య దియ్యఁగా సత్కావ్య
నిర్మాణ మిచ్చోట నిర్వహించె
నుల్లాసవారాశి నోలార్చు నల్లారు
బెల్లంబు నిచ్చోటఁ జేర్చెఁ గనియె

తే॥ నెన్నఁటికి వీడరానట్టి యిట్టి యిట్టి
శాశ్వతానుబంధంబు లెసంగి యుండ
నెట్టు నిబ్బరించెనొ కదే యిట్టిపురము
వీడనాడంగ మాకవివీరవరుడు ?

నేను వెంకటశాస్త్రిగారిదగ్గఱఁ జదువుకొన నరిగిననాఁడు "అల పతంజలికృతం బయిన భాష్యమునకే పరిఘవిల్లును మహాభాష్యపదము" ఇత్యాది పద్యమును మోహనరాగరసమును బద్యభావము జీర్ణింపఁజేసి వారు చదువఁగాఁదన్మయత చెందితిని. అంతకుఁబూర్వము

భైరవ్యాది రాగములను దీగవార్చి పద్యముల నీడిగిలఁ బఱచి పౌరాణికులు చదువు చదువుతీరే నే నెఱిఁగినది.

రసస్ఫూర్తితోఁ దెలుఁగుపద్యములు చదువుచాతు రికినేఁడాంధ్రదేశమున శ్రీశాస్త్రిలుగారే యాచార్యపీఠము. ఆనాఁటినుండి ప్రతివిద్యార్థియు శ్రీశాస్త్రిలుగారింబోలి పద్యములు చదువుటకుఁ బ్రయత్నించువాఁడే ఎందఱో వారిపద్యపఠనానుకరణద్వారమున నాంధ్రభాషాపండితు లయిరి. వెంకటశాస్త్రిగారి శిష్యులలో వారిపద్యపఠన చాతుర్య మావంతైన నంటనివాఁడను నే నెఱిఁగి నంతవఱకు నే నొక్కఁడనే కానవచ్చుచున్నాను.

ఉ॥ కొంపలు వోని సత్కవన
గుంభన మంతయు మించి బింకముఁ
బొంకము గల్గఁగాఁ జవులు
పొంపిరివోఁ బఠియించు నేర్పు మా
వెంకటశాస్త్రి పండితక
విప్రభుచక్కటిఁ దక్కఁ దక్కవి
ద్యాంకులయందు నెందుఁ గల
దా సకలాంధ్రమహామహీస్థలిన్.

ఆనాఁడు బందరులో శ్రీ శాస్త్రిగారి యుపన్యాస సంపర్కము లేని పౌరసభ లుండెడివి గావు. వారి యుప న్యాస మన్న నే శ్రోతలు సభలోఁ గ్రిక్కిరియ నిండెడి వారు. వారి యుపన్యాసమునకు ముందు సందర్భము చక్కఁ జూచుకొనుట మొదలయిన జాగ్రత్త లక్కఱ

లేదు. ఐనను జాగ్రత్తపడి వచ్చి చెప్పినవారి యుప న్యాసముకంటె శ్రీశాస్త్రిలవారి యుపన్యాసముననే సంగ తులు చమత్కారములు హెచ్చుగ నుండెడివి. సభా నంతరము సభ్యులు వెంకటశాస్త్రిగారి వాక్చమ త్కృతినే సంస్తుతించుకొనుచు నిండ్లకేఁగెడివారు. ఆనాఁడు సభలకు పద్యములు, శుభలేఖలకు పద్యములు, స్వాగతములకు పద్యములు, సంగీతములకు పద్యములు, బంతులాటలకు పద్యములు, ప్రకటనములకు పద్యములు. అనాఁటినుండియే పద్యరచనాభిభీషికకు బరువు తగ్గినది. వెంకటశాస్త్రిగారికిఁ దీఱిక లేనపుడు వారివిద్యార్థులో, బడిబాలురో కూడఁ బద్యము లల్లి యిచ్చుచుండెడివారు. అంతకుఁ బూర్వము బందరుప్రాంతములకు బ్రహ్మశ్రీ నాదెళ్ల పురుషోత్తమకవిగారే పద్యరచనావిషయమున నద్వితీయులు.

పూర్వము భోజరాజు ముఖదర్శనమాత్రముననే పలువురు విద్వాంసులైరని ప్రతీతి. నేఁడు శ్రీ శాస్త్రిల వారి ముఖదర్శనమున నది ప్రత్యక్ష మయినది. స్కూలులో శ్రీ శాస్త్రిలవారు పాఠములు చెప్పకుండనే, తాము నను పాఠములు చదువకుండనే పరీక్షలలో నొదఁలో బాలకులు కృతార్థు లగుచుండిరి. అంతేకాదు. కవు లగుచుండిరి. మనలక్ష్మీకాంతకవిబ్రభృతు లట్టిస్కూలు విద్యార్థులలో నాఁటితేటిన జగజెట్టులే. ఇది యింత గాదు. శ్రీశాస్త్రిలవారిచే నెన్నఁడును జూడఁబడని

వారును గూడ వారి శిష్యులై యెందఱో నేఁడు సరస కవితారచనము నేర్చి సర్వాంధ్రదేశమునఁ బ్రఖ్యాతి గనుచున్నవా రున్నారు. ఈవిధముగా శ్రీశాస్త్రిలవారు విద్యావంశవృక్షమును దొలుత బందరుపురముననే యూనాఁ డంటు ద్రొక్కిరి. అది యిప్పు డాంధ్రదేశమున సర్వత్ర ప్రబలి చెల్లు గట్టుచున్నది. దీనికి శ్రీ శాస్త్రిల వారి కొకమంచిప్రతిఫలము గూడ లభించినది సుమండీ! గోదావరీతీరముననుండి కొనివచ్చి శ్రీశాస్త్రిలవారు బంద రున విద్యావంశవృక్షము నంటు నాఁటినందులకు సరిగాఁ దామును బందరునుండి యపురూపము నసాధారణము నైన జహంగీరుమామిడియంటును గోదావరీతీరమునకుఁ గొనిపోయి తమతోఁటలో నాఁటికొనిరి. వారిమూలము ననే జహంగీరుమామిడి కూడ నక్కడనుండి సర్వాంధ్ర దేశమునను వ్యాప్తినొందుచున్నది.

శ్రీ శాస్త్రిగారు నివసించిబహువర్షములు కవితా మృతప్రపను సాగించిన భైరవప్రెస్సుప్రక్క యుంటిపట్టు ధనాఢ్యుపపత్తు లనుకూలించెనేని వారిపేర విద్యాస్థాన ముగా వెలయించుట యుక్తమని నాయెన్నిక.

శ్రీ తిరుపతివేంకటేశ్వరకవీశ్వరుల శతావధాన సత్ప్రబంధచాటుధారాకవితాచమత్కారములఁ గూర్చి ప్రశంసాలేశము జరుప నారంభింపనున్న నాకీ సందర్భ మున

చ. పరిణత పాండితీబలమ
        భంగుర ధారణమాధురీపరి
స్ఫురితకవిత్వము గ్గలిగి
        శుభ్రయశంబు గణించుకొన్న మా
తిరుపతిశాస్త్రి సత్కవి గ
        తించెనె యాంధ్రవచోవధూటికిన్
స్థిరతరకావ్యభూషణవి
        శేషపరిష్క్రియ తీరిపోయెనే!

అన్నవిచారము కొంత తొట్రు గల్గించినది. కాని తిరుపతివెంకటేశ్వరులు భిన్నశరీరులైనను గవితావిషయమున నొక్కరే. శ్రీ వెంకటశాస్త్రిగారు కవిత రచించుచున్నంతవఱకును శ్రీ తిరుపతిశాస్త్రిగారును నున్నవారే. వెంకటశాస్త్రిగారి కవితాగంగాస్రవంతిలో తిరుపతిశాస్త్రిగారి కవితాసరస్వతి యంతర్వాహినిగా నున్నది.

క. సుతకవితామృతవాహిని
నతిలోకయశశ్శరీర మగపడుచుండన్
మృతి యనె తిరుపతికవికిన్
జత యగు వెంకటకవీంద్రుచా టయి యుండెన్.

అని యూరడిల్లితిని. తిరుపతివెంకటకవు లెక్కడేని యవధానము చేసి రనఁగా నా చుట్టుపట్టులవారనేకులు ప్రతిభాసౌధమున పదిమెట్లు లెక్కిరన్నమాటే. మెదడు కమలిపోవునో, నరముల బిగువు సడలి శరీరము నకనకలాడునో యని సాధారణబుద్ధిమంతులు సందే

హించునట్లు పగలు శతావధానతంత్రము జరపి, రాత్రి పదిగంటలదాఁకఁ బరిపరివినోదములఁ బాల్గొని తరువాత నిమ్మకు నీ రెత్తినటుల నిశ్చలముగా నిద్రపోయి మఱు నాఁటి ప్రొద్దుట మఱల మందహాసవదనముతో నల్పా హారములనైన నారగింపక యవధాన శేషమునుబూరింప నారంభింతు నీ జంటకవుల యంతఃకరణములు శ్రుతి కలసి యొకే 'మనము' అయ్యెడివి. అదియొక వింతతీరు. ఆసమ యములందు వెంకటశాస్త్రిగారు విశ్వమూర్తులు!

తిరుపతివెంకటేశ్వరుల కవితాధార ప్రాచీనసంప్ర దాయ ఘట్టములఁ ద్రవ్వి త్రవ్వి యూట యూరించి చేది చేది పాటించినది కాదు; స్వయము ఉద్బుద్ధ మైన బుగ్గధార! వారు ప్రాచీనగ్రంథములకంటె హెచ్చుగాఁ బ్రస్తుతపరిసర పరికరములనే చదివిరి. కావుననే సంప్ర దాయమాత్రపరిజ్ఞాతలు కొందఱు వారికవితను సంప్ర దాయదూర మైనదానిగాఁ గ్రొత్తతీరు గలదానిగాఁ దలఁ తురు. నేఁటియువకవులు వారికవితను నవకవితామార్గో పదేశకమును గా నారాధింతురు.

తిరుపతివెంకటకవులు ప్రౌఢపండిత ప్రభుసభల లోనే కాదు. బాలపామర జారచోరాదుల గోష్ఠులలో గూడఁ గవితాచమత్కారములను గల్పించి సత్కార ములను బడయఁగలరు. వెంకటశాస్త్రిగారికి లల్లాయి పదములు పాడ వేడుక; కొల్లాయిగుడ్డలు వాడ వేడుక. వారికి భాషాడంబరము గిట్టదు. అట్టె వేషాడంబరమును

గిట్టను. కనుకనే వారి కవితాకన్య 'జనముద్దు' గా వెలసినది. వారిచనవు అల్లారుబెల్లముగ నందటికి నాస్వాద్యమైనది. సమయస్ఫూర్తి, హాస్యయుక్తి ప్రయుక్తి, చమత్కారము వెంకటశాస్త్రిగారికి నాజానజములు నలవాటు. ఇట్టివారు నూఱేండ్లకుముందు నడిమింటి మంగళేశ్వరశాస్త్రిగా రొక రని వింటిని. బ్రహ్మశ్రీ వేదము వెంకటరాయశాస్త్రిగారిని నింకొకరిని గంటిని. మంగళేశ్వరశాస్త్రిగారు బొబ్బిలిరాజసభలో నక్క కుడిప్రక్కనుండి యెడమప్రక్కకు పాటినమేలా, యెడమప్రక్కనుండి కుడి ప్రక్కకు పాటినమేలా యని ప్రశ్నరాఁగా, అది కఱవనిచో నెటు పాటినను మేలే యని రఁట! వెంకటశాస్త్రిగారు బందరు హైస్కూలు పండితపదమునఁ బ్రవేశింపఁ గ్రొత్తగావచ్చినప్పుడు నైష్ఠికశ్రేష్ఠులయిన బ్రహ్మశ్రీ జంధ్యాల గౌరీనాథశాస్త్రిగారియింట పట్టుబట్ట మడి గట్టుకొని భోజనముఁ జేయుచుండగా "పట్టుబట్ట యెంతకాలముదాఁక మడి యుండీ" యని గౌరీనాథశాస్త్రిగారు ప్రశ్నింపఁగా వెంకటశాస్త్రిగారు "చెమటకంపు గొట్టకున్నచో నెన్నాళ్లకైనను మడియే" యనిరఁట! ఇది యొక చమత్కారలేశము. ఇట్టివి వెంకటశాస్త్రిగారి చమత్కారము లనేకములు.

ప్రాచీనాంధ్రకవులలోఁ బ్రబంధములకంటె శాశ్వతము లగునట్లు చాటురచనలను సాగించినవాఁడు శ్రీనాథుఁడు. అతని చాటురచనలను నేఁటికిని నాంధ్రరసికుల

నాలుకలపై నాట్య మాడుచున్నవి. వర్తమానాంధ్ర కవులలో నట్టివారు మనతిరుపతివెంకటేశ్వరకవీశ్వరులు.

పదునైదేండ్లకుఁ బూర్వము విశాఖపట్టణమండలమున శృంగవరపుకోటనుండి యేదో యొకయూరికి రాత్రివేళ బండిమీఁదఁ బ్రయాణమై నే నేఁగుచుంటిని. ప్రక్కబండిలో నొక పట్నాయకుడు "ఇంజరం బొక సాక్షి యేనాము దా సాక్షి-పల్లెపాలెంబు దా నెల్ల సాక్షి— ఇత్యాది పద్యమును బాడుచు నడుమ – "శంకరుం డాతనిసాని సాక్షి" యనుపట్టున నాఁగి యొక నవ్వు నవ్వి మరల నారంభించి పద్యము ముగియఁ జదువుట వింటిని. తిరుపతి వెంకటకవుల చాటుధారలు మలయమారుతపుఁ బింజెలు. అవి యాహ్లాదజనకములై సర్వాంధ్రప్రపంచము నలముకొన్నవి. లక్షలకొలఁది గ్రంథసంఖ్య యుండునట్లు (ముప్పదిరెం డక్షరముల రచనమునకు గ్రంథ మని పేరు) బహుగ్రంథముల రచించు కవీశ్వరులు పలువు రిప్పు డున్నారు గాని వారి పద్యములు గొన్నియేని హాయి మని పండితులు గాని, పామరులు గాని పలువురు పలుమాఱులు పఠించునవిగా నున్నవా యను ప్రశ్నకు సమాధానము చదువరులే సమాలోచింపఁ దగుదురు.

శ్రీ వెంకటశాస్త్రిగారికిఁ బ్రాయపుఁబ్రొద్దు కొంత పడమటికిఁ దిరుగ నారంభించెను. విద్యావివాదసంజ్వరము గొంత చల్లనాఱెను. అన్నవస్త్రములకుఁ గొఱంత లేని

స్థితి యేర్పడెను. ఇట్టిస్థితిలోఁ దమ కప్పటికి సంతానము కలుగకున్నను సంతానవంతుఁడై వంశవృద్ధి కల్గింపఁ గల్గెననుకొనుచున్న చిన్న వెంకటశాస్త్రిగారు పుత్రసంతాన రహితులుగానే కీర్తిశేషు లయిరి. ఆనాఁడు శ్రీ వెంకట శాస్త్రిగారు స్వైకాశ్రయమై యున్న చెళ్ళపిళ్ళ వంశ వృద్ధిని దలపోసి యస్మదాది శిష్యగోష్ఠిలో నొకనాఁ డాపరాని విధమున దుఃఖార్తు లయిరి. అల్పకాలముననే భగవంతుఁ డనుగ్రహించెను. వెంకటశాస్త్రిగారు గృహా రామ ధనకనక వస్తువాహన సమృద్ధితోపాటు సత్సం తానలాభమును గూడఁ బడసిరి. ఆనందమయముగా జీవయాత్రను గడప నవవృపడెను. ఆకాలమున నట్టి యానందసందర్భమున నే నొక జాబులో శ్రీ శాస్త్రులు గారికి వ్రాసినపద్యమిది :

సీ॥ గాటఁపుఁదమిఁ దోఁట నాఁటుకొన్నారు నిం
దారఁ బండెనె జహంగీరుమావి ?
యవధానములుసూడ నభ్యర్థితులు వేఁడ
నేఁగుచుందురె యిప్పు డెచటికేని ?
సత్కవితారహస్యము లభ్యసింపఁగా
వచ్చుచున్నదె శిష్యవర్గ మిపుడు ?
భగవత్పరము లైనపరమార్థరచనముల్
క్రొత్తవి యేవేనిఁ గూర్చినారె ?
కులుకుఁగుబ్బల నునుదొక్కుఁ బలుకులందుఁ
బ్రౌఢి మీఱినసుకవితాఫణితులందుఁ

బరువుగల యంటుమామిడిపండులందుఁ
జక్క గుఱుతించుచుందురే చవులవారి ?

శ్రీ వెంకటశాస్త్రిగారు నెలలబాలురై యుండఁగా వారి తండ్రిగారు కడియమునుండి వారిని విజయనగరపు జేగగ్రామమునకుఁ గొనిపోయి యక్కడ వారిం గూర్చి పక్షిప్రశ్న మడిగిరఁట! ఆ ప్రశ్నగ్రంథమున వారిని గూర్చి కొన్ని శ్లోకము లున్నవి. అందు స్వసమానవయశ్శక్తిమంతుఁ డగునొకసుకవితోఁ గూడి బహుగ్రంథములు రచించుకవి యగుట, రాజపూజితు లగుట మొదలగు విషయము లేవో కొన్ని తర్వాత వాస్తవము లయినవి గలవు. తుద నందు "షష్టిసంవత్సరకీర్తిమాన్" అని కలదు. ఆ తుదిపలుకునకు షష్టిపూర్త్యుత్సవవైభవసందర్భమున గొప్పకీర్తి గల్గునని యర్థము చెప్పవలె నని నేను నిశ్చయించుకొన్నాను.

వెంకటశాస్త్రిగారు విద్వద్రాజగోష్ఠులయందు వివిధసత్కారములఁ బడసిరి; విద్యావివాదములందు విజయము లందిరి; రసకావ్యములఁ బెక్కింటి రచియించిరి; చాలమంది శిష్యులకుఁ జదువు చెప్పిరి. సంతానసమృద్ధిని బడసిరి; సకలసంపదలఁ బడసిరి; సమానులలో నుత్తమశ్లోకు లయిరి. ధర్మార్థకామములందుఁ బరిపూర్ణ మయిన పరితృప్తి వారికి దొరకిన దనియే నా విశ్వాసము.

భారత ముద్రణాలయము,
విజయవాడ-2.